www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 273 | ఆదివారం | 25 మార్చి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

కరెంట్ చార్జీలు పెంచం

• మంత్రి జగదీశ్‌రెడ్డి



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని ఆ శాఖమంత్రి జగదీష్‌రెడ్డి స్పష్టం చేశారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి తరువాయి 6లో

బల్దియా భళా



బాండ్ల రూపంలో రూ.1000 కోట్లు సేకరించినందుకు హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.26 కోట్ల నగదు బహుమతి ప్రకటించిన కేంద్రం 7లో

చంద్రబాబుది రాజకీయ యావే




లెక్కలు చెప్పకుండా నిధులడిగితే ఎలా?

ఎపికి రెండింతలు సాయం అందింది

విభజన చట్టం వాగ్దానాలు కేంద్రం నిలబెట్టుకుంది

9 పేజీల లేఖలో అమిత్ షా అస్త్రాలు

న్యూఢిల్లీ : రాజకీయ యావతోనే చంద్రబాబు నాయుడు తమతో తెగతెంపులకు దిగుతున్నారని బిజెపి అధ్యక్షుడు అమిత్ షా విమర్శించారు. బిజెపి– టిడిపి మిత్రవిచ్ఛిన్నం అంశంపై తొలిసారిగా అమిత్ షా స్పందించారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగానే వ్యవహరిస్తున్నారని తెలిపారు. కేంద్రంపై చంద్రబాబు చేస్తున్న ఆరోపణలలో నిజం లేదని, నిరాధార అంశాలతో చేస్తున్న విమర్శలకు విలువ లేదని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను కేంద్రం దెబ్బతీస్తోందని, ప్రత్యేక హోదా విషయంలో తరువాయి 6లో



అమిత్ షా లేఖ తప్పుల తడక

• చంద్రబాబు ఎదురుదాడి 11

ఏరా ఫాల్తూ..

- దుర్భాషలతో దూషించి చేయి చేసుకున్న ఎస్ఐ
- హెడ్‌కానిస్టేబుల్ దామోదర్‌రెడ్డి సూసైడ్ లేఖ
- ఎస్ఐ లవకుమార్ సస్పెన్షన్

7

కొత్త మున్సిపాల్టీలు

21 నగర పంచాయతీలను పురపాలక సంఘాలుగా మారుస్తూ జిఒ

మన తెలంగాణ/ హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా 21 నగర పంచాయతీలను మున్సిపాలిటీలుగా స్థాయిని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అర్హతల ఆధారంగా వాటిని మున్సిపాలిటీలుగా గుర్తిస్తూ మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్‌కుమార్ జిఒ జారీ చేశారు. తెలంగాణ మున్సిపల్ యాక్ట్ 1965 సెక్షన్ 2, సబ్‌సెక్షన్ 22 ప్రకారం నగర పంచాయతీలైన బడంగ్‌పేట, పెద్దఅంబర్ పేట, నర్సంపేట, సత్తుపల్లి, గజ్వేల్, వేములవాడ, కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం, హుజూర్‌నగర్, జమ్మికుంట, నాగర్‌కర్నూల్, పరకాల, హుజురాబాద్,




మధిర, హుస్నాబాద్, బడెపల్లి, అచ్చంపేట, లీజ, దేవరకొండ, కొల్లాపూర్, ఆంథోల్– జోగిపేట నగర పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చారు. కాగా, గ్రామ పంచాయతీలను నగర పంచాయతీలుగాను, నగర పంచాయతీలను మున్సిపాలిటీలుగా గుర్తిస్తామని ఇది వరకే ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే ఇప్పటికే వివిధ గ్రామ పంచాయతీల నుంచి, నగర పంచాయతీల నుంచి మున్సిపాల్ శాఖకు ప్రతిపాదనలు అందాయి. జనాభా, ఆదాయం తదితర అంశాలను పరిశీలించిన ప్రభుత్వం 21 నగర పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చింది. త్వరలోనే గ్రామ పంచాయతీలను పురపాలికలుగా విలీనం చేసే అంశంలో కూడా నిర్ణయం తీసుకోనున్నారు.

పంచాంగం

శ్రీచాంద్రమాన విళంబినామ సంవత్సరం,
ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్రమాసం
తిథి : శుక్ల. అష్టమి ఉ.7.33 వరకు
తదుపరి నవమి తె.5.12 వరకు
(తెల్లవారితే సోమవారం)
నక్షత్రం: ఆరుద్ర ప.2.03 వరకు
అనంతరం పునర్వసు
వర్జ్యం: రా.1.11 - 2.36 వరకు
దుర్ముహూర్తం : సా.4.30 - 5.18 వరకు
రాహుకాలం: సా.4.30 - 6.00 వరకు
యమగండం: ప.12.00 - 1.30 వరకు
శుభసమయాలు: లేవు
స్మార్త శ్రీరామనవమి

- 3న ఢిల్లీకి సిఎం కెసిఆర్? 3
- 2 ఆరు బిల్లులకు అసెంబ్లీ ఆమోదం
- 3 తమ్మిడిహట్టి వద్ద కడితే చుక్కనీరు దక్కేది కాదు : హరీశ్
- టిజిటి గణితం టీచర్ ఫలితాల విడుదల 6
- 3 వేములవాడకు మాస్టర్ ప్లాన్: కెటిఆర్

తాగి ఇతరుల ప్రాణాలు తీయొద్దు : నాయిని



మన తెలంగాణ/హైదరాబాద్: మనిషిని చూడగానే నేర చరిత్రను గుర్తించే యంత్రాంగం అమెరికా తర్వాత హైదరాబాద్‌లోనే ఉన్నదని హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. పోలీసు శాఖలో అనేక సంస్కరణలను అమలు చేస్తూ తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని అన్నారు. 'తాగండి. ఇంట్లో పడుకోండి. కానీ బండ్లు నడిపించి ఇతరుల ప్రాణాలు తీయొద్దు'అని అన్నారు. షీ బృందాలను పెంచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. శాసనసభలో శనివారం హోం, కార్మిక శాఖ పద్దులపై జరిగిన చర్చకు మంత్రి నాయిని సమాధానమిస్తూ శాంతి భద్రతలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త పోలీసు వాహనాలు సత్ఫలి తాలనిస్తున్నాయని, దొంగల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయని చెప్పారు. హైదరాబాద్ కేంద్రంగా ఏర్పాటు చేయబోతున్న కమాండ్ కంట్రోల్ విభాగాన్నిఅన్ని జిల్లాలకు అనుసంధానం చేయబోతున్నామని, తద్వారా ఎక్కడ ఏం జరిగినా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. వివిధ కూడళ్ల వద్ద ఉన్న కెమె రా వంద పోలీసులతో సమానమని, అందుకే ఇతర రాష్ట్రాలకు చెందిన దొంగలు రావడం లేదని, నేరాల సంఖ్య కూడా తగ్గిందని వివరించారు. జైల్లో ఖైదీలలో పరివర్తన తెచ్చేందుకు అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నామన్నారు. మహిళాలను వేధింపులకు గురిచేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అవిశ్వాసానికి టిఆర్‌ఎస్ మద్దతివ్వాలి



మన తెలంగాణ/హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోడీ పాలనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న అవిశ్వాస తీర్మానానికి టిఆర్‌ఎస్ మద్దతు తెలిపి తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలని జగిత్యాల కాంగ్రెస్ ఎంఎల్‌ఎ టి.జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాజ్యాంగ బద్ధంగా నిరసన తెలిపే హక్కును కూడా తెలంగాణ ప్రభుత్వం తమకు ఇవ్వడం లేదన్నారు. పార్లమెంటులో స్పీకర్ మొహం ముందే ప్ల కార్డులను పట్టుకుని టిఆర్‌ఎస్ ఎంపిలు నిరసన తెలుపుతున్నారని, సస్పెన్షన్‌కు గురైన తాము గవర్నర్ ప్రసంగం రోజున కనీసం అసెం బ్లీ వెల్‌లోకి కూడా పోలేదన్నారు. అయినా సభ నుండి తమను సస్పెండ్ చేశారన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో శనివారం నాడు టి . జీవన్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ ఈ నాలుగేళ్లలో టిఆర్‌ఎస్ అనేక సార్లు ఎన్‌డియే ప్రభుత్వానికి మద్ధతు తెలిపిందని, తాజాగా ఎన్‌డియే పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతుండడంతో టిఆర్‌ఎస్‌కు ఏం చేయాలో దిక్కు తోచడం లేదన్నారు. గడచిన నాలుగేళ్లుగా ప్రధాని మోడీ చేతిలో సిఎం కెసిఆర్ ఒక పావుగా మారారన్నారు. అందుకే సిఎం కెసిఆర్ శికండి పాత్ర పోషిస్తున్నారన్నారు. గిరిజన రిజర్వేషన్ బిల్లు విషయంలోనూ తెలంగాణ ప్రభుత్వం కేంద్రంపై నెపం పెడుతూ దోబూచులాడుతోంన్నారు.

ప్రైవేట్ రంగంలోనూ రిజర్వేషన్లు : ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ తరహాలోనే ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లను పాటించాలని సిపిఐ(ఎం) ఎంఎల్‌ఎ సున్నం రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిఎస్ఐపాస్‌లో ఏదైనా సంస్థ కంపెనీ స్థాపించుకుంటామంటే వాళ్లకు భూమి, నీళ్లు, కరెంటు, సబ్సిడీలు, రాయితీలు ఇలా అన్నీ ప్రభుత్వమే సమకూరుస్తున్నప్పుడు నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనలో ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లను ఎందుకు అమలు చేయడం లేదన్నారు. ఇకనైనా ఉద్యోగాల్లో రిజర్వేషన్ పాటించి వారిని ఆదుకోవాలన్నారు.

జబ్బలు చరుచుకుంటే సరిపోదు

మన తెలంగాణ/హైదరాబాద్: పోలీసుశాఖను పటిష్టం చేశామంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం రాష్ట్రంలో నేర నియంత్రణ, మహిళలపై దాడులు పెచ్చుమీరుతున్న విషయాన్ని విస్మరిస్తోందని బిజెపి శాసన సభ్యుడు చింతల రామచంద్రారెడ్డి వ్యాఖ్యానించారు. జాతీయ నేర పరిశోధన సంస్థ లెక్కల ప్రకారం మహిళలపై జరురగుతున్న దాడుల్లో ఢిల్లీ మొదటిస్థానంలో ఉంటే హైదరాబాద్ రెండవ స్థానంలో ఉందని, మహిళలపై అతి క్రూరంగా దాడులు, లైగింక వేధింపులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు వ్యవస్థ పటిష్టతకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకున్నా, మహిళలపై దాడులు మాత్రం పెరుగుతూనే ఉన్నాయన్నారు. శాసనసభలో పలు పద్దులపై శనివారం జరిగిన చర్చ సందర్భంగాపై విధంగా వ్యాఖ్యానించారు. దేశంలో ఎక్కడాలేని మాదకద్రవ్యాలు హైదరాబాద్‌లో లభ్యమవుతున్నాయని, వినియోగం పెరిగిందని, కొన్ని రోజుల పాటు హంగామా చేసిన ప్రభుత్వం ఆ తర్వాత గాలికొదిలేస్తోందని, ఇప్పటి వరకు ఎన్ని మాదకద్రవ్యాల కేసులు నమోదు చేసిందో, ఏం చర్యలు తీసుకుందో వివరించాలని డిమాండ్ చేశారు. సెక్స్ రాకెట్ నిర్వహకులపై పి.డి యాక్టు నమోదు చేయాలని సూచించారు. నయీం కేసు వ్యవహారంలోనూ ఇదే వైఖరిని అవలంభిస్తోందని, పలువురు అధికారుల పై చర్యలు తీసుకున్న ప్రభుత్వం రాజకీయనేతలకు సంబంధాలు ఉన్నట్లు వార్తాకథనాలు వెలువడ్డా ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అవగాహనను కల్పించండి

మన తెలంగాణ/హైదరాబాద్: మైనర్లు వాహనాలు నడుపుతున్నారనే సాకుతో తల్లిదండ్రులతో సహా పిల్లలను జైళ్ళకు పంపడం సరికాదని ఎంఐఎం శాసనసభ్యుడు మొజంఖాన్ తెలిపారు. వాహనాలను నడిపే పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులకు చలాన్లను విధించి వారిలో ఒక రకంగా భయం కనిపించేలా స్టేషన్లకు పిలిచి అవగాహనతో పాటు చైతన్యాన్ని కల్పిం చాలన్నారు. ఫుట్‌పాత్ వ్యాపారులపై కూడా పోలీసులు కేసులు నమోదు చేసి జైళ్లను పంపుతున్నారన్నారు. వీటిపై రాష్ట్ర పోలీస్ యంత్రాగం స్పందించాలన్నారు. బతుకుదెరువు కోసం చిన్నపాటి వ్యాపారాలు చేసుకుని పొట్ట నింపుకునే వారిని వేధించడం సరికాదన్నారు. ఫైర్ స్టేషన్లను నియోజకవర్గానికి ఒకటి చొప్పున మంజూరు చేయాలన్నారు.

విధుల్లోకి తీసుకోవాలి

మన తెలంగాణ/హైదరాబాద్: పర్యాటకశాఖలో తొలగించిన కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని టిఆర్‌ఎస్ శాసన సభ్యుడు వినయభాస్కర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 30 ఏళ్లుగా టూరిజంలో పనిచేస్తున్న వారిని తొలగించడం సరికాదన్నారు. తెలంగాణ సంస్కృతిని ప్రపంచం నలుమూలలకు చేరుస్తున్నారన్నారు. వరంగల్ జిల్లాలోని ఆగ్నేయ గుట్టలోని జైనుల పాలనకు సంబంధించిన అనవాళ్ళులున్నాయని, వీటిని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. పర్యాటకశాఖను మరింత అభివృద్ధి చేసుకొని ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు.

విఐపి కల్చర్‌ను విడనాడాలి

మన తెలంగాణ/హైదరాబాద్: విఐపి కల్చర్‌ను విడనాడేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నపాటి ప్రజాప్రతినిధికి సైతం పోలీసులు అత్యుత్సాహంతో ఎస్కార్ట్ వాహనాలు, హారన్లతో స్థానికులను బెంబేలెత్తిస్తున్నారని ఆరోపించారు. కేంద్రప్రభుత్వం ఈ కల్చర్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకున్నా రాష్ట్రంలో మాత్రం ఇంకా తొలగిపో లేదని, వాహనాలు, హారన్లతో హడలెత్తిస్తున్నారని తెలిపారు. పోలీసులకు సమకూర్చిన ఆధునిక వాహనాలను వ్యవస్థను పటిష్టం చేసేందుకు అందిస్తే వాటిని మరోరకంగా వినియోగించడం సమంజసం కాదని అన్నారు.

బడిలో అమ్మ ఒడి పలుకులు

- రానున్న విద్యాసంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో తెలుగు తప్పనిసరి
- తెలుగు భాషను కాపాడుకునేందుకే ఈ చర్యలు: కడియం
- ఆరు బిల్లులకు అసెంబ్లీ ఆమోదం



మన తెలంగాణ/ హైదరాబాద్ : వచ్చే విద్యా సంవత్సరం నుండి రాష్ట్రంలోని ఒకటి నుంచి పదవ తరగతి వరకు అన్ని పాఠశాలల్లో దశల వారీగా తెలుగు భాష బోధన, అధ్యయనాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేయనుంది. ఈ విధానాన్ని రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ, ఇతర భాష పాఠశాలల్లో కూడా ఖచ్చితంగా అమలు చేయనుంది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి ప్రవేశపెట్టిన తెలంగాణ పాఠశాలలో తెలుగుభాష బోధన, అధ్యయనము, నిర్బంధన చేసే బిల్లును శాసన సభ శనివారం ఏకగ్రీవంగా ఆమోదించింది. దీని ప్రకారం ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు తెలుగుతో పాటు ఇంగ్లీష్ నేర్చుకునే అవకాశం కల్పిస్తారు. తొలుత తెలుగు భాష పాఠ్యాంశాన్ని మొదటి తరగతిలో ప్రవేశపెడతారు. అనంతరం ఉన్నత పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి తెలుగు భాషను ప్రవేశపెడుతారు. ఆరో తరగతిలో ప్రవేశపెట్టే తెలుగు భాష చాలా సులభతరంగా ఉంటుంది. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి బిల్లు ఉద్దేశాన్ని వివరిస్తూ అమ్మ ఒడి పలుకులు బడి పలుకులు కావాలనే లక్ష్యంతోనే తెలుగు తప్పనిసరి అమలు బిల్లును తీసుకొచ్చామన్నారు. ఉమ్మడి రాష్ట్ర పాలనలో పాలకులు తెలుగును నిర్లక్ష్యం చేయడంతో ప్రజలు తెలుగు భాషను మ రిచిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. తెలుగు భాష గొప్పతనాన్ని నిలబెట్టేందుకు, తెలుగు భాషకు పూర్వ వైభవం తెచ్చేందుకు, తెలుగుకు పట్టం కట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కమ్మనైన తెలుగు భాషను కాపాడుకునేందుకే ఈ నిర్ణయమని మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో చదివే ప్రతి విద్యార్థి తెలుగు భాష తప్పనిసరిగా చదవాలనే మంచి ఉద్దేశ్యంతో సిఎం కెసిఆర్ ఉన్నారని, అంతే కాకుండా తెలుగు భాష గొప్పతనాన్ని చాటేందుకు ఇటీవలే తెలుగు ప్రపంచమహాసభలు బ్రహ్మాండంగా నిర్వహించారన్నారు. తెలంగాణలో తెలుగును అమలు చేయడం కోసం తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ సిదారెడ్డి ఆధ్వర్యంలో కమిటీ తమిళనాడు, పంజాబ్‌లలో పర్యటించి, అక్కడ మాతృభాషను అమలు చేస్తున్న తీరును అధ్యయనం చేశారన్నారు. తమిళనాడు విధానంలో తెలుగు భాషను అమలు చేయనున్నట్లు వివరించారు. తెలుగు భాషను తప్పనిసరి చేయడం కోసం రూపొందించే సిలబస్ బాధ్యతలు తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలుగు విశ్వవిద్యాలయంకు అప్పగించామన్నారు. రాష్ట్రంలో ఉన్న ఇతర రాష్ట్రాల భాషల విద్యా సంస్థల్లో కూడా తెలుగును తప్పనిసరి చేశామని, అయితే తెలుగుతో పాటు వారి మాతృ భాష ను నేర్చుకోవచ్చన్నారు.

అసెంబ్లీలో తెలుగేది : అసెంబ్లీ కార్యకలాపాల నుంచి ప్రభుత్వ ఉత్తర్వుల వరకు తెలుగులోనే జరగాలని బిజెపి శాసనసభాపక్ష నాయకులు జి.కిషన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ కార్యకలాపాలు కూడా తెలుగులోనే జరగాలన్నారు. మంత్రులు కూడా బిల్లులు ఆమోదించే సమయంలో 'ఐ బెగ్' అంటూ సంబోధించడం విచారకరమన్నారు. అసెంబ్లీ నుంచే తెలుగు భాషా ఉద్యమం మొదలు కావాలన్నారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ పోటీ పరీక్షలు తెలుగులో రాసే వారికి వెయిటేజీ ఇవ్వాలని కోరారు. ఎంఐఎం సభ్యులు జాఫర్ హుస్సేన్ కోరారు. ఇ తర మాతృభాషల వారికి తెలుగు ఉత్తీర్ణత మార్కులు 20 గా నిర్ణయించాలని సూచించారు. అలాగే శాసనసభ శనివారం మొత్తం ఆరు బిల్లులను ఆమోదించింది.

పేదలకు న్యాయం కోసమే : అసైన్డ్ భూముల పట్టాల బదలాయింపు చట్ట సవరణ బిల్లును శాసనసభ ఆమోదించింది. ఈ సవరణ ప్రకారం ఇప్పటికే భూమి లేని పేదలకు అసైన్ చేసిన భూములను భూమి లేని ఇతర పేదలు కొనుగోలు చేసిన భూములను క్రమబద్ధం చేసేందుకు వీలు కలుగుతుంది. ఇప్పటి వరకు అసైన్డ్ భూముల బదలాంపుపై నిషేధం ఉంది. ఉప ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీ బిల్లు ఉద్దేశ్యాన్ని వివరిస్తూ భూమి లేని పేదలకు గతంలో ప్రభుత్వం అసైన్ చేసిన భూములు ఎక్కువగా మూడవ పక్షం చేతిలో అనధికారికంగా ఉన్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, వాటిని క్రమబద్దీకరించి పేదలకు న్యాయం చేసేందుకే ఈ సవరణ చేస్తున్నట్లు చెప్పారు. పిజి వైద్య విద్యార్థులు తప్పనిసరిగా గ్రామాల్లో ఏడాది పని చేయాలని నిబంధన ప్రభుత్వం తొలగించింది. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను మెరుగుపర్చేందుకు స్పెషలిస్టు వైద్య విద్యను పూర్తిన వైద్యులు ఏడాది పాటు గ్రామాల్లో తప్పనిసరిగా పనిచే యాలని గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ నిబంధనను ప్రభుత్వం సవరిస్తూ వైద్య మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి ప్రవేశపెట్టిన బిల్లును శాసనసభ ఆమోదించింది.

డిజిపి నియమకం అధికారం రాష్ట్రానికే
రాష్ట్ర డిజిపి ఎంపిక, నియామకాన్ని రాష్ట్రం పరిధిలోకి తీసుకువచ్చే బిల్లును శాసనసభ ఆమోదించింది. డిజిపి ఎంపిక కోసం ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కొన్ని పేర్లను కేంద్ర ప్రభుత్వానికి పంపితే, అందులో నుండి మూడింటిని సిఫార్సు చేసే విధానం అమలవుతుంది. కేంద్ర పరిధిలో ఉన్న రాష్ట్ర డిజిపి ఎంపిక, నియామక ప్రక్రియను రాష్ట్రం పరిధిలోకి తీసుకువస్తూ హోంమంత్రి నాయిని నరసింహారెడ్డి ప్రవేశపెట్టిన బిల్లును శాసనసభ ఆమోదించింది. మంత్రి బిల్లు ఉద్దేశ్యాన్ని వివరిస్తూ డిజిపి నియమకం అధికారాన్ని ప్రశ్నిస్తూ దాఖలైన కేసును విచారించిన సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేక చట్టం ద్వారా డిజిపి నియామకం అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోకి తీసుకోవచ్చని స్పష్టం చేసిందని, ఇప్పటికే అన్ని రాష్ట్రాలు ఈ మేరకు చట్టాలు తీసుకువచ్చాయన్నారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్రం కూడా చట్టం తీసుకువచ్చిందన్నారు. ఈ బిల్లులతో పాటు తెలంగాణ అడ్వకేట్స్, క్లర్కుల సంక్షేమ నిధి చట్ట సవరణ బిల్లులకు సభ ఆమోదం తెలిపింది.

అసెంబ్లీ సమావేశాలు పొడిగింపు?

ఈ నెల 29 వరకూ సమావేశాలు!
27న మంత్రివర్గం బేటి
పంచాయతీరాజ్ బిల్లుకు ఆమోదం

మన తెలంగాణ/ హైదరాబాద్ : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను మరో రెండు రోజుల పాటు పొడిగించే అవకాశం ఉంది. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ నెల 27వ తేదీన ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం పొందిన తరువాత ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడాల్సి ఉన్నది. అయితే పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు ప్రవేశపెట్టేందుకు వీలుగా ఆ తరువాత కూడా సభను నడిపించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం ఈ నెల 27న బిజినెస్ అడ్వయిజరీ కమిటీ(బిఎసి) సమావేశాన్ని ఏర్పాటుచేసే సభను 29వ తేదీ వరకు నిర్వహించే అంశంపై నిర్ణయం తీసుకునే అవకాశముంది. అదే రోజున మంత్రివర్గ సమావేశాన్ని కూడా ఏర్పాటు చేసి పంచాయతీరాజ్ చట్ట సవరణ ముసాయిదా బిల్లుకు ఆమోదం పొందనున్నట్లు సమాచారం.

ఈ నెల 12వ తేదీన జరిగిన మంత్రివర్గ సమావేశంలో పంచాయతీరాజ్ బిల్లుపై కూడా చర్చ జరిగినా కొన్ని అంశాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలిసింది. దీంతో ఏకాభిప్రాయం కోసం, అవసరమైన సవరణలు చేయడానికి వీలుగా మరోసారి ఈ నెల 27న మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం భావించినట్లు తెలిసింది. ఈ నెల 27న ద్రవ్య వినిమయ బిల్లుకు శాసనసభ ఆమోదం లభించిన తర్వాత అదే రోజున పంచాయతీరాజ్ బిల్లును ప్రవేశపెట్టి ఉభయసభల్లో చర్చల అనంతరం ఆమోదం పొందాలని ప్రభుత్వ భావన. ఈ బిల్లుపై రెండు రోజుల పాటు చర్చ జరిగే అవకాశం ఉన్నట్లు టిఆర్‌ఎస్ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో మొత్తం తొమ్మిది బిల్లులకు ఆమోదం పొందాలని ప్రభుత్వం భావించగా శనివారం ఒక్కరోజే ఆరు బిల్లులకు ఆమోదం లభించింది. మరో మూడు బిల్లుల్లో పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును కీలకమైనదిగా ప్రభుత్వం భావిస్తోంది. సర్పంచ్ ఎన్నిక ప్రత్యక్షమా లేక పరోక్షమా అనే ఊహాగానాలు వస్తున్న నేపథ్యంలో ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టడం ద్వారా స్పష్టత రానుంది.

ఐటిఐఆర్‌కు రూ. 3650కోట్లు అడిగితే 365 పైసలు కూడా ఇవ్వలేదు




మన తెలంగాణ/ హైదరాబాద్: ఐటిఐఆర్ ప్రాజెక్టు నిమిత్తం రూ.3650 కోట్లు ఇవ్వాలని కేంద్ర మంత్రిని 20 సార్లు కోరినా కనీసం 365 పైసలు కూడా కేటాయించలేదని పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. ఖాయిలాపడిన పరిశ్రమలను ఆదుకోవడం నుంచి అనేక విషయాల్లో కేంద్ర ప్రభుత్వం కేవలం పెదవులతోనే సానుభూతి(లిప్ సింపతి) వ్యక్తం చేస్తూ మాటల సహాయం తప్పా పైసల సహాయం చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలపై బిజెపికి చెందిన కేంద్ర మంత్రులు ప్రశంసలు కురిపిస్తుంటే, రాష్ట్రానికి చెందిన బిజెపి ఎంఎల్‌లు మాత్రం విమర్శిస్తున్నారని, వారి మధ్యే శృతి లేదన్నారు. పరిశ్రమలు, వాణిజ్యం,ఐటి, ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన పద్దులుపై శాసనసభలో శనివారం జరిగిన చర్చకు మంత్రి కెటిఆర్ సమాధానమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అద్భుత కార్యక్రామలను బిజెపి పాలించే 22 రాష్ట్రాలలో ఎక్కడైనా అమలుచేస్తున్నారా అని ప్రశ్నించారు. వరంగల్ టెక్స్‌టైల్ పార్కుకు సహకారం అందించాలని కేంద్ర మంత్రి స్మృతిఇరానిని కోరినా ఫలితం లేదన్నారు. 15వేల నుంచి రూ. 20వేలకు పెరిగిందన్నారు.ఐటిని విస్తరిస్తున్నామని, ఇప్పటి వరకు ఐటి ద్వారా 200 కంపెనీలు వచ్చాయని, తద్వారా 1.25లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. రాష్ట్రంలోని స్థానిక ప్రాంతాల పరిస్థితులకు అనుగుణంగా ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నామని, హరితవిప్లవానికి శ్రీకారం చుట్ట బోతున్నామన్నారు. 1973 నుంచి 2014 వరకు ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలో 28 ఎకరాల్లో 147 పరిశ్రమలను ఏర్పాటు చేస్తే, మూడున్నరేళ్లలో తాము 46 ఎకరాల్లో పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేశామన్నారు విభజన చట్టంలో పొందపర్చిన ఖమ్మం బయ్యారంలో ఉక్కు పరిశ్రమలో భాగంగా చత్తీస్‌ఘడ్‌కు బయ్యారానికి మధ్య 70 కిలోమీటర్ల రైలుమార్గాన్ని ఏర్పాటు చేయాలనికేంద్రాన్ని కోరినా స్పందిచలేదన్నారు. ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ ద్వారా ఖయిలాపడే పరిస్థితుల్లో ఉన్న 1730 పరిశ్రమలను బ్యాంకులు నిర్ధరక ఆస్తులుగా(ఎన్‌పిఎ) ప్రకటించకుండా ప్రయత్నించామని గుర్తు చేశారు. నీరవ్‌మోడి, విజయ్‌మాల్యా బ్యాంకులను ముంచి పారిపోతే పట్టించుకోని బ్యాంకులు చిన్న, మధ్య, సూక్ష్మ తరహా పరిశ్రమల విషయంలో మాత్రం నిబంధనల పేరుతో ఇబ్బంది పెడుతున్నాయని తాము గవర్నర్‌ను కలిసి ఇదే విషయాన్ని చెప్పామని గుర్తు చేశారు. టి ప్రైడ్ ద్వారా 8994 దళితపారిశ్రామిక సంస్థలు రాగా రూ. 542 కోట్లు, ఎస్‌టి సంస్థలు 7976 రాగా వారికి రూ. 363 కోట్లు మంజూరు చేశామన్నారు.

3 నెలల్లో నగరం వెలుపలికి వంద పరిశ్రమల

మరో మూడు, నాలుగు నెలల్లో హైదరాబాద్‌లోని వంద పరిశ్రమలను హైదరాబాద్ బయటకు పంపిస్తామని మంత్రి కెటిఆర్ ప్రకటించారు. దళిత, గిరిజన పారిశ్రామిక వేత్తలకు ఏప్రిల్ 14న రూ. 150 కోట్ల రాయితీలను అందిస్తామన్నారు. త్వరలోనే సిర్‌పూర్ కాగజ్‌నగర్ పేపర్ మిల్లును ప్రారంభిస్తున్నామని, అలాగే బిల్ట్ సంస్థను కూడా పునః ప్రారంభిస్తామని ప్రకటించారు. మైనింగ్‌లో కేవలం మూడున్నర సంవత్సరంలో వంద శాతం వృద్ధి సాధించామన్నారు. ప్రపంచ స్థాయిలో అత్యున్నత ప్రమాణాలతో హైదరాబాద్ శివారులోని ముచ్చర్ల ఫార్మాసిటీ ప్రాజెక్టును నిర్మిస్తున్నామని, ఈ ప్రాజెక్ట్ ద్వారా నాలుగు లక్షల మందికి ఉపాధి, భూములు కోల్పోతున్న ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగావకాశాన్ని కల్పిస్తామన్నారు.

అర్చకులకు ట్రెజరీ ద్వారా జీతాలివ్వలేం

దేవాలయ భూముల ఆక్రమణపై చర్యలు : మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



మనతెలంగాణ/హైదరాబాద్:రాష్ట్రంలో ధూపదీప నైవేద్యం పథకం కింద మరో 3వేల దేవాలయాలని ఎంపిక చేశామని దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. శనివారం శాసనమండలిలో సభ్యు లు పురాణం సతీష్‌కుమార్, బలసాని లక్ష్మి నారాయణలు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఈ పథ కం కింద 5209 దేవాలయాల నుంచి దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటి ఎంపిక కోసం అన్ని జిల్లాల్లో కమిటీలు వేశామని, పాత జిల్లాల వారీగా ఇప్పటి వరకు నాలుగు జిల్లాల నుంచే వివరాలు వచ్చాయని, మిగతా 5 జిల్లాల నుంచి రావాల్సి ఉందని చెప్పారు. ఆదాయం తక్కువ ఉన్న దేవాలయాలనే ఈ పథకం కింద ఎంపిక చేస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లో భక్తుల సంఖ్య ఎక్కువని ఇక్కడి దేవాలయాలకు ఆదాయం పుష్కలంగా ఉన్నందున ఈ పథకంలో హైదరాబాద్ జిల్లాను చేర్చలేదన్నారు. ట్రెజరీ ద్వారా 010 పద్దు కింద జీతాలివ్వాలంటే రిజర్వేషన్లు పాటించాలని, అర్చకుల ఉద్యోగాల్లో అది ఉండదని అం దుకే వారికి ట్రెజరీ ద్వారా జీతాలివ్వడం కుదరదన్నారు. దేవాలయాల్లో 5600 మంది ఉద్యోగులు ఉంటే ఇప్పటి వరకు 15వ పిఆర్‌సి ప్రకారం 2300మందికి వేతనాలు ఇస్తున్నామని, మిగిలిన వారికి త్వరలో పిఆర్‌సిని అమలు చేస్తామన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్న దేవాలయాలను కూడా ధూపదీప నైవేద్యం కింద ఎంపిక చేసే విషయాన్ని పరిశీలిస్తామన్నారు. దీని కోసం విధించిన రిజిస్ట్రేషన్ గడువు ముగిసిందని, మరింత పెంచే విషయం పరిశీలిస్తామన్నారు. సమగ్ర భూరికార్డుల సర్వే ప్రకారం దేవాలయాల భూమి రాష్ట్రంలో74,155ఎకరాలు ఉందని తేలిందన్నారు. వీటి రక్షణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కబ్జా దారులను వదిలిపెట్టమన్నారు. నగరంలోని విలువైన ప్రాంతంలో ఉన్న ఎన్‌ఎండిసి వేంకటేశ్వరస్వామి దేవాలయానికి చెందిన స్థలం కబ్జా విషయంలో తగు చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

పుట్టింది 250మంది..చనిపోయింది 220మందా?

- విస్మయం వ్యక్తం చేసిన మండలి చైర్మన్
- విచారించి తగు చర్యలు తీసుకోవాలని మంత్రికి సూచన



మనతెలంగాణ/హైదరాబాద్: సిద్దిపేట జిల్లా కోహెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన జనన మరణాలపై శనివారం శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ విస్మయం వ్యక్తం చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు పాతూరి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తన సొంత గ్రామం కోహెడ పిహెచ్‌సి తీరు అధ్వాన్నంగా ఉందని, డాక్టర్ కూడా లేడని, మిగతా సేవలు కూడా సక్రమంగా అందడం లేదన్నారు. దీనికి మంత్రి లక్ష్మారెడ్డి సమాధానమిస్తూ అవును, ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు, శిశు మరణాలు జరగడం లేదు, 2017 ఏప్రిల్ నుండి 2018 ఫిబ్రవరి వరకు 11ప్రసవాలు జరిగాయి,డాక్టర్ మెటర్నిటి సెలవులో ఉంటే మరో డాక్టర్‌ను డిప్యూటేషన్‌పై నియమించామంటూ ముక్తసరిగా సమాధానమిచ్చారు. మంత్రి సమాధానం పట్ల పాతూరి అసంతృప్తి వ్యక్తం చేశారు. తానే స్వయంగా ఆసుపత్రికి వెళ్లి పరిశీలించానని, ఆసుపత్రి నివేదిక చూసి కళ్లు తిరిగాయన్నారు. మండల సర్వసభ్యసమావేశంలో వారిచ్చిన నివేదిక ప్రకారం ఆసుపత్రిలో 250 మంది జన్మిస్తే వారిలో 220 చనిపోయారన్నారు. ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా మంత్రి దాటవేయడంతో మం డలి చైర్మన్ స్వామిగౌడ్ కల్పించుకుని ఇది చాలా కీలకమైనదన్నారు. నిజంగా ఇలా లిఖిత పూర్వకంగా నివేదిక ఇచ్చారా, అది మీవద్ద ఉందా అని సభ్యులు సుధాకర్ రెడ్డిని ప్రశ్నించారు. ఉందని ఆయన సమాధానం ఇవ్వడంతో, ఈ విషయం మీ దృష్టికి వచ్చిందా లేదా అని మంత్రిని చైర్మన్ పశ్నించారు. ఈ విషయంలో సంబంధిత జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిని ఆరా తీసి అసలు విషయం తెలుసుకుని చర్యలు తీసుకోవాలన్నారు. ఇది తమ దృష్టికి రాలేదని, తెలుసుకుని తగుచర్యలు తీసుకుంటానని మంత్రి సమాధానమిచ్చారు.

త్వరలో బస్తీ దవాఖానాలు : పట్టణాలు, నగరాల్లో బస్తీల్లో(స్లమ్ ప్రాంతాల్లో) నివసించే వారి పరిస్థితి గ్రామాల వారి కంటే కూడా దయనీయంగా ఉందని మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. వారి ఆరోగ్య రక్షణకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు. సభ్యులు ఎంఎస్ ప్రభాకర్‌రావు, సుంకరి రాజులు అడిగిన ప్రశ్నలకు శనివారం ఆయన మండలిలో సమాధానమిస్తూ దీని కోసం బస్తీ దవాఖానాలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. మొత్తం 45 కేంద్రాలను ఆమోదించామని వీటిలో 17 ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. వీటిలో వైద్యు డు, సిబ్బందితో పాటు మందులు సిద్ధంగా ఉంటాయని చెప్పారు. వీటిని పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలతో అనుసంధానం చేస్తామన్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో అవసరం లేకు న్నా డబ్బుల కోసం సర్జరీలు చేయడం తగ్గాయని, ఎక్కడైనా జరిగితే తమ దృష్టికి తెస్తే తగుచర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

బిజెపి, కెటిఆర్ మాటలయుద్ధం

మన తెలంగాణ/హైదరాబాద్: బిజెపిని లక్ష్యంగా చేసుకుని మంత్రి కెటిఆర్ మాట్లాడడం సరైంది కాదని బిజెఎల్‌పి నేత జి.కిషన్‌రెడ్డి అన్నారు. శాసనసభలో పద్దులపై మంత్రి కెటిఆర్ సమాధానమిచ్చిన సందర్భంలో బిజెపిపై విరుచుకుపడ్డారు. అనంతరం కిషన్‌రెడ్డి దీనికి స్పందిస్తూ బిజెపి అధికారంలో ఉన్నట్లు, మంత్రి కెటిఆర్ ప్ర తిపక్షంలో ఉన్నట్లు మాట్లాడుతున్నారని, రాష్ట్రం లో తాము అధికారంలో లేమని, ప్రజల పక్షాన స మస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. తా ము సభలో అక్కడ(అధికారపక్షం వైపు) మీరు ఇక్కడ (ప్రతిపక్షంవైపు) కూర్చున్నప్పుడు తాము తప్పకుండా సమాధానం చెబుతామన్నారు. తెలంగాణ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని, ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్రం వద్దకు వచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. దీనిపై హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి జోక్యం చేసుకొని కిషన్‌రెడ్డి అంత ఆవేశంగా మాట్లాడాల్సిన ఆవేశం లేదని, తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన రాజీనామా చేయలేదని గుర్తు చేశారు. ప్రస్తుతం బిజెపికి ఐదుగురు ఎంఎల్‌ఎలే ఎక్కువ అని అంతకు మించి వస్తాయని కలలు కనవద్దని ఎద్దేవా చేశారు.



కెసిఆర్ నాయకత్వాన్ని ఎపి ప్రజలూ కోరుకుంటున్నారు : తలసాని

మన తెలంగాణ/హైదరాబాద్: ఫెడరల్ ఫ్రంట్‌కు కెసిఆర్ నాయకత్వం వహించాలని ఎపి ప్రజలు కూడా కోరుకుంటున్నారని, అందుకు కెసిఆర్ సిద్ధంగా ఉన్నారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ప్రత్యేక హోదా కోసం పోరాడాలని ఎపి ప్రజలు కోరుకుంటే టిఆర్ఎస్ అందుకు సిద్ధంగా ఉందని చెప్పారు.టిఆర్ఎస్ఎల్‌పి కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు ఎపిలో ఉన్న మొత్తం 25 మంది ఎంపిలు మూకుమ్మడి రాజీనామాలు చేస్తే ఏదైనా ఫలితం ఉంటుందేమోనని, తెలంగాణ ఉద్యమం లో రాజీనామా ల ద్వారా ఒత్తిడి పెరిగిందని గుర్తు చేశారు. అవిశ్వాస తీర్మానం తో వచ్చే ప్రయోజమేమిటని, బిజెపికి సొంతగానే 273 మంది ఎంపిల బలం ఉందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఏపికి ప్రత్యేక హోదా సాధించుకోవడానికి ఎన్నో వేదికలు ఉన్నాయని చెప్పారు.పార్లమెంటులో తెలంగాణ ఎంపిలు రిజర్వేషన్ల కోసం చేస్తున్న పోరాటం లో న్యాయం ఉన్నదని,ఈ వ్యవహారం లో నిందించడం తగదన్నారు.అన్నా డీఎంకె కూడా ఆందోళన చేస్తోందని, ఆ పార్టీ ఎంపిలతో టిడిపి అవిశ్వాసం మీద మాట్లాడిందా? అని ప్రశ్నించారు.ఏపిలో కొందరు ఏవో ఆపరేషన్లు అంటూ పిచ్చి గా మాట్లాడుతున్నారని, వాటి ప్రభావం తెలంగాణ రాజకీయాల పై ఉండదని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో అక్కడి పార్టీలు దిగజారుడు రాజకీయాలతో ప్రజలను మరోసారి మోసం చేస్తున్నాయని ఆరోపించారు.

అసెంబ్లీ ప్రశ్నోత్తరాలు

ప్రతి నియోజకవర్గంలో మినీ ట్యాంక్ బండ్

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి ఒక మినీ ట్యాంక్‌బండ్‌ను అభివృద్ధి చేస్తామని, ఇప్పటికే మొత్తం119 నియోజకవర్గాల్లోని 90 నియోజకవర్గాలకు మినీట్యాంక్ బండ్ పనులను మంజూరుచేశామని నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు తెలిపారు. నియోజకవర్గాలతో పాటు వివిధ పట్టణ కేంద్రాల్లోనూ మినీ ట్యాంక్‌బండ్‌లు ఏర్పాటు చేసి వాకింగ్, బోటింగ్, క్రీడా మైదానం, పిల్లలకు అవసరమైన ఏర్పాట్లు వంటివాటిని సమకూరుస్తామన్నారు. శనివారం శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ గ్రేటర్ హైదరాబాద్‌లో రూ. 287కోట్లతో 20 చెరువుల సుందరీకరణ పనులు చేపట్టామని, మరో 63 చెరువుల్లో రూ. 94 కోట్లతో పనులు జరుగుతున్నాయని చెప్పారు.

రాచకొండ ఎత్తిపోతల ద్వారా చెరువులను నింపుతాం: శివన్నగూడెం రిజర్వాయర్ నుంచి రాచకొండ ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులను నింపుతామని, ఈ పథకం సర్వే పనులు చేపట్టడానికి ప్రభుత్వం ఇటీవలే అనుమతులిచ్చిందని, నాలుగు నెలల్లో సర్వే పూర్తవుతుందని, వెంటనే పనులు మొదలుపెడతామని ఆయన స్పష్టం చేశారు. ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలైన మునుగోడు, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో సాగునీటితోపాటు తాగునీటి కష్టాలను ఈ ఎత్తిపోతల పథకం ద్వారా తీరుస్తామని మంత్రి హరీష్‌రావు స్పష్టం చేశారు. యాదాద్రి, రంగారెడ్డి జిల్లాలు రాజధానికి సమీపంలో ఉన్నా దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కుంటున్నాయని, శివన్నగూడెం రిజర్వాయర్ ద్వారా 6 టిఎంసీల నీటిని 60 రోజుల్లో అందిస్తామన్నారు. బోడగుట్ట తాండ బాలన్స్ రిజర్వాయర్ ద్వారా నారాయణపూర్, చౌటుప్పల్ ప్రాంతాలలోని 20 చెరువులను నీటితో నింపుతామన్నారు.

సీసీ కుంటలో జూనియర్ కాలేజి



దేవరకద్ర నియోజకవర్గంలోని సీసీ కుంటలో ప్రభుత్వ జూనియర్ కాలేజీని ఏర్పాటు చేస్తామని, రానున్న విద్యా సంవత్సరం నుంచే ఇది ప్రారంభమయ్యేలా ప్రయత్నిస్తామని ఉప ముఖ్యమంత్రి (విద్యాశాఖ) కడియం శ్రీహరి తెలిపారు. శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆళ్ళ వెంకటేశ్వర రెడ్డి ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ దేవరకద్రలో డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీని ఏర్పాటు చేయాలని కూడా విజ్ఞప్తులు వచ్చాయని, దీనిపై సర్వే చేయించామని, కాలేజీలు అవసరం అనే అభిప్రాయం వ్యక్తమైందని, ఆ మేరకు డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల ఏర్పాటు కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి కెసిఆర్ ఆమోదం తీసుకొని వీలైనంత త్వరగా కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అధిక నిధుల కోసం ఆర్థిక సంఘానికి నివేదిక



రాష్ట్రానికి అధిక నిధులు వచ్చేలా 15వ ఆర్థిక సంఘానికి నివేదిక సమర్పిస్తామని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. శాసన మండలిలో శనివారంనాడు పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ 14వ ఆర్థిక సంఘం గడువు ఇంకా ముగియలేదన్నారు. 15వ ఆర్థిక సంఘం 2021 ఏప్రిల్ నుంచి అమలులోకి వచ్చి అయిదేళ్ల పాటు ఉంటుందని చెప్పారు. దీనిపై ఇంకా స్పష్టత రాలేదని, చర్చలు జరుగుతున్నాయన్నారు. నీతిఆయోగ్, ఫైనాన్స్ కమిషన్ వంటివి రాష్ట్రంలో అమలు చేస్తున్న మిషన్‌కాకతీయ, భగీరథలతో పాటు ఎన్నో పథకాలకు మెచ్చుకున్నాయన్నారు. కాకతీయకు, భగీరథకు నిధులు ఇవ్వాలని కేంద్రానికి నీతి ఆయోగ్ సిఫారసు చేసినా ఒక్క పైసా ఇవ్వలేదని చెప్పారు.

పశువైద్యశాలల్లో ఖాళీలన్నీ భర్తీ!

పశువైద్యశాలల్లో ఉన్న ఖాళీలన్నింటినీ త్వరలోనే భర్తీ చేస్తామని, జీవాలన్నింటికి మెరుగైన వైద్యసేవలందిస్తామని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ తెలిపారు. శుక్రవారం మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 99 సంచార వైద్యశాలలను ఏర్పాటు చేశామని, ఈ ఏడాది మరో 100 పశు వైద్యశాలలను ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

అరుణారెడ్డి కోచ్‌కు రూ.25 లక్షలు



ప్రపంచ జిమ్నాస్టిక్స్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన అరుణారెడ్డి కోచ్‌కు ప్రభుత్వం రూ. 25 లక్షలు ఇస్తుందని క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి పద్మారావు తెలిపారు. శాసన మండలిలో శనివారం సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ, దేశానికి వన్నె తెచ్చిన అరుణారెడ్డికి రూ.2 కోట్లు ఇచ్చామని, చక్కటి క్రీడాకారిణిగా తీర్చిదిద్దిన కోచ్ ప్రస్తుతం క్యాన్సర్‌తో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. మరో నెలరోజుల కంటె ఎక్కువ సమయం జీవించలేడని వైద్యులు తెలిపారని చెప్పారు. ఒకటి రెండు రోజుల్లోనే అతని సమక్షంలో ఆయన కుటుంబసభ్యులకు తానే స్వయంగా రూ.25 లక్షలు అందచేస్తానన్నారు. దీంతో తన కుటుంబానికి ఎలాంటి ఢోకాలేదనే సంతృప్తి ఆయనకు దక్కుతుందని చెప్పారు.

పర్మిట్ లేని బస్సులపై చర్యలు



రాష్ట్రంలో పర్మిట్ లేని బస్సులపై చర్యలు తీసుకుంటున్నామని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బస్సులపై చర్య లు తీసుకుంటున్నామని, ట్యాక్స్ కట్టకుండా తిరిగిన వాటిపై 730 కేసులు, పర్మిట్ లేని వాహనాలపై 591 కేసులు, తెలంగాణ పర్మిట్ లేని వాహనాలపై 432 కేసులు, సరుకు రవాణావాహనాలపై 136కేసులు, 8గం.లకుమించి డ్రైవర్లు పనిచేసినందుకు 118 కేసు లు .. మొత్తం 9,400లకు పైగా కేసులు నమోదు చేసినట్లు రవాణాశాఖ మంత్రి మహేందర్ రెడ్డి తెలిపారు. శనివారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు శ్రీనివాస్‌గౌడ్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ జాతీయ రహదారులపై 100 కి.మీ.ల వేగం, ఆర్ అండ్‌బి రోడ్లపై 65 కి. మీ వేగానికి మించి ఉండరాదని, 100 కి.మీ. వేగం మించితే కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల ప్రైవేటు బస్సులు ప్రమాదానికి గురి అవుతున్నాయని చెప్పారు.

193 'బ్రిడ్జి కం చెక్ డ్యాం'ల నిర్మాణం



రాష్ట్రంలో భూగర్భ జలాల సంరక్షణకు చెక్‌డ్యాంలు నిర్మిస్తున్నామని, ఇప్పటికే 193 'బ్రిడ్జి కం చెక్ డ్యాం'లను చేపట్టినట్లు రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల తెలిపారు. శాసనసభలో సభ్యులు చల్లా ధర్మారెడ్డి ప్రశ్నకు మంత్రి బదులిస్తూ, ఇందుకోసం రూ. 647.94 కోట్లు ఖర్చు అవుతుందని ప్రభుత్వం అంచనా వేసిందని తెలిపారు. ఇప్పటివరకు రూ. 225.75 కోట్లతో 94 చెక్ డ్యాం బ్రిడ్జిలను పూర్తి చేసినట్లు తెలిపారు. మిగతా 99 'చెక్ డ్యాం కం బ్రిడ్జి'ల నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు. వీలైనన్నిచోట్ల చెక్ డ్యామ్‌ల నిర్మాణాన్ని చేపట్టాలనికెసిఆర్ ఆదేశించారని మంత్రి గుర్తుచేశారు.

తమ్మిడిహట్టి దగ్గర నిర్మిస్తే చుక్క నీళ్లు చూసేవాళ్లం కాదు

- సిడబ్ల్యూసి సూచన మేరకే కాళేశ్వరం రీడిజైన్
- కాళేశ్వరం ద్వారా 37 లక్షల ఎకరాలకు సాగునీరు
- హరిత తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం : హరీశ్‌రావు

మన తెలంగాణ/హైదరాబాద్ : త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ కోటి ఎకరాల మాగాణితో ఎప్పుడూ పచ్చని పంట పొలాలతో సుభిక్షంగా ఉండాలన్న సకల్పంలో భాగమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణమని, దీని ద్వారా 19 జిల్లాల్లోని 37 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని నీటి పారుదల శాఖ మంత్రి టి.హరీష్‌రావు అన్నారు. శాసనమండలిలో కాళేశ్వరం ప్రాజెక్టు పనుల పురోగతిపై శనివారం జరిగిన లఘు చర్చలో మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాణహిత చెవెళ్ల ప్రాజెక్టును తమ్మిడిహట్టి దగ్గరే నిర్మించి ఉంటే కేవలం చూసుకుని మురిసేందుకే పనికొచ్చేది తప్పితే అందులో నీళ్లు మాత్రం వచ్చేవి కావన్నారు. ఇందుకు స్వయంగా కేంద్ర జల సంఘం (సిడబ్ల్యూసి) ఇచ్చిన నివేదికే సాక్ష్యమన్నారు. సిడబ్ల్యూసి సూచన మేరకే తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు రీడిజైన్ చేసి గోదావరి దిగువ ప్రాంతంలో 200 టిఎంసిల నీటి లభ్యత ఉన్న మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తున్నామన్నారు. 37 లక్షల ఎకరాలకు సాగు నీరుతో పాటు త్రాగునీరు, పరిశ్రమలకు నీటిని అందించడమే లక్ష్యంగా రూ. 80 వేల కోట్ల వ్యయంతో మేడిగడ్డ దగ్గర ప్రాజెక్టులో 85 గేట్లు, సుందిళ్లలో 74 గేట్లు, అన్నారం 66 గేట్లతో మూడు బ్యారేజీలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడి నుంచి 2 టిఎంసిల నీటిని ఎత్తిపోయడానికి 139 మెగావాట్ల సామర్థ్యంగల మోటర్లతో 20 లిఫ్టుల ద్వారా 1,832 కి.మీ. పొడవున మీటరు వెడల్పు కాల్వతో 141 టిఎంసిల నీటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు నిర్మిస్తున్న భారీ ప్రాజెక్టు కాళేశ్వరమన్నారు. 1,832 కి.మీ పొడవు కాల్వలో గ్రావిటీ ద్వారా 1531 కి.మీ. టెన్నల్ ద్వారా 203 కి.మీ, ప్రెషర్‌మెన్ ద్వారా 98 కి.మీ నీటిని పంపు చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు 4620 మెగావాట్ల విద్యుత్ అవసరం కాగా, ఇందుకోసం సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తి అయ్యాయన్నారు. రానున్న జూలై నాటికి అప్పర్ మానేరు ప్రాజెక్టు నీళ్లను పంపింగ్ చేసి ఎస్ఆర్ఎస్‌పి ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా మొదలుకుని సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి వరకు నీటిని అందించడం ద్వారా 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనులను మూడు షిఫ్టుల్లో వేగంగా పూర్తిచేస్తున్నామని చెప్పారు. ఇందుకోసం రోజు ప్రతి సైట్ వద్ద 2500 నుంచి 3 వేల మంది కార్మికులు మూడు షిఫ్టుల్లో పనిచేస్తున్నారన్నారు. ప్రతి రోజూ రెండు లక్షల బ్యాగుల సిమెంట్‌ను వినియోగిస్తున్నారని దీనిని బట్టే పనులు ఎంత వేగంగా జరుగుతున్నాయో అంచన వేయవచ్చాన్నారు. ప్రాజెక్టు నిర్మాణం రోజూ 3 టిఎంసి నీటిని పంపుచేసే విధంగా పనులు జరుగుతున్నాయని, ప్రస్తుతం మాత్రం 2 టిఎంసిల సామర్థ్యం మేరకే విద్యుత్ మోటార్ పంపులను ఏర్పాటు చేస్తున్నామని, భవిష్యత్తులో 3 టిఎంసిలకు అనుగుణంగా ఎలక్ట్రో పరికరాలను మార్చుకుంటే సరిపోతుందన్నారు. ప్రాజెక్టుకు మరో రెండు మూడు చిన్నచిన్న అనుమతులు మినహాయించి ప్రధామైన పర్యావరణ, అటవీ, హైడ్రాలజీ క్లియరెన్స్‌లాంటివి లభించాయని తెలిపారు. ఇందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు పొరుగున ఉన్న మహారాష్ట్రతో కీలక ఒప్పందాలు చేసుకోవడం మూలంగానే ప్రాజెక్టు ఎలాంటి అవరోధాలు లేకుండా సాగుతున్నాయని చెప్పారు.



రూ.23 వేల కోట్లు ఖర్చు చేసింది : అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2008లో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణ పనులకు ఎనిమిదేళ్లలో రూ.162 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే టిఆర్ఎస్ ప్రభుత్వం గడిచిన 22 నెలల్లో రూ. 23 వేల కోట్ల విలువగల పనులను పూర్తి చేసిందని చెప్పారు. మల్లన్న సాగర్ కలుపుకుని ఈ ప్రాజెక్టు పూర్తిగా అందుబాటులోకి రావడానికి మొత్తం 3 నుంచి 4 ఏళ్లు పడుతుందని, అయితే రంగారెడ్డి , యాదాద్రి భువనగిరి జిల్లాతో పాటు హైదరాబాద్‌కు తాగునీరు అందించేందుకు ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు చేసి ప్రాజెక్టు పూర్తయ్యేంత వరకు నీటిని అందిస్తామని చెప్పారు. ప్రభుత్వం త్వరిగతిన పనులు పూర్తి చేయాలని ప్రతిపక్షాలు ధర్నాలు చేయాలిగానీ శరవేగంగా జరుగుతున్న పనులను అడ్డుకునేందుకు వివిధ కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకోవడం దారుణమన్నారు. ప్రాజెక్టు పూర్తయితే ఏ కాల్వలో చూసినా నీరే కనిపిస్తుందని, ఆ నీటిలో తాము ఎక్కడ కొట్టుకుపోతామనే భయంతో కాంగ్రెస్ నేతలు కుట్రలు పన్నుతూ ప్రాజెక్టును అడ్డుకునేందుకు యత్నిస్తున్నారన్నారు.

జనాభాకనుగుణంగా స్థానిక సంస్థల ఏర్పాటు!

- తుదిదశలో సంప్రదింపులు
- న్యాయపరమైన చిక్కులు లేకుండా అందరి అభిప్రాయాలు తీసుకుంటాం : కెటిఆర్

మన తెలంగాణ/హైదరాబాద్: పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా రాష్ట్రంలో స్థానిక సంస్థల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని, పట్టణ సమీప గ్రామాలను కలిపి పురపాలక సంఘాలను ఏర్పాటుచేసే విషయంలో సంప్రదింపులు తుదిదశలో ఉన్నాయని, ఇందుకు సంబంధించి చట్టంలో సవరణలు చేసి న్యాయపరమైన చిక్కులు లేకుండా శాసనసభ ముం దుంచి సభ్యుల అభిప్రాయాలను కూడా తీసుకుంటామని మంత్రి కెటిఆర్ తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆర్. కృష్ణయ్య అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిస్తూ దేశవ్యాప్తంగా పట్టణీకరణ పెరుగుతోందని, మన రాష్ట్రంలో ఎక్కువగా ఉందని, దేశవ్యాప్తంగా పట్టణ జనాభా 30% ఉంటే తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం ఉందన్నారు. మెరుగైన సౌకర్యాలు, అండర్‌గ్రౌం డ్ డ్రైనేజీ వ్యవస్థతో పాటు అన్ని వసతులూ కల్పించాల్సి ఉం టుందని, జనాభా పెరుగుదలను దృష్టిలో పెట్టుకొని మున్సిపాలిటీల చుట్టుపక్కల ఉన్న గ్రామాలను వీలినం చేయనున్నామన్నారు.

హైదరాబాద్ రోడ్ల అభివృద్ధికి చర్యలు :హైదరాబాద్ నగరంలో రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కెటి రామారావు తెలిపారు. మున్సిపల్, ఆర్ అండ్ బి, విద్యుత్తు విభాగాల అధికారులను సమన్వయంతో పనిచేస్తేనే పనుల్లో పురోగతి సాధ్యమవుతుందని అన్నారు. ఎస్ఆర్‌డిపి (స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) కింద రూ.26,459.81 కోట్ల అం చనా వ్యయంతో 5 దశల్లో మొత్తం 52 పనులను చేపట్టామని, ఇందులో 16 పనులు వేగంగా కొనసాగుతున్నాయని, మిగిలిన పనులను త్వరలోనే చేపడతామని తెలిపారు. అయ్యప్ప సొసైటీ అండర్‌పాస్ ద్వారా వెళ్ళే వాహనచోదకులు, ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. పారడైజ్ నుంచి కొంపల్లి, జెబిఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు రోడ్డు పనుల విషయంలో రక్షణశాఖతో మాట్లాడుతున్నామని, 100 ఎకరాల రక్షణ స్థలానికి 600 ఎకరాల స్థలం ఇస్తామని చెప్పినట్లు తెలిపారు.

ఆన్‌లైన్ ద్వారా 49,963 భవన అనుమతులు : ఆన్‌లైన్ ద్వారా భవన నిర్మాణాలకు అనుమతిని జారీచేయడానికి రాష్ట్రమంతటా అభివృద్ధి అను మతి నిర్వహణ వ్యవస్థ(డిపిఎంఎస్)ను ప్రవేశపెట్టామని తెలిపారు.

ఇప్పటి వరకు ఈ వ్యవస్థ క్రింద 49,963 అనుమతులు జారీ అయ్యాయని, జిహెచ్ ఎంసిలో 20,246, హెచ్ఎండిఎలో 947, ఇతర స్థానిక సంస్థల్లో 28,770 ఉన్నాయని తెలిపారు. భవన దరఖాస్తులను సత్వరమే పరిష్కారమయ్యేలా గడువును తగ్గించినట్లు తెలిపారు.

భవన క్రమబద్ధీకరణ పథకం పున:పరిశీలన : జిహెచ్ఎంసి పరిధిలో పన్ను వసూళ్ళు మెరుగుపరుచడానికి చర్యలు తీసుకుంటున్నామని, రూ.1200 కంటె తక్కువ పన్ను కలిగిన ఆస్తుల పునః పరిశీలన జరుగుతోందని, అనధీకృత నిర్మాణాలపై విధించే ఆస్తిపన్ను, కొత్త మదింపుల పెంచిన పన్ను, భవన క్రమబద్ధీకరణ పథకం తదితరాలను కూడా జిహెచ్ఎంసి పరిశీలిస్తోందని మంత్రి కెటిఆర్ తెలిపారు.

3న ఢిల్లీకి సిఎం కెసిఆర్?

- 4న టిఆర్ఎస్ రాజ్యసభ సభ్యుల ప్రమాణ స్వీకారాకి హాజరు

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సమితి తరపున రాజ్యసభ సభ్యులుగా గెలిచిన ముగ్గురు వచ్చే నెల 4వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కెసిఆర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉంది. ఇందుకోసం వచ్చే నెల 3వ తేదీన ఢిల్లీ వెళ్ళనున్నట్లు తెలిసింది. తెలంగాణ ఉద్యమకాలం నుంచీ ముఖ్యమంత్రికి నుంచి అత్యంత సన్నిహితంగా ఉంటున్న జోగినపల్లి సంతోష్‌కుమార్‌ను ప్రత్యక్ష రాజకీయాల్లోకి తేవాలని భావించి గతేడాది పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. జాతీయ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించాలని నిర్ణయించుకున్న కెసిఆర్ రాజ్యసభకు సంతోష్‌ను పంపడం ద్వారా



ఢిల్లీ స్థాయిలో ఆయన సేవలను వినియోగించుకోవాలనుకున్నారు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో సంతోష్‌తో పాటు బడుగుల లింగయ్య యాదవ్, బండి ప్రకాశ్ ముదిరాజ్ గెలుపొందిన విషయం తెలిసిందే. రాజ్యసభ ఛైర్మన్ చేతుల మీదుగా జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి స్వయంగా ముఖ్యమంత్రి హాజరుకావాలని భావిస్తున్నారని, అందులో భాగంగా వచ్చే నెల 4న జరిగే ఈ కార్యక్రమానికి హాజరయ్యే నిమిత్తం ఒక రోజు ముందుగానే ఢిల్లీకి వెళ్ళాలనుకుంటున్నట్లు తెలిసింది.



రాజ్యసభకు ఎన్నికైన జె.సంతోష్‌కుమార్‌ను అభినందిస్తున్న పెద్దపల్లి ఎంపి బాల్క సుమన్, టిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

ఎర్త్ అవర్



దేశవ్యాప్తంగా శనివారంనాడు ఎర్త్ అవర్ పాటించారు. అందులో హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ కూడా భాగమైంది. రాత్రి 8.30గంటల నుంచి 9.30వరకు విద్యుత్ దీపాలు నిలిపి వేసి ఎర్త్ అవర్‌ను పాటించారు.

నీరుగారుతున్న ఉద్యాన మిషన్

- కేంద్రం నుంచి నిధులు, రాష్ట్రం నుంచి బిఆర్‌ఓలు

మన తెలంగాణ/హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉద్యానవన రంగ సమగ్ర అభివృద్ధి కోసం ఉద్దేశించిన మిషన్ (ఎమ్ఐడిహెచ్) లక్ష్యం నీరుగారుతోంది. కేంద్రం నుంచి నిధులు విడుదలైనా రాష్ట్ర ప్రభుత్వం వాటిని సరిగ్గా వినియోగించుకోవడం లేదు. బడ్జెట్‌లో కేటాయింపులు తప్ప నిధులు విడుదల చేయకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు సకాలంలో రావడంలేదు. ఫలితంగా ఎమ్ఐడిహెచ్ అమలుకు నోచుకోవడం లేదు. ఇప్పటికీ కేంద్రం నుంచి రాష్ట్రానికి రెండు, మూడు లేఖలు అందినా సంబంధిత అధికారులు వివరణ ఇవ్వలేదని సమాచారం. కేంద్రం ఎమ్ఐడిహెచ్‌కు ఇచ్చే నిధులకు రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వాటా కలిపి విడుదల చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం 2015–16లో రూ. 67.50 కోట్లు కేటాయించగా, 2016–17లో రూ 54.84 కోట్లు, 2017–18లో రూ. 60 కోట్లు, 2018–19లో రూ. 60 కోట్లు కేటాయించింది. ఈ నిధులకు సంబంధించి రాష్ట్రం తన వాటాను విడుదల చేయడం లేదు. దేశవ్యాప్తంగా ఉద్యానవన ఉద్యమం సృష్టించాలనే ఉద్దేశంతో 2013లో కేంద్ర ప్రభుత్వం ఉద్యానరంగ సమగ్ర అభివృద్ధి మిషన్‌ను ప్రవేశపెట్టింది. ఈ మిషన్ లక్ష్యం ప్రతి రాష్ట్రం సంపూర్ణ ఉద్యాన రంగంగా ఎదగడమే. ప్రాంతాలవారీగా పరిశోధనలు చేస్తూ సాంకేతికంగా పంట నిర్వహణ, మార్కెటింగ్‌తో ఉద్యాన పంటల విస్తరణ పెంచడం, ప్రోత్సహించడడానికి రైతులను సమూహాలుగా ఏర్పరచడం, ఉద్యానపంటల దిగుబడి, రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు పోషక భద్రతను బలోపేతం చేయడం, గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించడం, కొత్త ఉద్యాన పంటలు సాగు చేయించడం ఈ మిషన్ ముఖ్య ఉద్దేశాలు. వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఛైర్మన్‌గా రాష్ట్రస్థాయిలో కార్యవర్గ కమిటీ ప్రణాళిక ప్రకారం ఎమ్ఐడిహెచ్ లక్ష్యాలను పూర్తి చేస్తారు. ఇందులో రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీలు, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రిసెర్చ్(ఐసిఎఆర్) లు కూడా భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వ పథకాల కోసం సమీక్షలు జరపడమే తప్పితే ఇప్పటి వరకు ఎమ్ఐడిహెచ్ కోసం ప్రత్యేకంగా భేటీ అయిన సందర్భాలు ఒకటో రెండు మాత్రమే. ఈ పథకం లక్ష్యాలను కూడా కాగితాలకే పరిమితం చేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

వేములవాడకు మాస్టర్‌ప్లాన్




మన తెలంగాణ/ హైదరాబాద్: వేములవాడ పట్టణ అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్ రూపొందించాలని ప్రభుత్వం భావిస్తోందని, త్వరలో ఆ పట్టణంలో క్షేత్రస్థాయి పర్యటన జరుపుతానని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కెటి. రామారావు అన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ సంస్థ సమీక్షా సమావేశం శనివారం అసెంబ్లీ కమిటి హాలులో మంత్రి కెటిఆర్ అధ్యక్షతన జరిగింది. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా పట్టణాభివృద్ధిని సమగ్రంగా చేసేందుకు ఒక విజన్‌తో ముందుకు పోవాలని అధికారులను ఆదేశించారు. అథారిటీల పరిధిలోకి పట్టణ పరిసర ప్రాంతాలు, ముంపు గ్రామాలను తీసుకుని వచ్చి వాటన్నంటినీ వేములవాడ మాస్టర్ ప్లాన్‌లో అనుసంధానం చేయాలన్నారు. ఐదేళ్లు, పదేళ్లు, 25 సంవత్సరాలకు అందుకోవాల్సిన లక్ష్యాలను కూడా నిర్దేశించుకోవాలని కెటిఆర్ అధికారులకు సూచించారు.

రాబోయే సంవత్సరాల్లో జరగాల్సిన అభివృద్ధికి, జనాభాకు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. దేవాలయ డిజైన్లను ముఖ్యమంత్రి పరిశీలిస్తారని, పట్టణంలో చేపట్టిన సివిల్ పనులు రోడ్లు, భవనాలు , బ్రిడ్జీల నిర్మాణాల్లో చోళ – చాళుక్య కళ ఉట్టి పడేలా చూడాలన్నారు. వేములవాడను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామని, మాస్టర్ ప్లాన్‌ను రూపొందించడంలో భవిష్యత్తు అవసరాలను పరిశీలించాలని అథారిటీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పట్టణంలోకి రాగానే ఒక టెంపుల్ టౌన్‌లోకి వచ్చిన భావన కలిగేలా ఉండాలన్నారు. పట్టణంలో భక్తుల సౌకర్యార్థం అవసరం అయితే ఉచిత ఎలక్ట్రిక్ బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ శాక ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్ కూడా ఈ పనులను స్వయంగా పరిశీలిస్తారన్నారు.

సభ ముందుకు అనుబంధ వ్యయ అంచనాలు!

మన తెలంగాణ/ హైదరాబాద్ :ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2017–18) బడ్జెట్‌లో వివిధ పద్దుల కింద అదనంగా రూ.29,523.07 కోట్లు ఖర్చు చేయనుంది. ఇందుకు వీలుగా శాసనసభలో ఆర్థిక మంత్రి ఆదివారం నాడు అనుబంధ వ్యయ అంచనాలను ఆమోదం కోసం ఆయా పద్దులను సభలో ప్రవేశపెడతారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులు సరిపోనందున ఆయా సేవల కోసం అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. అలాగే ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం కొత్త సేవలు, కొత్త అంశాల ఖర్చు కోసం కూడా అదనపు వ్యయం అవుతోంది. రాజ్యాంగంలోని 207వ అధికరణ ప్రకారం ద్రవ్య వినిమయ చట్టంలో కేటాయించిన బడ్జెట్ నిధులు ఆయా అవసరాలకు సరిపోనప్పుడు లేదా ఇతర కొత్త అంశాలకు నిధులు ఖర్చు చేయాల్సి వచ్చినప్పుడు, అదే ఆర్థిక సంవత్సరంలో అనుబంధ వ్యయ అంచనాలను సభ ముందుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. ఆ వివరాలను శనివారం ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ సభ ముందుంచారు. దీనిపై ఆదివారం సభలో చర్చించి ఆమోదం తీసుకుంటారు.

"జీవితంలో ముందడుగులు వేయాలంటే, మనం మార్పుని ఆహ్వానించ గలగాలి. – విన్‌స్టన్ చర్చిల్"



వాణిజ్య యుద్ధం దిశగా...

సంపాదకీయం

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రక్షణాత్మక విధానాలతో ప్రపంచం వాణిజ్య యుద్ధం దిశగా ప్రయాణిస్తోంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యాన్ని వదిలించుకుని ఇప్పుడిప్పుడే వృద్ధిమార్గం పట్టిన దశలో స్వేచ్ఛా వాణిజ్య నిరోధక చర్యలు ప్రమాదకరమని ఆర్థిక వేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ) ద్వారా దశాబ్దాలపాటు సాగిన చర్చలు అంతర్జాతీయ వాణిజ్యాన్ని స్థిరమైన ప్రాతిపదికపై ఉంచాయి. ప్రపంచదేశాలు ఉమ్మడిగా అంగీకరించిన నియమ నిబంధనలు ఉల్లంఘనకు గురైతే అందుకు పాల్పడిన దేశాన్ని శిక్షించే అధికారంకూడా డబ్ల్యుటిఒకు ఉంది. ప్రపంచ వాణిజ్యం సంక్షోభాల్లో చిక్కుకోకుండా సాఫీగా సాగిపోయేందుకు, వర్థమాన ప్రపంచంపై స్వారీ చేసేందుకు అది పెట్టుబడిదారీ ప్రపంచం సృష్టించిన వ్యవస్థ. ఆహార సబ్సిడీలు ఎత్తివేయాలని ఇటీవల కాలంలో అది చేస్తున్న ఒత్తిడిని, తమ ప్రజలకు ఆహార భద్రత పేరుతో భారత్, ఇతర వర్థమాన దేశాలు ప్రతిఘటిస్తుండటం గుర్తు చేసుకోదగింది. అభివృద్ధి చెందిన దేశాల ప్రయోజనాలను కాపాడే ఆ సంస్థ సైతం ట్రంప్ రక్షణాత్మక విధానాలను తప్పుపట్టాల్సి వస్తోంది. ట్రంప్ ఏకపక్ష చర్యలతో అమెరికా–చైనా మధ్య తలెత్తిన వాణిజ్య సంఘర్షణ విషయంలో 'సంయమనం పాటించాలి, అత్యవసరంగా చర్చల ద్వారా పరిష్కారాలు కనుగొనాలని' డబ్ల్యుటిఒ డైరెక్టర్ జనరల్ రాబర్టో అజివిడో విజ్ఞప్తి చేశారు. యూరప్ దేశాలతో ఒబామా ప్రభుత్వ కాలంలో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమెరికాకు నష్టమని, దాన్ని రద్దు చేస్తానని దాడికి దిగిన ట్రంప్, యూరోపియన్ యూనియన్ సహా తమ కీలక వాణిజ్య భాగస్వామ్య దేశాలనుంచి ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై వరుసగా 25శాతం, 15 శాతం చొప్పున ముందుగా సుంకాలు పెంచారు. నిరసనలు రావటంతో ఆ నిర్ణయం అమలును నిలుపుదలలో ఉంచి మే 1లోపు ఒప్పందం కుదుర్చుకోవాలని షరతు పెట్టారు. ఈ గడువులో ఒప్పందం సాధ్యం కాదని రాబర్టో భావిస్తుండగా, ఇది తలకు తుపాకీ గురిపెట్టినట్లుగా ఉందని ఫ్రెంచి అధ్యక్షుడు ఇమ్మాన్యుయిల్ మక్రాన్ వ్యాఖ్యానించారు.

ట్రంప్ తాజాగా చైనాతో వాణిజ్య ఘర్షణ ప్రారంభించారు. చైనా అక్రమంగా అమెరికా మేథో హక్కులను స్వాధీనం చేసుకుంటున్నట్లు ఆరోపించారు. చైనాలో జాయింట్ వెంచర్ పరిశ్రమలు నెలకొల్పే అమెరికన్ ఉన్నతస్థాయి టెక్నాలజీ కంపెనీలనుంచి టెక్నాలజీ బదిలీని చైనా డిమాండ్ చేస్తోంది. దీనిపై అమెరికా గత ఆగస్టులో డబ్ల్యుటిఒలో ఫిర్యాదు చేసింది. చైనా అమెరికాకు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి, రుణదాత కూడా. ఇరుదేశాల మధ్య వాణిజ్యంలో అమెరికా లోటు (2017లో) 375.2 బిలియన్ అమెరికన్ డాలర్లు. చైనాతో వాణిజ్యలోటు అమెరికాలో 60లక్షల ఉద్యోగాలను నష్టపరుస్తోందని అంచనాకు వచ్చిన ట్రంప్, చైనా నుండి దిగుమతులపై 60బిలియన్ డాలర్లమేర సుంకాలు పెంచుతూ ఎగ్జిక్యూటివ్ మెమొరాండంపై గురువారం సంతకం చేశారు. దీనికి ప్రతిస్పందనగా చైనా 128 అమెరికన్ వస్తువులపై 3 బిలియన్ డాలర్ల మేరకు సుంకం పెంచింది. తొలిదశలో 15శాతం పెంపుదల ఉంటుందని, చర్చల్లో అంగీకారం కుదరకపోతే రెండో దశలో 25శాతానికి పెంచుతామని చైనా ప్రకటించింది.

ప్రస్తుతానికి భారత్‌పై ఈ వాణిజ్య ఘర్షణ ప్రభావం లేకపోయినా ఇది కొనసాగితే ఎగుమతులు పడిపోయే ప్రమాదం ఉంది. అంతేకాక, భారత్‌పట్ల ట్రంప్‌కు కొందరు విశ్వసిస్తున్నట్లు ప్రత్యేక ప్రేమేమీ లేదు. ఒక అమెరికన్ కంపెనీకి చెందిన మోటారు సైకిళ్ల దిగుమతులపై సుంకం తగ్గించకపోతే, భారత్‌నుంచి ఆటోమొబైల్స్ దిగుమతిపై సుంకాలు పెంచుతామని ట్రంప్ హెచ్చరించటం, మోడీ ప్రభుత్వం స్వల్పంగా సుంకం తగ్గించటాన్ని అపహాస్యం చేయటం ఇటీవలి వ్యవహారమే. సబ్సిడీ రూల్స్ ఉల్లంఘనంటూ చైనాతో పాటు భారత్‌ను కలగలిపి డబ్ల్యుటిఒలో అమెరికా ఫిర్యాదు చేసింది. అందువల్ల ట్రంప్ 'రక్షణాత్మక' విధానం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సవాళ్లు విసురుతోంది. ట్రంప్ ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారో ఎవరి ఊహకు అందదు కాబట్టి ఇది వాణిజ్య యుద్ధంగా మారుతుందా అనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

'అసంఘటిత' దుస్థితి

చూపు

ఆర్థికవ్యవస్థ పరిస్థితి గురించి ఖచ్చితమైన అంచనా ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత మాత్రమే చెప్పగలం. ఈ మధ్యకాలంలో 4నెలల క్వార్టర్లీ డేటా చూసి మురిసిపోవడం భ్రమల్లో మునిగిపోవడమే అవుతుంది. ఎందుకంటే సాధారణంగా క్వార్టర్లీ డేటా కార్పోరేట్‌రంగం సూచికల ఆధారంగా అంచనా వేసింది మాత్రమే. ఆర్థికవ్యవస్థ గొప్పగా ఉందని చెప్పే సూచికలన్నీ కార్పొరేట్ రంగానికి ప్రత్యక్షంగా సంబంధించినవి మాత్రమే. కొంతవరకు వ్యవసాయరంగం, సేల్స్ టాక్సుల సూచికలు కార్పోరేటేతర రంగాల సూచికలుగా ఉపయోగపడతాయి. వ్యవసాయరంగం, సేల్స్ టాక్సు డాటాల ద్వారా మార్కెటులో వ్యాపారం ఎలాఉందో తెలుస్తుంది. కాబట్టి ఇప్పుడు మనం ఆర్థికవ్యవస్థ పనితీరు బాగున్నట్లు కనిపించే సూచికలన్నీ వాస్తవానికి కార్పొరేట్ ఇండియా నోట్లరద్దు, జియస్‌టిల తర్వాత గాటన పడిందని సూచిస్తున్నాయి.


క్వార్టర్లీ పెరుగుదల డేటా ప్రకారం ఇప్పుడు ఆర్థికవ్యవస్థ 7 శాతం రేటుతో ప్రగతి పథాన ప్రయాణిస్తుందని చెప్పడాన్ని ఇలాగే అర్థం చేసుకోవాలి. 2015–16 నాల్గవ క్వార్టరులో ఎకానమి పెరుగుదల రేటు 9.1 శాతం ఉండేది. కాని 2016–17 నాల్గవ క్వార్టరులో 5.7 శాతానికి పడిపోయింది. కాని ఇప్పుడు 7శాతానికి చేరుకుందని సూచికలు చెబుతున్నాయి. అంటే ఎకానమి పుంజుకుందని అర్థం చేసుకోగలమా? కాని దేశంలో యువతరం, రైతులు, వ్యాపారులు అందరూ ఆందోళనల బాటన ఎందుకు నడుస్తున్నారు? ఆర్థికవ్యవస్థ పుంజుకుంటున్నప్పటికీ కష్టాలు తప్పడం లేదని అర్థమవుతుంది. దీనికి కారణమేమంటే, అధికారికంగా చెబుతున్న 7శాతం పెరుగుదల అనేది వాస్తవానికి దూరం. స్థూలజాతీయాదాయంలో 45శాతం వరకు అసంఘటితరంగం నుంచి వస్తుంది. నోట్లరద్దు, జియస్‌టి ల వల్ల ఈ రంగం కుదేలైపోయింది.

ఎకానమిలో కార్పోరేటేతర రంగానికి సంబంధించిన ఖచ్చితమైన లెక్కలు, డేటా లేదు. వ్యవసాయరంగానికి సంబంధించిన డేటా దొరుకుతుంది. వ్యవసాయరంగంలో దిగుబడి పెరిగిందని తెలుస్తోంది. కాని ధరలను చూస్తే రైతులకు ఆదాయం పెరగలేదు. ఎకానమీలో 45శాతం ఉన్న అసంఘటితరంగంలో వ్యవసాయరంగం 17శాతం ఉంది. ఈ రంగంలో దిగుబడి పెరిగిందని చెబుతున్నప్పటికీ రైతులకు ఆదాయమూ పెరగలేదు. మార్కెటులో ఆహారపదార్థాల ధరలు తగ్గలేదు. ఇదొక విచిత్రమైన పరిస్థితి. మిగిలిన 28శాతం అసంఘటిత రంగానికి సంబంధించిన డేటా ఎవరివద్దా లేదు. ఈ రంగం పదిశాతం పతనమైనా మిగిలిన ఆర్థికవ్యవస్థ ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం పెరుగుదల నమోదైందని భావించినా, మొత్తం ఎకానమీ పెరుగుదల ఒక్క శాతానికి మించదు. వ్యవసాయరంగంలో సంక్షోభం ఎలాగుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మహారాష్ట్రలో మొన్నటి రైతుయాత్రే దానికి నిదర్శనం. దేశంలో 94 శాతం ఉపాధి కార్యకలాపాలు అసంఘటితరంగంలోనే ఉన్నాయన్నది మరో వాస్తవం. అసంఘటితరంగంలోనే చాలామంది పనిచేస్తున్నారు. కాబట్టి అసంఘటితరంగంపై పడే ప్రభావం దేశంలో ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలను దెబ్బతీస్తుంది. గ్రామీణ ఉపాధి కార్యక్రమం మన్రేగా కోసం డిమాండ్ పెరుగుతుందంటే అర్థం ఈ రంగం తీవ్రంగా దెబ్బతిన్నదనే.

సంఘటితరంగం, కార్పొరేట్ రంగం లెక్కలు లభిస్తాయి కాబట్టి క్వార్టర్లీ పెరుగుదలను లెక్కించి, అసంఘటిత రంగంలోను ఇదే పెరుగుదల ఉంటుందని ఊహించి వేసే లెక్కలే ఇప్పుడు చెబుతున్నారు. ఎకానమి ఎలాంటి కుదుపులు లేకుండా ఉన్నప్పుడు ఈ పద్ధతి పనిచేయవచ్చు కాని నోట్లరద్దు, జియస్‌టి వంటి కుదుపుల తర్వాత అసంఘటితరంగమే తీవ్రంగా ప్రభావితమైందని అర్థమైన తర్వాత కార్పోరేట్‌రంగం పెరుగుదల సూచికలను అసంఘటిత రంగానికి వర్తించి అంచనాలు వేయలేము. నోట్ల రద్దు, జియస్‌టి కుదుపుల తర్వాత అసంఘటితరంగం ధ్వంసమైంది. సంఘటితరంగం కుదుపులను తట్టుకుని నిలబడిన తర్వాత అసంఘటిత రంగాన్ని తొక్కేసి పైకి ఎదిగే అవకాశాలు లభించాయి. ఉదాహరణకు జియస్‌టిలో సంక్లిష్టమైన టాక్సేషన్ ప్రక్రియ అసంఘటితరంగంలో చిన్నా చితక వ్యాపారాలను నాశనం చేసింది. కాని ఈ సంక్లిష్ట టాక్సేషన్ అర్థం చేసుకుని ముందుకు సాగగలిగిన కార్పోరేట్ రంగానికి లాభించింది. చిల్లర వ్యాపారాలు మూతపడితే చైన్ షాపులకు, మాల్స్‌కు గిరాకి పెరుగుతుంది. కాబట్టి ఎకానమి పెరుగుదల నమోదు చేసిందని డాటా చూపిస్తున్నప్పటికీ వాస్తవానికి ఎకానమి ఎక్కడిదక్కడే ఉంది. అసంఘటితరంగం దెబ్బతినడం వల్ల మరోపరిణామం ఏమంటే మార్కెటులో డిమాండ్‌పై ప్రభావం పడింది. అందువల్లనే పెట్టుబడులు పుంజుకోవడం లేదు. పెట్టుబడులు ఎలా ఉన్నాయన్నది ఎకానమి ఆరోగ్యాన్ని సూచిస్తుంది.

ఇక్కడ ప్రస్తావించవలసిన మరో ముఖ్యమైన విషయమేమంటే, 2008–09 ఆర్థికసంక్షోభం నుంచి దేశాన్ని కాపాడింది అసంఘటితరంగమే. ముఖ్యంగా గ్రామీణ ఆర్థికవ్యవస్థ ప్రపంచంలో వివిధ దేశాలను కుదిపేసిన ఈ సంక్షోభం ప్రభావం లేకుండా ఉండగలిగింది. గ్రామీణ ఆర్థికవ్యవస్థ మార్కెటులో డిమాండ్ దృష్ట్యా కూడా చాలా ముఖ్యమైనది. ప్రజల్లో కొనుగోలు శక్తి లేకపోతే మార్కెటు ఉండదు. అసంఘటితరంగం దెబ్బతింటే చాలా పెద్ద జనాభా కొనుగోలు శక్తి దెబ్బతింటుంది. దేశంలో సగం కన్నా ఎక్కువ జనాభా గ్రామాల్లో నివసిస్తున్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నప్పుడు వారి కొనుగోలు శక్తి కూడా దెబ్బతింటుంది. వ్యవసాయరంగం గ్రామీణ ఆర్థికవ్యవస్థకు చాలా కీలకమైనది. వ్యవసాయరంగంలో ఖర్చు పెరుగుతోంది. అందుకోసం అప్పులు పెరుగుతున్నాయి. దిగుబడికి సరయిన గిట్టుబాటు ధర లభించడంలేదు. నిజం చెప్పాలంటే వ్యవసాయం సంక్షోభంలో ఉంది. ఈ నేపథ్యంలో పెరిగిన దిగుబడి ప్రగతిని సూచిస్తుం దా? రైతులకు మార్కెట్ అందుబాటులో లేనప్పుడు వారి ఆదాయం పెరగనప్పుడు వ్యవసాయాధారిత ఉపాధుల్లోను ఆదాయం ఉండదు. ఇప్పుడు బ్యాంకులపై పెరిగిన ఒత్తిడి ప్రభావం ఆర్థికవ్యవస్థలో చిన్నస్థాయి వ్యాపారులు, పరిశ్రమలపై పడుతోంది. అవసరమైన పెట్టుబడులకు రుణాలు వారికి లభించే అవకాశాలు తగ్గుతున్నాయి. అంటే చిన్నస్థాయి ఆర్థికకార్యకలాపాలు దెబ్బతింటుంటే భారీస్థాయి ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతున్నాయి. అందువల్లనే 7శాతం పెరుగుదల రేటు చూపించగలుగుతున్నారు. ఇది ఉపాధికల్పనకు, ఉద్యోగావకాశాలకు మంచిది కాదు. భారీ కంపెనీలు మరింత పెరగడం వల్ల ఉద్యోగావకాశాలు కొత్తగా పుట్టుకురావు. కొత్తగా ప్రారంభమయ్యే స్టార్టప్స్ పెరగడం వల్లనే ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. నోట్ల రద్దు, జియస్‌టిల తర్వాత ఆర్థికవ్యవస్థ పెరుగుదలను నమోదు చేస్తుందని చెప్పే గణాంకాల్లో అసంఘటితరంగం పరిస్థితేమిటన్నది ఇప్పుడు అందరూ ఆలోచించవలసిన ప్రశ్న. పల్లెటూళ్ళలో చిల్లర కొట్లు మూతపడి, పల్లెటూరి జనం కిరాణా సరుకుల కోసం పట్టణంలో మాల్స్‌కు రావడం ప్రారంభమైతే అది గొప్ప ప్రగతి అని భావించగలమా?

* రఫీక్



బాలికా సాధికారత - కొన్ని ప్రశ్నలు



యన్.తిర్మల్
9441864514

భ్రూణ హత్యలు, శిశు మరణాలు, గృహహింస, వేధింపులు, లైంగిక దాడులు, బాల్యవివాహాలు, అత్యాచారాలు, వరకట్న హత్యలు, పరువు హత్యలు, ఆత్మహత్యలు నిత్యకృత్యం కావడం వెనుక ఆంతర్యాలు ఏమిటనే ప్రశ్న లు మనల్ని వెంటాడుతునే ఉంటాయి. మనదేశ జనాభాలో 48.46 శాతంగా ఉన్న సగభాగం మహిళల సర్వతోముఖాభివృద్ధి దేశాభివృద్ధితో ముడిపడి ఉంది. 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల్లో 33% రిజర్వేషన్లు మహిళలకు అమలు జరుపు తున్నప్పటికీ పార్లమెంటులో పలుమార్లు మహిళా బిల్లు వీగిపోయేలా చేయడం ద్వారా చట్టసభల్లో స్త్రీల ప్రాతినిధ్యం నామమాత్రంగానే మారింది. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం భారతదేశం ఈ విషయంలో 148వ స్థానంలో ఉంది. మనకంటే ఎన్నో ఆఫ్రికా దేశాలు ఈ విషయంలో ముందున్న సంగతి గమనించాలి. లింగ వివక్షలో 114, ఆర్థిక స్వావలంబనలో 134, విద్యలో 126, వైద్యంలో 141 స్థానాలు పొంది దేశం వెనుకబాటును గణాంకాలు వెక్కిరిస్తున్నాయి. ఇటీవలనే కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ మంత్రి మేనకా గాంధీ అయామ్ దట్ ఉమెన్ అనే పథకాన్ని ప్రారంభించారు. మహిళలు అన్ని రంగాల్లో తమకు తామే ఆత్మగౌరవంతో వృద్ధి చెందాల నేది దాని లక్ష్యం. కేంద్ర ప్రభుత్వం భేటీ బచావో బేటీ పడావో బాలికల కోసం ప్రకటించింది. ఇన్ని పథకాలు అమలు జరుపుతున్నా ప్రాథమిక పాఠశాలల్లో కేవలం 88.7 శాతం మాత్రమే బాలికల నమోదు ఉంది. సెకండరీ స్థాయికి వచ్చేసరికి అది 52శాతం కాగా ఉన్నత విద్య పూర్తి అయ్యేసరికి కేవలం 33 శాతం మంది ఉన్నత విద్య పూర్తి చేయగలుగుతున్నారు. నూటికి 67మంది బాలికలు మధ్యలోనే అక్షర యజ్ఞానికి దూరం అవుతుంటే బాలిక సాధికారతకు అర్థం ఉందా? దీనికితోడు తాజాగా కేంద్రప్రభుత్వం 'గీతా బుక్కల్ కమిటీ సూచన మేరకు నూతన జాతీయ విద్యా విధానం 2016–2020 ముసాయిదాలో ప్రాథమిక స్థాయిలో ఐదవ తరగతి , మాధ్యమిక స్థాయి లో 8వ తరగతికి డిటెన్షన్ ప్రవేశపెట్టే యోచనను వ్యక్తం చేసింది. నాన్ డిటెన్షన్ విధానంలోనే బాలికా విద్య స్థాయిలో దిగజారి ఉంటే డిటెన్షన్ విధానం తిరిగి అమలు జరిపితే బడిబయట ఉండే బాలికల సంఖ్య మరింత పెరగదనే గ్యారెంటీ ఏమీ లేదు. ఇక బాలికా విద్యా ప్రాధాన్యత గురించి మాట్లాడే మనం బాలికలు బహిష్టు సమయంలో వినియోగించే శానిటరీ napkins పై 12% జీఎస్‌టి వసూలు చేస్తున్నాం. దీన్ని తొలగించాలని అనేక మహిళా సంఘాలు చేస్తున్న విజ్ఞప్తులు, ఆందోళనలు ప్రభుత్వం చెవికి ఎక్కినట్టు లేదు. తెలంగాణ విద్యా శాఖమంత్రి కడియం శ్రీహరి రాష్ట్రంలో కస్తూరిబా బాలికల విద్యాలయాలను పన్నెండో తరగతి వరకు అప్ గ్రేడ్ చేయాలన్న తమ విజ్ఞప్తిని కేంద్రప్రభుత్వం అంగీకరించడం లేదని విస్పష్ట ప్రకటన చేశారు. వాస్తవంగా నూతన జాతీయ విద్యా విధానం 2016–2020 ముసాయిదాలో ఈ విషయం ఉంది. అవసరాన్ని బట్టి కెజిబివి లను 12వ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేసుకోవచ్చునని స్పష్టం చేసింది. మరి బాలిక విద్యా విషయంలో ఈ ద్వంద్వ ప్రమాణాలేమిటో అర్థం కాదు. కేంద్ర ప్రభుత్వం 50% ఎస్‌టిలు నివసించే ఆవాస ప్రాంతాల్లో లేదా 20,000 గిరిజన జనాభా నివసించే ఆవాసాల్లో ఏకలవ్య ఆదర్శ గురుకులాలు ఏర్పాటు చేయాలని విధానపరమైన నిర్ణయం తీసుకుంది. ప్రాథమిక విద్యాస్థాయిలో పాఠశాల మానివేస్తున్న బాలికల సంఖ్య 19శాతం కాగా ఎస్‌సిలలో 22%, ఎస్‌టిలలో 41 శాతం ఉంది. మాధ్యమిక విద్యలో బడి మానేస్తున్న మొత్తం బాలికల సంఖ్య 31శాతం కాగా ఎస్‌సిలలో 32%, ఎస్‌టిలలో అది 54% గా ఉంది. సెకండరీ స్థాయి గణాంకాలు అందుకు భిన్నం గా లేవు. మొత్తం బాలికల డ్రాపవుట్స్ 38% కాగా ఎస్‌సిలలో 35%, ఎస్‌టిలలో 63 శాతంగా ఉంది.అంటే 1వ తరగతిలో ప్రవేశించిన ఎస్టీ బాలిక పదో తరగతి వచ్చేసరికి కేవలం 37శాతం మాత్రమే అక్షరాస్యులవుతున్నారు. ఈ గణాంకాలు గిరిజన ప్రజల సంస్కృతి, సాంప్రదాయ విలువల్ని పట్టించుకోని సభ్య సమాజ మానవీయ కోణాల్ని ప్రశ్నిస్తుంది. ప్రధానంగా గిరిజన తెగల్లో భాషాపరమైన వైవిధ్యత శాపంగా మారింది. కోయ, గోండు, మోరియా, చెంచు, ఎరుకల, సుగాలీ, కొలాం ఇలాంటి గిరిజన తెగలకు, ఆదివాసీలకు వారివారి మాతృభాషలున్నాయి. ఈ ఆదివాసీ భాషలకు లిపి లేదు. అందువల్ల వీరిపైన తెలుగు లేదా మరేదైనా మాధ్యమాన్ని బలవంతం గా రుద్దుతున్నాం.

ఇక ఎస్‌సి, ఎస్‌టి విద్యలో భాషాపరమైన వైవిధ్యత ఒక సమస్య అయితే ఇప్పుడు అన్ని పాఠశాలల్లో వేధిస్తు న్న సమస్య మరొకటి ఉంది. అది ప్రపంచీకరణ ఫలితం గా మారిన సామాజిక, సాంస్కృతిక సంబంధాలు, పాశ్చాత్య పోకడలు, అంతర్జాలం అరచేతిలోకి రావడం, సెల్‌ఫోన్ వాడకం పెరగడం, ప్రసార మాధ్యమాల్లో నిరంతరం హింసా ప్రవృత్తిని, అనాగరికతను ప్రసారం చేయ డం, సామాజిక ప్రయోజనాలు కొరవడిన వ్యాపార చలన చిత్రాలు పాఠశాల విద్య, ముఖ్యంగా బాలిక సాధికారత కు ప్రధాన అడ్డంకిగా ప్రస్తుతం కనిపిస్తున్నాయి. ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలన్నింటా కనిపిస్తుంది. చిన్న వయస్సులోనే గుట్కా, సిగరెట్, ఇతర దురలవాట్లకు లోనుకావడం, తరగతి గదిలో క్రమశిక్షణారాహిత్యం, పాఠ్యాంశాలు వినకపోవడం, విసుగు చెందడం లాంటి దుర్గుణా లు ఇప్పుడు తరగతి గదిని వెంటాడుతున్నాయి. ఈ విద్యా విధానంతోమారిన తాజా పరిస్థితి సవాళ్లను అధిగమించడం కష్టమైన పనిగానే కనిపిస్తుంది. అంతిమంగా ఈ మారిన స్థితి బాలికా సాధికారతను ప్రశ్నార్థకం చేస్తుంది. దీని దుష్ఫలాలు పసి వయసు ప్రేమలు, బాల్య వివాహాలు, వేధింపులు, అత్యాచార సంఘటనలు, యాసి డ్ దాడులు, ఆత్మహత్యలు, పరువుహత్యలు, ప్రేమోన్మాదం రూపంలో బహిర్గతం అవుతున్నాయి. ఫలితంగా అభివృద్ధికి కీలకమైన సగభాగం బాలిక విద్యా అగమ్యగోచరం అవుతుంది. బాలికలు ప్రధానంగా తాము నివసిస్తున్న గృహం, విద్య నార్జిస్తున్న సంస్థలు, వసతి గృహాల్లో సైతం అభద్రతా భావంతో నెట్టుకురావాల్సి వస్తుంది. జాతీయ నేర గణాంక నివేదికల సరళిని గమనిస్తే 94% వేధింపులు, అత్యాచారాలు సొంత కుటుంబ సభ్యులనుండి, తను రక్షణ పొందాల్సిన సంస్థలనుండే కావడం ఆశ్చర్యకరమైన విషయం. కంచే చేనుమేస్తే కాపేమి చేయు అన్న సామెత అక్షరాల ఈ విషయంలో వర్తిస్తుంది.

వివాహం అనేది బాలికా సాధికారతకు ప్రధాన అడ్డంకిగా ఉంది. 2001 జనాభా గణన నుండి 2011 జనాభా గణన మధ్య పది సం॥ల కాలంలో దేశంలో కోటిన్నర బాల్య వివాహాలు జరిగాయి. వివాహాలు, ఖర్చులు దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తున్నాయని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆందోళన సైతం ఒక దశలో వ్యక్తం చేశారు. వివాహాలు ఆడంబరంగా స్తోమతకు మించిన అంశంగా మారి ఎన్నో కుటుంబాల స్థితిగతుల్ని ప్రభావితం చేస్తున్నాయి. మధ్యతరగతి, బలహీన వర్గాలకు ఈ తంతు భారంగా మారింది, ఈ దశలో తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ పథకాలు అత్యంత ప్రజాదరణ పొందాయి.మధ్య తరగతి, అట్టడుగు వర్గాల వారికి ఆడపిల్లల తల్లిదండ్రులకు ఊరటనిచ్చాయి. ఈ పథకం కింద తొలుత రూ.50,000 అటు తరవాత 75,000 రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం దాన్ని లక్ష రూపాయలకు విస్తరించే యోచనలో ప్రభుత్వం ఉంది. ఇదే పథకాన్ని వెసులుబాటును బట్టి ఆంధ్రప్రదేశ్‌లో అమలు జరుపుతామని ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుదు విస్పష్ట ప్రకటన చేశారు. ఈ పథకం అమలు వలన మధ్యతరగతి, పేద వర్గాల తల్లిదండ్రుల గుండెలపై కుంపట్లు కొంత దింపినట్లు ఉండవచ్చును కానీ మరో కోణంలో బాలిక సాధికారతను ఈ పథకాలు దెబ్బతీస్తున్నాయి. గడచిన రెండు దశాబ్దాల్లో ఎనిమిది మిలియన్ల భ్రూణ హత్యలు జరిగాయి. ఫలితంగా బాలికల సంఖ్య తగ్గి, పెళ్ళికాని యువకులు వయసు ముదిరి ఆందోళన చెందుతున్న యువత ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అధికంగానే ఉంది. ఒక విధంగా ఇది అయిష్టంగానైనా సంక్షుభిత స్థితి కులరహిత వివాహాలు వైపు యువతను మళ్ళించడం ఒకింత ఆహ్వానించదగ్గ పరిణామమే. కానీ 18 సం॥లు నిండి, నిండని బాలికల వైపు వీరి దృష్టి పడింది. ఒకవైపు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల ఆసరా, మరోవైపు పెళ్ళి కాని యువత ఒత్తిడి మూలంగా అనేకమంది బాలికల వివాహాలు 18 సం॥లు నిండీ నిండగానే జరిగిపోతున్నాయి. ఫలితంగా ఉన్నత విద్యకు ఈ బాలికలు దూరమై పిన్న వయస్సులోనే సంసార భారాలు, పిల్లల పెంపకాలు, బాధ్యతలు నెత్తి కెత్తుకోవాల్సిన పరిస్థితి వస్తోంది. పథకాల అమలు తప్పుకాదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఈ విషయాల్లో యోచన చేయాలి.18సం॥లు నిండిన బాలికల పెళ్లికి 50,000, 20సం॥లు నిండితే 75,000, 23 సం॥లు అయితే లక్ష రూపాయలు ఇలా శ్లాబ్ విధానం ప్రవేశపెట్టడం అవసరమేమోనని అనిపిస్తుంది. ఇక బాలిక సాధికారత విషయంలో వైద్యంకు రెండో స్థానం ఉంది. ప్రపంచంలోని అనేక దేశాలు ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వమే నేరుగా బాధ్యత వహిస్తుంటే, మనదేశంలో ప్రైవేటు వైద్యానికి ఆ బాధ్యత అప్పగించి ప్రభుత్వాలు గుడ్లప్పగించి చూస్తున్నాయి. తన జిడిపిలో వైద్యానికి అమెరికా 8%, బ్రిటన్ 7.6శాతం ఖర్చు చేస్తుంటే మనదేశం మాత్రం జిడిపిలో 1.3శాతం మాత్రమే వైద్యరంగానికి ఖర్చు చేయటం దేన్ని సూచిస్తుంది? ఫలితంగా ప్రతి ఇద్దరు మహిళల్లో ఒకరు రక్తహీనతలో బాధపడుతున్నారు. 17%మాతృ మరణాలు, 21% శిశుమరణాలు, 78వేల పైచిలుకు భ్రూణ హత్యలు నమోదవుతున్నాయి. ఈ స్థితిలో బాలికా సాధికారత సామాజిక ప్రశ్నగానే మిగిలనుంది.

అవిశ్రాంత లక్ష్య సాధకుడు



కర్నె ప్రభాకర్,
శాసనమండలి సభ్యులు

ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో 2003లో చిన్న రాష్ట్రాల ఏర్పాటు డిమాండ్‌తో రాం విలాస్ పాశ్వాన్ ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొనడానికి హైదరాబాద్ నుంచి దాదాపు వెయ్యికార్లతో ర్యాలీగా వెళ్లాం. కెసిఆర్ నాయకత్వం లో మూడు రోజులు ప్రయాణం చేసి 1700 కిలోమీటర్లు దాటి ఢిల్లీ సభలో పాల్గొన్నాం. దేశవ్యాప్తంగా చిన్న రాష్ట్రాల ఏర్పాటు ఆవశ్యకతను ఢిల్లీ పెద్దలకు వినిపించడానికి ఏర్పాటు చేసిన సభ అది. సభ ముగిసి ఒక రోజు బస అనంతరం కార్లలో వచ్చిన వారంతా తిరుగు ప్రయాణం కాగా కెసిఆర్‌తో పాటు నేను అతి కొద్ది మంది సహచర నాయకులు కలిసి నాలుగు కార్లలో ప్రయాణిస్తూ మార్గమధ్యంలో ఆగ్రా దాటుతుండగా జాతీయ రహదారి పక్కనే ఉన్న ఆగ్రాఫోర్ట్, తాజ్‌మహల్ కనిపించాయి. వాటిని చూడాలనే కుతూహలంతో నేను, మరికొంతమంది మిత్రులం కలిసి కెసిఆర్‌తో 'సార్...ఆ రెండు చారిత్రక కట్టడాలను చూసి వెళ్దామా' అని అడిగాం. దానికి సార్ అన్న మాటలు నాకు ఇప్పటికీ గుర్తున్నాయి. 'మన లడాయి ఇంకా చాలా ఉంది. మళ్లీ చాలాసార్లు మనం ఈ ప్రాంతానికి రావాల్సి ఉంటది' అని అన్నప్పుడు ఆ మాటల ఆంతర్యం ఆనాడు మాకు అర్థం కాలేదు. కానీ గత నెలలో కరీంనగర్ వేదికగా కెసిఆర్ దేశవ్యాప్తంగా రైతుల సమస్యలకోసం తెలంగాణ నాయకత్వం వహిస్తుందని అన్నప్పుడు 15ఏండ్ల క్రితం ఆగ్రా జాతీయ రహదారిపై తను అన్న మాటల ఆంతర్యం ఇప్పుడిప్పుడే బోధపడుతున్నది. కెసిఆర్ నిత్య అన్వేషి. తన జీవితాన్ని సార్థకం చేసుకోవాలనే తపన ఉన్న నేత. బతికినంత కాలం ప్రజల బాగు కోసం ఏదో ఒకటి చేయాలనే అకుంఠిత దీక్ష ఉన్న నాయదు.



అందుకే తనకు రాజకీయ జీవితాన్ని ఇచ్చిన సిద్దిపేట ప్రజలు, తనను ముఖ్యమంత్రిని చేసిన తెలంగాణ ప్రజల బతుకుల్లో వెలుగులు నింపేలా జనరంజక పాలన సాగిస్తూ వారి రుణం తీర్చుకున్నారు. అంతటితో ఆగకుండా తన శక్తిసామర్థ్యాలను దేశంలో ఉన్న సమస్యల పరిష్కారానికి శాస్త్రీయంగా ఆలోచించి దేశవ్యాప్తంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించే బాధ్యతను తన భుజాన వేసుకునేందుకు సన్నాహాలు చేస్తున్న తీరును చూస్తుంటే నిజంగా ఆయన అలుపెరగని యోధుడే. కెసిఆర్ జాతీయ రాజకీయ ప్రస్థానానికి సంబంధించిన మాట తన నోట రాగానే దేశంలో చాలా పార్టీల నాయకుల నుంచి అభినందనలు, మీ వెంటే నడుస్తామనే భరోసా ఆయనకు లభించాయి. యావత్ తెలంగాణ సమాజం ఆత్మగౌరవంతో తలెత్తుకొని అభినందిస్తూ తెలంగాణ ఉద్యమంలాగే అండగా ఉంటామని ధైర్యం ఇస్తున్నారు. అయితే కొంతమంది కురస నాయకులు, ప్రతి దానిని వ్యతిరేకించే నిత్య అసంతృప్తులు, తెలంగాణ నాయకత్వాన్ని అనునిత్యం అసందర్భంగా నిందించే కురీపీలు మాత్రమే కెసిఆర్‌ను విమర్శిస్తున్నారు. నిజానికి కెసిఆర్ కు ఉన్న గత అనుభవం కానీ, భవిష్యత్ వ్యూహ రచన కానీ ఆయనతో ప్రయాణిస్తూ ఆయన ఆలోచనా విధానాన్ని, కార్యదక్షతను దగ్గరగా చూసిన వారికి, ఆయన శక్తిసామర్థ్యాలు తెలిసిన వారికి, ఆయన అంతరంగాన్ని లోతు గా చూసిన వారికి మాత్రమే అర్థమవుతాయి. కానీ ప్రతి దానిని వంకర గా చూసే తత్వం కలిగిన వారికి మాత్రం కెసిఆర్ దీక్షాదక్షతలు అర్థమవుతాయని ఆశించలేం. అయితే తెలంగాణ ఉద్యమ సందర్భంలో కావచ్చు. తను ఎమ్మెల్యే కాకముందే ఢిల్లీ వాతావరణం గురించి తెలిసి ఉండటం కావచ్చు.కెసిఆర్‌కు ఢిల్లీలో జాతీయ రాజకీయ వ్యవస్థ లాబీయింగ్ కొట్టిన పిండి. తెలంగాణ రాష్ట్రం కోసం దాదాపు 36 పార్టీల ఆమోదాన్ని తీసుకురావడంలో కెసిఆర్ పడ్డ శ్రమ గురించి కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. అన్ని పార్టీలు ఒకే అభిప్రాయాన్ని వ్యక్తం చేసేలా కెసిఆర్ ప్రదర్శించిన చతురతతో ఢిల్లీ పెద్దలలో తెలంగాణ పట్ల ఉన్న వ్యతిరేకత అధిగమించారు. నిజానికి ఢిల్లీలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలంగాణ వ్యతిరేకుల శక్తియుక్తులను తక్కువ అంచనా వేయలేం. వారివి దేశాన్నే ప్రభావితం చేయగల శక్తియుక్తులు. ఇలాంటి తెలంగాణ వ్యతిరేక శక్తులతో తలపడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడమంటేనే కెసిఆర్ దేశంలో ఎంతటి జటిలమైన సమస్యనైనా తన భుజానికెత్తుకొని గమ్యాన్ని ముద్దాడే వరకూ నిద్రపోడన్నదానికి నాలుగో వసంతంలోకి అడుగు పెడుతున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమే నిలువెత్తు సాక్ష్యం. తెలంగాణ ఉద్యమం సందర్భంగా దేశవ్యాప్తంగా చిన్న రాష్ట్రాల డిమాండ్‌ను వినిపించడానికి నాగపూర్ వేదికగా ప్రస్తుత తమిళనాడు గవర్నర్ బన్వారీలాల్ పురోహిత్ నేతృత్వంలో 'విదర్భ రాజ్యసమితి', మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ మధ్య భాగమైన బుందేల్ ప్రాంతంలో బుందేల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ బాబూలాల్ తివారి నేతృత్వంలోని బుందేల్‌ఖండ్ రాజ్యసమితి ఏర్పాటులో కెసిఆర్ పాత్ర కీలకం. బీహారు నుండి వేరుపడిన జార్ఖండ్ రాష్ట్రంకోసం సాగిన ఉద్యమానికి నాయకత్వం వహించిన శిబూసోరెన్ తో కెసిఆర్‌కు సాన్నిహిత్యం ఉండేది. దీంతో ఆ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో కెసిఆర్ ఆదేశంతో నేను, నాతోపాటు పార్టీ సీనియర్ నాయకులు, అప్పటి రాష్ట్రమంత్రులు ప్రచారంలో పాల్గొన్న మాతో పాటు కెసిఆర్‌కు ఆ రాష్ట్ర స్థితిగతుల గురించి అవగాహన ఉంది. వ్యవసాయ పితామహుడు దేవీలాల్ వంటి వారితో అభిప్రాయాలు పంచుకున్న అనుభవం, జలభిక్ష పేరుతో పొరుగు రాష్ట్రమైన కర్నాటకతో ఏర్పరుచుకున్న స్నేహ బంధం, కరుణానిధి, స్టాలిన్, రాందాస్ లాంటి వారితో సమస్యల పరిష్కారం కోసం ఒక సానుకూల వాతావరణం తీసుకొచ్చిన అనుభవం, మహారాష్ట్ర రాజకీయాలలో సంచలనంగా నిలిచిన శరద్ పవార్‌తో ఉన్న సత్సంబంధాలు, వివిధ సందర్భాలలో తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా నిలిచిన ప్రస్తుత జమ్ముకాశ్మీర్ సిఎం మెహబూబా ముఫ్తి, రాందాస్ అథావాలే, తమిళ నాయకులు రాందాస్, వైగో, మాజీ ప్రధాని దేవేగౌడలే కాకుండా దేశవ్యాప్తంగా అనేకమందితో మంచి సంబంధాలు కెసిఆర్ ఉద్యమ ప్రస్థానంలో దర్శనమిస్తాయి.కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ కెసిఆర్‌కు తెలియని, పరిచయం లేని నాయకుడు ఒక్కరైనా ఉన్నారా?అని అడిగితే లేరనే సమాధానం కెసిఆర్‌ను నిత్యం వ్యతిరేకించే వారినుంచి తప్ప యావత్ తెలంగాణ సమాజం నుండి వస్తుంది.

తెలంగాణ ఉద్యమ ప్రారంభంలోనే 2002లో ఢిల్లీ వేదికగా జరిగిన చిన్న రాష్ట్రాలతో ఏర్పాటు డిమాండ్‌తో జరిగిన సమావేశం ఏర్పాట్ల సందర్భంగా మైనస్–2 ఉష్ణోగ్రతలతో ప్రతికూలంగా ఉన్న వాతావరణంలో అహోరాత్రులు శ్రమించి బ్యానర్లు కట్టడం, జెండాలు ఏర్పాటు చేయడం, ఆ ప్రాంతాన్ని అలంకరించడం వంటి పనులలో భాగస్వాములమైన మాలాంటి మిత్ర బృందానికి తెలిసి వచ్చిన అనుభవం ఏమిటంటే ఒక అంశాన్ని భుజానికి ఎత్తుకుంటే ఎన్ని వ్యక్తిగత సమస్యలు ఎదురవుతాయని, మొత్తం మీద కెసిఆర్ ఎత్తుకున్న ప్రతి అంశాన్ని విజయవంతం చేయడానికి తాను చేసే ప్రయత్నం, పడే శ్రమ కేవలం వారితో ప్రయాణించిన వారికి, ఆయన సాధించిన విజయాలను అనుభవిస్తున్న వారికి, పాజిటివ్‌గా ఆలోచించే వారికి మాత్రమే అర్థమవుతాయి. ప్రజల మౌలిక వసతుల కల్పన పట్టించుకోకుండా దేశానికి అన్నం పెట్టే అన్నదాతల ఉసురుపోసుకుంటూ కాంగ్రెస్, బిజెపిలు 70 ఏండ్లుగా రాజకీయ కోణంలో ఓట్లు దండుకునే ప్రలోభాలతో సాగిస్తున్న మోసపూరిత మూస పాలన పోయి గుణాత్మక మార్పుతో దేశం నిలదొక్కుకునేలా చేయడం కెసిఆర్‌కు సాధ్యమే. ఈ విషయాన్ని అర్థం చేసుకున్న దేశ ప్రజలు కెసిఆర్ నాయకత్వానికి అండగా నిలుస్తారన్న విశ్వాసం నాకు ఉంది.

వచన బసవన్న భావ ఉప్పెన

ప్రతి ఆదివారం ప్రజాజీవన ప్రతిబింబం
మన తెలంగాణ
మన
మనపేజీ
మనందరిపేజీ
www.manatelangana.news
హైదరాబాద్ | ఆదివారం | 25 మార్చి | 2018

కాయకమే కైలాసం, దేహమే దేవళమన్న సమతావాది

మానవ జాతిని వర్ణ, లింగ భేదాలతో ముక్కలు చేసి తరతరాలుగా కొన్ని వర్గాలు లాభిస్తున్న సామాజిక స్థితిని 12వ శతాబ్దంలోనే బద్దలు కొట్టిన మహా సంస్కర్త బసవేశ్వరుడు.

శైవ బ్రాహ్మణ కుటుంబంలో 1131లో పుట్టిన బసవన్న ఎనిమిదేళ్ల ప్రాయంలోనే సాంప్రదాయక పద్ధతులను వ్యతిరేకించాడు. ఉప నయనం రోజే జంధ్యాన్ని తెంచుకొని ఇల్లు వదిలి కుదల సంగముకు చేరుకున్నాడు. కుదల సంగమ కృష్ణ, మల ప్రభ నదుల సంగమ స్థలం. పన్నెండేళ్లపాటు అక్కడే సకల గ్రంథాల పఠనం కావించాడు. ఆ తర్వాత కళ్యాణకు వెళ్లి కల చూరి రాజు బిజ్జాల ఆస్థానంలో కొలువులో చేరాడు. మొదట గణికుడిగా పని చేసిన బసవన్న తర్వాత ప్రధానమంత్రిగా పలు సేవలందించాడు.

ఈ సమయంలోనే బసవన్న తన చుట్టూ ఉన్న సమాజంలోని దుష్ట సంప్రదాయాలను గమనించాడు. సామాజిక, ఆర్థిక వెనుకబాటుగల కులాలను, కుటుంబాలను వైదిక సాంప్రదాయవాదులు ఎంత హీనంగా చూస్తున్నారో ప్రత్యక్షంగా చూశాడు. అంటరానితనం, లింగ వివక్ష తదితర సమాజ వ్యతిరేక విధానాలు ఆయనను కలచివేశాయి. అగ్రవర్ణ ధనికులు పేదలను జంతువులకన్నా హీనంగా చూడడం ఆయనలో కొత్త ఆలోచనలకు బీజాలు వేసింది. అన్ని కులాలలోనూ మహిళల స్థితి దయనీయంగా ఉండేది. ఈ దుర్నీతిని అంతమొందించేందుకు సామాజిక మార్పుల కోసం తానే ఒక బాటగా మారేందుకు ఆయన సిద్ధపడ్డాడు. సమూల మార్పును ఆశించి 'వచన' పేరిట సరళరీతిలో కన్నడ భాషలో కవిత్వం రాయడం ఆరంభించాడు.

బసవన్న తన భావజాల నిర్మాణంలో తొలుత ఆలయ దర్శనం, పూజలపై బాణం ఎక్కుపెట్టాడు. దేవుడి పేరిట, పలు పూజా విధానాల పేరిట అర్చకులు పేద ప్రజలను మోసం చేస్తున్న తీరును తన వచనల ద్వారా ఎండగట్టాడు. గుడి, దేవుడు అనే బాహ్య, భౌతిక నిర్మాణాలు సమాజానికి కీడు చేస్తున్నాయని ఆలయమైనా, దైవ స్వరూపమైనా మనలోనే, మనతోనే ఉంటాయని బసవన్న కొత్త సూత్రానికి తెర లేపాడు.

"శివునికి ధనవంతులు కడతారు గుడి / నాలాంటి సామాన్యుడేం చేయగలడు? / నాకాళ్లే కోవెల స్తంభాలు / శరీరమే ఆలయ రూపము / శిరస్సే బంగరు గోపురము / ఓ॥ కుదల సంగమ దేవరా! / నిశ్చల భౌతిక నిర్మాణాలు కూలిపోవుగాక కదిలే మేనులోనే కలకాలముండేవు."

ఇలా బసవన్న వందలాది వచనాల ద్వారా తన విప్లవాత్మక సంస్కరణల సిద్ధాంతాన్ని ప్రజల ముందుంచాడు. ఇప్పటికీ కన్నడనాట ఉన్న బసవ ప్రార్థనా స్థలాల్లో వీటి లయ బద్ధ ఆలాపన వినవస్తోంది. సకల జనుల సమానత్వం, స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను అభిలషించిన బసవన్న స్థావర, జంగమ అనే విధానాలను ప్రవేశపెట్టాడు. దేవుడి స్థావరం మానవ శరీరమే అని సదా చలన శీలతను జంగమ తీరుగా ఆయన విశ్లేషించాడు. మానవ శరీరము, ఆత్మలోనే అన్ని శక్తులు కూడి ఉన్నాయని అందువల్ల కుల, మత, సామాజిక, ఆర్థిక విభేదాలను విడనాడి మానవులందరినీ సమానంగా చూడాలని ఉద్బోధించాడు.

తన కాలంలోని సకల వైషమ్యాల పుట్ట అయిన సమాజంలో సమానత్వపు ప్రపంచాన్ని నిర్మించడమే ధ్యేయంగా ఆయన ముందుకు సాగాడు. తరతరాలుగా ఉన్న అస్పృశ్యతను రూపు మాపేందుకు తన గొంతును ఆయుధంగా చేసుకున్నాడు.

అంటరాని వారుగా ముద్రవేసి వెలివేయబడిన వారితో కలిసిపోవడమే కాకుండా వారి ఇళ్లకు వెళ్లి కలిసి భోజనం చేశాడు. ఈ చర్య బసవన్న మాటలను, బాటను ప్రజలు నమ్మడానికి ఎంతో ఉపయోగపడింది. అదే రకంగా మహిళలను ముందుకు తీసుకొచ్చి వారు పురుషులతో సమానంగా ఉండేలా సమస్థానం కల్పించాడు. వారి మనో భావనలను



ఆధునిక కన్నడ సమాజాన్ని కుదిపివేస్తున్న కుదలసంగమ మహాజ్ఞాని

స్వేచ్ఛగా చెప్పుకునే వాతావరణం రూపొందించాడు.

బసవేశ్వరుడు స్థాపించిన 'అనుభవమండప' నేటి పార్లమెంటుకు ఆదిరూపం. ఇందులో అందరూ సమానులే. అణగారిన వర్గాలు, అంటరాని వారు, స్త్రీలు అందరూ సహ పంక్తిలో కూచొని సామాజిక సమస్యలపై సర్వస్వతంత్రంగా చర్చించేవారు. ఆ చర్చల్లో ఆనాటి సమాజంలో నెలవైన ఆర్థిక, సామాజిక, రాజకీయ ఆధ్యాత్మిక సమస్యలను లేవనెత్తేవారు. ఆర్య సంస్కృతి, సనాతన సంప్రదాయాల రూపంలో ఎదుర్కొంటున్న చిక్కులపై వ్యక్తిగత అనుభవాలను చెప్పుకొనేవారు. ఇలా సమకాలీన సమాజ మార్పును ఆశించినవారు సమస్యలకు తగిన పరిష్కారాలను సూచించేవారు. ఈ చర్చల సారంగా బసవన్న తన వచనాలు రచించేవాడు.

బసవన్న సామాజిక ఆర్థిక మార్పుకు, సమానత్వానికి రెండు విషయాలను రూపొందించాడు. అవే కాయక, దాసోహ. కాయక అనగా శ్రమే దైవం, దాసోహ అంటే సంపద సమాన పంపిణీ. వీటి ప్రకారం సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ తమకు తగిన, ఇష్టమైన పనిని చేయాలి. చేసే పనుల పేరిట మనుషుల్లో భేదభావం ఉండకూడదు. సమాజంలో ఉన్నవారందరూ కాయ జీవులే అని ఆయన అభివర్ణించాడు. అయితే కొందరు మేధా సంపన్నులయితే కొందరు శారీరక దారుఢ్యులు. అంతేభేదం. గురువైనా, శిష్యుడైనా ఒళ్లు వంచి పని చేయవలసిందే. కాయక అనేది కేవలం శారీరక కష్టమే కాకుండా దైవసాన్నిధ్యాన్ని సులభంగా, సునాయాసంగా పొందే మార్గం. కాయకమే కైలాసమని కొత్త సూత్రీకరణ కూడా చేశాడు. ఇలా శ్రమ జీవుల్లో ఉన్న వర్ణ, లింగ వైషమ్యాన్ని దూరం చేశాడు.

కాయకుడికి నికరమైన ఆదాయముండాలి. ఆదాయం లెక్కించడంలో సమాన పనికి సమాన వేతనమియ్యాలి. ఇక్కడ కూడా కుల, వర్గ, లింగ వివక్ష ఉండకూడదు. శ్రమజీవి తన సంపాదనతో అవసరానికి తగ్గట్టుగా జీవించాలి. ఇక్కడ బసవన్న ప్రతిపాదించిన మరో ముఖ్యమైన విషయమేమిటంటే ఎవరి సంపాదన అయినా రేపటి కోసం దాచి ఉంచుకోకూడదు. మిగులు సంపాదనను సంఘ శ్రేయస్సు కోసం ఖర్చు చేయాలి. ఈ దొడ్డ గుణానికే ఆయన దాసోహ అని నామకరణం చేశాడు. ఇలా సంపద సమానంగా పంపిణీ కావాలని ఆయన ఉద్దేశ్యం. సామాజిక ఆర్థిక క్షేత్రంలో కాయక దాసోహ అనే రెండు విప్లవాత్మక ప్రతిపాదనలుగా బసవన్న ప్రవేశపెట్టాడు. న్యాయ సూత్రాల విషయంలో కూడా ఆయన తనదైన ధోరణిని వెల్లడించాడు. తన నేర స్మృతిని ప్రభావితం చేసిన వచనాన్ని ఆయన 12వ శతాబ్దంలోనే ఇలా రాశాడు.

ఏదీ దొంగిలించకు, ఎవర్నీ హింసించకు, అబద్ధమసలే ఆడకు, నిగ్రహం కోల్పోకు, ఎవర్నీ ద్వేషించకు. నిన్ను నీవు కీర్తిస్తూ, ఎవరినీ నిందించకు. ఇదే స్వచ్ఛతకు మారుపేరు ఇదే




బసవన్న తన భావజాల నిర్మాణంలో తొలుత ఆలయ దర్శనం, పూజలపై బాణం ఎక్కుపెట్టాడు. దేవుడి పేరిట, పలు పూజా విధానాల పేరిట అర్చకులు పేద ప్రజలను మోసం చేస్తున్న తీరును తన వచనల ద్వారా ఎండగట్టాడు. గుడి, దేవుడు అనే బాహ్య, భౌతిక నిర్మాణాలు సమాజానికి కీడు చేస్తున్నాయని ఆలయమైనా, దైవ స్వరూపమైనా మనలోనే, మనతోనే ఉంటాయని బసవన్న కొత్త సూత్రానికి తెర లేపాడు.
''శివునికి ధనవంతులు కడతారు గుడి / నాలాంటి సామాన్యుడేం చేయగలడు? / నాకాళ్లే కోవెల స్తంభాలు / శరీరమే ఆలయ రూపము / శిరస్సే బంగరు గోపురము / ఓ॥ కుదల సంగమ దేవరా! / నిశ్చల భౌతిక నిర్మాణాలు కూలిపోవుగాక / కదిలే మేనులోనే కలకాలముండేవు''
ఇలా బసవన్న వందలాది వచనాల ద్వారా తన విప్లవాత్మక సంస్కరణల సిద్ధాంతాన్ని ప్రజల ముందుంచాడు. ఇప్పటికీ కన్నడనాట ఉన్న బసవ ప్రార్థనా స్థలాల్లో వీటి లయ బద్ధ ఆలాపన వినవస్తోంది.

మన దైవప్రీతి కూడా..ఇలా మనిషిలోని దుర్గుణాలను కూడా దూరముంచేందుకు బసవన్న కృషి చేశాడు. అనుభవ మండపలో సామాజిక అంశాలు చర్చించేందుకు అన్ని దిగువ కులాల వారికి స్థానం కల్పించాడు. వారిలో అక్క మహాదేవి, అల్లమ ప్రభతోపాటు చాకలి అయిన మడివాల మచ్చయ్య, మంగలివాడైన హడపద అప్పన్న, దళితుడైన మాదర చెన్నయ్య, మోచీ అయిన సమగర హరాలయ్య, చేనేత వాడు నూలియ చందయ్య, బెస్తవాడైన అంబిగారి చౌడయ్య, హోలిగ కులస్థుడైన దాహర కక్కయ్యలను ప్రతినిధులుగా ముందుంచాడు. ఆయన ఆలోచనా విధానానికి చేరువైన వారు శరణులుగా పిలువబడేవారు. వారంతా శరణు జాతీయులే. వారంతా తమ జన్మతః వచ్చిన కులాన్ని వదిలి కలిసి బతికేవారు. దీనివల్ల బసవన్నకు గత కులాలను త్రోసిపుచ్చి శరణుల మధ్య వివాహాలు జరిపించే అవకాశం దొరికింది.

మాదిగ కులానికి చెందిన సమశర హరాలయ్య కొడుకు శీలవంతు వివాహం బ్రాహ్మణుడైన మధువరసు కూతురు కళావతితో జరిపించాడు. ఈ రెండు కుటుంబాలు శరణులో భాగమే. ఇలా అన్ని కులాల వారితో బసవుని ఇల్లు 'మహామనె' పేరుతో పిలువబడేది. అక్కడ ఉచిత భోజన, వసతి సౌకర్యం లభించేది. బసవుని భార్య పిల్లలు మహామనె నిర్వహణలో నిమగ్నమయ్యేవారు. ఇలా జనులందరికీ మహామానెలో భోజనము, అనుభవ మండపలో జ్ఞానము నిరంతరంగా లభించేవి. కళ్యాణలోని ఈ కార్యక్రమాలు నాలుగు దిశలా వ్యాపించి బసవేశ్వరుడు పేరు మారుమ్రోగింది.

బసవుని ఖ్యాతిపట్ల ఈర్ష్యతో ఉన్న బిజ్జాల రాజుకు సంస్కరణ వ్యతిరేకుల మాట తోడు కావడంతో బసవుడిపై నిధుల దుర్వినియోగం అభియోగం మోపబడింది. దీంతో మనస్తాపం చెందిన బసవేశ్వరుడు తిరిగి తన జ్ఞాన క్షేత్రమైన కుదల సంగమకు చేరుకొన్నాడు. ధ్యాన ముద్రలో కూచొని తన 62వ యేట బసవుడు తుది శ్వాస విడిచాడు. ఇలా ఆనాటి పడికట్టు సాంప్రదాయక వ్యవస్థను , దానిలోని లొసుగులను సాహసంగా బయటపెట్టి కొత్త వ్యవస్థకు పునాది వేశాడు బసవన్న. ప్రధానంగా ఆర్య సంస్కృతిలోని వర్ణ వ్యవస్థను కూలదోసి సకల మానవ సమానత్వాన్ని మాటలతోనే కాక చేతలతోనూ చేసి చూపాడు. అణగారిన వర్గాల అభ్యున్నతికి, మహిళల సమాన హోదాకు, అంటరానితనం నిర్మూలనకు ఆయన తాత్వికత, కార్యాచరణ గట్టి మేలు చేసింది.

బ్రాహ్మణాధిక్య రాచరిక వ్యవస్థ ఆయన శిష్యులను ఏనుగులతో తొక్కించి చంపేసినా, బసవని వచనాలు ధ్వంసం చేసినా ఆయన మార్గాన్ని మాత్రం మూసివేయలేకపోయింది. బసవడే గురువుగా శరణు కుటుంబాలు వీర శైవులుగా, ఇష్టలింగాన్ని మెడలో ధరించి లింగాయత్‌లుగా స్థిరపడ్డాయి. ఎనిమిది వందల ఏళ్ల క్రితం బసవేశ్వరుడు బోధించి, పాటించిన వాటిలో కొన్నింటినే సొంతం చేసుకోగలిగాను మరిన్ని నా బాటలోకి తేవడానికి ప్రయత్నిస్తున్నాను. ఆయన దేశానికే కాదు, ప్రపంచానికీ ఆదర్శనీయడు అని, ఎం.కె. గాంధీ అభిప్రాయపడ్డాడు. హిందూ ధర్మ సాంప్రదాయాలకు, వేదాలలో ప్రవచించిన కుల వ్యవస్థకు వ్యతిరేకులైన లింగాయతులు తాము హిందువులము కామని విడి మతంగా తమకు గుర్తింపు కావాలని శతాబ్దాలుగా పోరుతున్నారు. శైవం హిందూత్వంలోని శాఖయేనంటూ వారి ఆకాంక్షను తొక్కిపెడుతున్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ మధ్య కర్నాటక కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో లింగాయత్‌లకు సొంత మత హోదా కల్పిస్తూ, వారిని మైనారిటీలుగా గుర్తించాలని బిల్లు ప్రవేశపెట్టి, కేంద్రం ఆమోదం కొరకు పంపించింది. సుమారు 6 కోట్లున్న కర్నాటక జన సంఖ్యలో 10 శాతం లింగాయత్‌లున్నారు. మొత్తం 225 అసెంబ్లీ స్థానాల్లో రమారమి 100 స్థానాల్లో వీరు ఎన్నికల్ని ప్రభావితం చేయగలరని పార్టీల అంచనా.



బి. నర్సన్
9440128169

కవిగాయక విద్వత్సభల గద్వాల సంస్థానం

హైదరాబాద్ రాజ్యంలో అనేక సంస్థానాలున్నాయి. ఇందులో 14 సంస్థానాలు తెలంగాణలో ఉన్నాయి. కొన్ని సంస్థానాలు కాకతీయులకాలంలో, కొన్ని కుతుబ్‌షాహీలకాంలో మరికొన్ని ఆసఫ్ జాహీలకాలంలో ఆవిర్భవించాయి. 14వ శతాబ్ది ఆరంభంలోనే తెలంగాణలో సాంస్థానాలు నెలకొన్నాయి. తెలంగాణ సంస్థానాల చరిత్ర 14, 15 నుండి 18వ శతాబ్ది వరకు కొన్ని సంస్థానాలు పాలన సాగించగా మరికొన్ని 1948 సెప్టెంబర్ 17 వరకు పాలన సాగించాయి. గద్వాల సంస్థానం మహబూబ్‌నగర్ జిల్లాలో ఉంది. గద్వాల సంస్థాన మూల పురుషుడైన బుడ్డారెడ్డి కాకతీయ ప్రతాపరుద్రుని కాలంలో (1290) రాయచూరు, అలంపుర, వెజ మొదలగు ఏడు సీమలపై నాడగౌడరికం పొందాడు. అప్పటి నుండి అతని సంతతివారు 'వెజనాడగౌడు' లని ప్రసిద్ధిగాంచారు. 17వ శతాబ్ది ప్రారంభంలో పెద్దనృపతి అనే అతడు వెజ, కందనూలు (కర్నూలు) సీమలకు నాడగౌడుగా ఉన్నారు. పూడూరు సీమ నాడగౌడు అయిన వీరారెడ్డి కుమార్తె బక్కాంబికను పెండ్లి చేసుకొని ఆ సీమకు కూడా అధిపతి అయ్యాడు. తర్వాత అతని కొడుకు పెదసోమభూపాలుడు (1663–1712) నాడగౌడరికానికి వచ్చాడు. ఇతడే శోభనాద్రి అలియాస్ సోమనాద్రి. ఇతను గద్వాల కోట నిర్మాత. ఔరంగాజేబు చేత 'రాజా' అనే బిరుదు పొందాడు. సోమనాద్రి రాజధానిని రాజోలు నుండి గద్వాలుకు మార్చాడు. పెద్దన వీరారెడ్డి ఈ సంస్థాన స్థాపకులు ఇంటిపేరు ముష్టిపల్లి, పాకనాటి శాఖకు చెందినవారు. గద్వాల పాలకులలో శ్రీరామ భూపాలుడు (1894–1901) ముఖ్యులు. వీరి తర్వాత సీతారామ భూపాలుడు (1912–48) తన చతురత, తెలివి తేటలతో గద్వాలకు పూర్వ వైభవాన్ని తెచ్చింది. చివరగా ఆదిలక్ష్మీ దేవమ్మ దత్తపుత్రుడు, దౌహిత్రుడైన కృష్ణ భూపాల రాజు గద్వాలను ఇండియన్ యూనియన్‌లో విలీనం చేశాడు.

సాహిత్య పోషణ : గద్వాల సంస్థానంలో కార్తీక, మాఘ మాసాలలో కవిపండితుల్ని సన్మానించేవారు. సంస్థానాధీశుడైన పెద సోమ భూపాలుడు స్వయంగా కవి. ఇతనిని జానపదకవలులు నల్ల సోమనాద్రిగా పిలుచుకోవడమే కాకుండా ఇతని పేరుతో వీరగాధను రూపొందించుకున్నారు. పెద సోమ భూపాలుడు జయదేవుని గీతాగోవిందాన్ని ఆంధ్రీకరించాడు. దీనిలోని ఒక శ్లోకం. గద్వాల సోమన భూపాల మణి ప్రణీతం / పద్మావతీంద్ర జయదేవ కవీంద్రగీతం / రాధామది ప్రథిత మాధవ సూక్తిజాతం / మాదుర్య చాటు ఫణితం జయతు ప్రభాతమ్

వినుకొండ సంస్థానవాసియైన కొడికెలపూడి వీర రాఘవ కవి గద్వాల సంస్థానాన్ని సందర్శించాడు. ఈయన పెద సోమభూపాలుని కోరిక ప్రకారం మహాభారతం భీష్మపర్వంలో తిక్కన వదిలిపెట్టిన భాగాల్ని అనువదించాడు ఈ సంస్థానంలో ఆశ్రయం పొంది భారతంలోని ఉద్యోగపర్వాన్ని ఎనమిది ఆశ్వాసాల ప్రంథంగా రచించి పూడూరు కేశవస్వామికి అంకితమిచ్చాడు. కవిత్రయం తర్వాత భారతాన్ని అనువదించే ప్రయత్నం చేసిన కవుల్లో ఈకవి మూడవవాడని తెలుస్తున్నది. వీర రాఘవ కవి వ్యాఖ్యాన పూర్వకంగా ఆంధ్రీకరించిన ఈ గ్రంథాన్ని శోభనాద్రి అనంతరం రెండువందల సంవత్సరాలకు 1899లో గద్వాల ప్రెస్‌లో ముద్రించారు. గద్వాల సంస్థాన కవి కాణాదము పెద్దన ఆధ్యాత్మరామాయణము, ముకుంద విలాసము, మత్స్యపురాణము, శేషశైలేశలీల, యథాశ్లోక తాత్పర్య రామాయణము (బాలకాండ మాత్రము), రామాయణ చంపు మొదలగు కావ్యాలు రచించెను. సోమనాద్రి మనుమడైన చినసోమభూపాలుడు రతి రహస్యమును రచించారు. బోరవెల్లి శేషాచార్యులు యథాశ్లోక తాత్పర్య రామాయణము (యుద్ధాకాండం నాలుగు ఆశ్వాసములు) రచించి, గద్వాల చెన్న కేవశ స్వామికి అంకితం ఇచ్చారు. అయలూరు కందాళయార్యుడు రాసిన అలంకార శిరోభూషణమనే సంస్కృత అలంకార శాస్త్ర గ్రంథాన్ని ప్రసిద్ధ లక్షణ గ్రంథంగా పేర్కొనవచ్చు. లయగ్రాహిగరుడాచలకవి కౌలలేయ చరిత్రం రాసాడు. ఈ కవిని గూర్చి మొదట పేర్కొన్నవారు ఆచార్య బి. రామరాజు గారు గద్వాల నివాసియైన ధర్మవరం రామకవి (1780) సోమ భూపాలుని ఆనతితో 'ముకుంద విలాసం' రచించాడు. ఇదే కాలానికి చెందిన వాడాల శేషాచార్యులు మైథిలీ పరిణయం అనే వచనకావ్యం రచించారు.



చిన సోమ భూపాలుని ఆస్థాన కవులు ఆయన కోరిక మేరకు యథాశ్లోక తాత్పర్య రామాయణంలోని వివిధ కాండలను రచించారు. అలాంటి వారిలో తిరుమల కృష్ణమాచార్యుడు సుందరకాండను 3 ఆశ్వాసాలతో రచించారు. చతుర్విధ కవితా నిర్వాహకులైన కామసముద్రం అప్పలాచార్యులు కిష్కింధకాండను 3 ఆశ్వాసాలుగా రచించడమే కాకుండా ఈ రామాయణానికి అవతారికను రచించాడు. అంతే కాకుండా రాజు కోరిక మేరకు జయదేవుని గీతా గోవిందాన్ని శ్రీకృష్ణలీలా తరంగాణి పేరుతో అనువదించాడు. కొత్తపల్లి రామాచార్యులు అయోధ్యకాండను 5 ఆశ్వాసాలలో రచించాడు. హోసదుర్గం వేదాంతాచార్యులు శ్రీకృష్ణ బ్రహ్మతంత్రార్యవేద పాదస్తవమ్, ఆచార్యవైభవమ్ మొదలగు సంస్కృత కృతులు రచించాడు.

ఈ విధంగా పెదసోమభూపాల, చినసోమభూపాలుర పాలనాకాలంలో స్థానికులు, స్థానికేతరులెందరో ప్రభువుల ఆదరాభిమానాలతో పలు గ్రంథాల్ని రచించి, సంస్థానాధీశుల భక్తి విశేషాలను, సాహిత్య సేవా విశేషాలను ప్రకటించారు.

గద్వాల రాజులలో సుదీర్ఘకాలం (1845–1901) పాలించినవాడు ముష్టిపల్లి రామభూపాలుడు, బ్రిటిష్ వారితో సంబంధాలు ఏర్పడటం, సిపాయిల తిరుగుబాటు జరగడం ఇతని కాలంలోని రెండు విశేషాంశాలుగా చెప్పవచ్చు. ఈయన ఛందోముకురమనే సంస్కృత గ్రంథాన్ని రచించి, 'సాహిత్య విద్యాముకురమ' నే స్వంత ముద్రాక్షరశాలలో 1878లో ముద్రించెను. ఇతడు 1845లో శ్రీ లక్ష్మీ సహస్ర నామస్తోత్రమును కూడా ఇదే ముద్రణశాలలో ముద్రించారు. ఆ కాలంలో ప్రధానమైన విద్యల్ని సంస్కృతాంధ్రాలలో మాత్రమే బోధిస్తూ రాజవ్యవహార నిర్వహణమునకు మాత్రం ఫార్సీ, ఉర్దూ వంటి భాషల్ని నేర్పడం వల్ల రాజులు కూడా కవులు, గ్రంథకర్తలై కవిపండిత పోషణ చేసారు.రామభూపాలుని పాలనాకాలంలోనే తిరుపతి వేంకటేశ్వరకవులు మొదటిసారిగా గద్వాలకు వచ్చి తమ ఆశుకవితా శతావధానముల చేత విద్యద్గద్వాలను రంజింపజేసినారు. తిరుపతి వేంకటేశ్వరకవులను సభాసదులలో కొందరు బ్రాహ్మణులైన మీకు మీసములేల అని యడుగగా

దోసమటంచెటింగియును దుందుడు కొప్పగా బెంచినార మీ / మీసము, రెండు బాసలకు మేమె కవీంద్రులమంచు తెల్పగా, / రోసము గల్గినన్ కవివరుల్ మముగెల్వుడు, గెల్తురేని, యీ / మీసము దీసి మీ పద సమీపములన్ దలలుంచి మ్రొక్కమే? / అని పద్యము చెప్పి సవాలు చేసినారట. అప్పుడు సభాముఖమున వీరిని ఎదుర్కొన్నవారిలో శ్రీపురాణం దీక్షాచార్యులు వారు ముఖ్యులు. తిరుపతి వేంకటకవులు మూడు నాలుగు మార్లు గద్వాల సంస్థానానికి విచ్చేసి రామభూపాలుడు, సీతారామభూపాలురు చేసిన విశేషమైన గౌరవ సత్కారాలకు ఆనందభరితులై ఈ సంస్థానపు కీర్తిని 'అటు గద్వాలిట చెన్నపట్టణ'మంటూ పలు పద్యరాజములతో గద్వాల వైభవాన్ని దిగంతాలకు వ్యాపింపజేసారు. రామభూపాలుని గురువైన పురాణం దీక్షాచార్యులు రామ చంపువు, రామన్నపకర్ణామృతం, కేవశసుప్రభాతం, కావ్యోత్కర్ష మొదలగు రచనలు చేసారు. రామభూపాలుని ఆస్థానకవియైన బైరంపల్లి తిరుమల రాయకవి యథాశ్లోక తాత్పర్య రామాయణం ప్రథమభాగాన్ని 1896లో పరిష్కరించారు. ఇతని ఆస్థానంలోని చెల్లూరి నారాయణాచార్యులు 'ప్రతాపరుద్రీయసారమ'నే లక్షణ గ్రంథాన్ని రాసాడు. పురాణం నర్సింహాచార్యులు జానకీ పరిణయం, శ్రీరామభూపచరిత్రమనే రచనలు చేసాడు. హయ గ్రీవాచార్యులు 'శబ్దేందు' శేఖరమునకు 'చంద్రిక' అనే పేరుతో వ్యాఖ్య రచించాడు. దీనికే హయగ్రీవీయమ్ అని పేరు, గద్వాల సంస్థానంలో శ్రీరామ భూపాలుని కాలంలో నిర్వహించిన కార్తీకోత్సవాల వైభవాన్ని వర్ణిస్తూ కృష్ణాచార్యుడనే కవి 'కార్తీకోత్సవదీపిక' అనే చంపూ ప్రబంధాన్ని రచించాడు. దీనిని గద్వాల ముద్రాక్షరశాలలో 1875లో ముద్రించారు. ఇతని ఆస్థానంలోని యజ్ఞ దీక్షితులనే కవి బ్రహ్మవిద్యాప్రదీప:, లక్షణాదర్శ: అనే వేదాంత గ్రంథాలు రచించగా వీటిని రామభూపాలుడు 1884 లో ముద్రింపజేసాడు. ఎల్లూరు లక్ష్మీ నర్సయ్య నృసింహవిలాసమనే గ్రంథాన్ని రాసాడు. ప్రెగడరాజు గుండన్న రుక్మిణీ విలాసం స్వయంవరమనే యక్షగానం రచించి గద్వాల రాజుకు అంకితమిచ్చాడు. వలుకూరు వెంకటయ్య అనే కవి 'పరమబోధసుధానిధి' అనే సీస పద్య శతకాన్ని రచించాడు. ఈ విధంగా పూర్వులకాలం నుండి జరుగుతున్న కవిగాయక విద్వత్సభలు వీరి కాలమున మరింత శోభాయమానమైనవి గద్వాల సంస్థానంలో ప్రతి సంవ్సరం కార్తీక పూర్ణిమకు వేదశా పండిత విద్వత్సభలు, మాఘపూర్ణిమకు కవిగాయక సభలు జరిగేవి. ఈ సభలు పండిత పామర జన రంజకముగా శోభిల్లేవి. ఈ సభలలో పాల్గొనడానికి మహాపండితులకే కాకుండా వర్థమానకవులకు కూడా స్థానందక్కేది.

అంతేకాకుండా వారి వారి అర్హతలకు తగిన విధంగా సన్మాన సత్కారాలు జరిగేవి. గద్వాల సంస్థానానికే పరిమితమైన మరోవిశేషమేమిటంటే ఈ సభలకు వచ్చిన పండిత మండలిని సత్కరించి మహాద్వారము గుండా పంపునపుడు వారి పాదముద్రలు పడునట్లు తెల్లని వస్త్రములు పరిచియుంచి దానిపైబడిన ఆవిద్వత్పాదధూళిని ఒక చోట చేర్చి బాగు చేసి కుంకుమ బరిణెలాంటి వాటిలో భద్రపరచియుంచి ఏడాది పొడుగునా రాజకుటుంబీకులు స్నానం చేసిన పిదప దానిని నుదుట ధరించేవారట. ఇట్టి భక్తి, సరస్వతీ సమారాధన గద్వాలలో తప్ప మరెక్కడా కన్పించదు. ఇది గద్వాల సంస్థాన కార్తీక మహాసభల వైభవము.

ఈ విధంగా గద్వాల సంస్థానం సాహితీ సౌరభంతో విరాజిల్లింది. ఈ సంస్థానాధీశులకాలంలో తెలుగు సాహిత్యం పలు ప్రక్రియలుగా పరిఢవిల్లింది. ఈ సంస్థానాధీశుల పాలనాదక్షత, సాహితీసేవ మార్గదర్శకమై అజరామరమై వెలుగొందుతుంది.



డా॥ నమిలకొండ సునీత
8309430548

రాజకీయ పార్టీలను దగ్గరికి రానివ్వను : హజారే



న్యూఢిల్లీ : లోక్‌పాల్ కోసం తాను చేస్తున్న ఉద్యమంతో రాజకీయ పార్టీల సంబంధాలపై అవినీతి వ్యతిరేక ఉద్యమకారుడు అన్నా హజారే స్పష్టమైన ప్రకటన చేశారు. రాజకీయ పార్టీలను కానీ, గ్రూపులను కానీ తన దరి చేరనీయనని తెలిపారు. కేంద్రంలో లోక్‌పాల్, రాష్ట్రాల్లో లోకాయుక్త తీసుకురావాలన్న డిమాండ్‌పై శుక్రవారం నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన అన్నాహజారే శనివారం మీడియాతో మాట్లాడారు. తనతో ఈ ఉద్యమంలో చేరాలనుకునే వారు తమకు ఎలాంటి రాజకీయ పార్టీతో కానీ, గ్రూపుతో కానీ సంబంధం లేదని, ఎన్నికల్లో పోటీ చేయనని అఫిడవిట్‌పై సంతకం చేసి ఇవ్వాలని అన్నారు. ఈ ఉద్యమంలో పాల్గొనేందుకు ముందుకు వచ్చే వారు ఏ రాష్ట్రానికి చెందినవారో తెలియజేయాలని సూచించారు. 'ఏ రాజకీయ పార్టీలోనూ, గ్రూపులోనూ చేరకూడదు. ఎన్నికల్లో పోటీ చేయకూడదు. సత్ప్రవర్తన కలిగి ఉండాలి. ఈ మేరకు అఫిడవిట్‌పై సంతకం చేయాలి. ఏ రాజకీయ పార్టీని కానీ, గ్రూపును కానీ వేదిక పైకి రానిచ్చేది లేదు' అని హజారే స్పష్టం చేశారు.

1 నుంచి కాంగ్రెస్ బస్సు యాత్ర

మన తెలంగాణ/ హైదరాబాద్: వచ్చే నెల ఒకటవ తేదీ నుండి పది రోజుల పాటు మరో విడత ప్రజా చైతన్య బస్సు యాత్రను కాంగ్రెస్ ప్రారంభించనుంది. ఈ యాత్ర ఏప్రిల్ 1న ఉదయం ఆరు గంటలకు రామగుండం నుండి మొదలవుతుంది. ఏప్రిల్2న పెద్దపల్లి, 3న మంథని, భూపాలపల్లి, 4న ములుగు, పరకాల, 5న వరంగల్ తూర్పు, వరంగల్ పడమర, 6న వర్ధన్నపేట, నర్సంపేట, 7న స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి, 8న డోర్నకల్, మహబూబాబాద్, 9న ఇల్లెందు, పినపాక, 10న భద్రాచలం, వెంకటాపురంలో సభలు నిర్వహిస్తారు. ఈ మేరకు టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటన విడుదల చేశారు.

మంత్రి కెటిఆర్‌కు రేవంత్ లేఖ

మన తెలంగాణ/ హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతి ఇసుక రీచ్‌వద్ద నిరంతరం పనిచేసే సిపి కెమెరా వ్యవస్థను ఏర్పాటు చేయాలని గనుల శాఖ మంత్రి కెటిఆర్‌కు ఎఐసిసి సభ్యులు ఎ.రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు.పంచాయితీలకు తమ పరిధిలో ఉండే ఇసుక రీచ్‌లను తనిఖీ చేసే అధికారం ఇవ్వాలని, ఐటిడిఎల పరిధిలోని ఇసుక రీచ్‌ల కేటాయింపులో రైజింగ్ కాంట్రాక్టర్ విధానాన్ని రద్దు చేసి వాటిని పూర్తిగా అడవిబిడ్డలకే కేటాయించాలని కోరారు.ఇసుక రీచ్‌లు ఉన్న ప్రతిమార్గంలో చెక్‌పోస్టలను ఏర్పాటు చేయాలని, రెవెన్యూ, పోలీసు, మైనింగ్,అటవీ,రవాణా అధికారులతో పాటుగా సంబంధిత పంచాయితీల సర్పంచ్‌లను తనిఖీల కోసం చెక్‌పోస్టలలో నియమించాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులపై పిడి యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని, పట్టుబడిన వాహనాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, ఇసుక లారీల కారణంగా ఇప్పటిదాకా మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారాన్ని ప్రభుత్వమే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

పేదలను వెళ్ళగొట్టొద్దు

హైటెక్ సిటీ పత్రికానగర్‌లో గుడిసెలు కాలిపోయి రోడ్డునపడ్డ పేదలకు పక్కా గృహాలను కట్టించి ఇవ్వకుండా, వారు ఉంటున్న స్థలం నుండి వెళ్ళగొట్టాలని ప్రయత్నిస్తే ఊరుకోబోమని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయనను శనివారం కలిసిన గుడిసెవాసులకు వారికి అండగా ఉంటామని చెప్పారు.

మంత్రి దృష్టికి జర్నలిస్టుల సమస్యలు

మన తెలంగాణ / హైదరాబాద్: రాష్ట్రంలో అక్రిడిటేషన్లు లేని జర్నలిస్టులకు హెల్త్‌కార్డులను మంజూరు చేయడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ ప్రతినిధులు మంత్రి కెటిఆర్‌కు ఫిర్యాదు చేశారు. అసెంబ్లీ ప్రాంగణంలో యూనియన్ ప్రతినిధులు క్రాంతి కుమార్, పల్లె రవికుమార్‌గౌడ్‌లు మంత్రి కెటిఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇందులో ప్రధానంగా అక్రిడియేషన్ లేని జర్నలిస్టులకుహెల్త్ కార్డులు ఇవ్వాలనే జీవో అమలు కావడం లేదన్నారు. జీవోను అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని తెలిపారు. దీనికి స్పందించిన మంత్రి జీవో అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనర్‌ను ఆదేశించారు. వెల్‌నెస్ సెంటర్లలో మందుల కొరతతో పాటు కొన్ని ఆసుపత్రులలో కార్డులు పనిచేయకున్నా అధికారులు జాప్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. దీనిపై చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామినిచ్చారు. ఇహెచ్ఎస్, జెహెచ్ఎస్ స్కీంపై వస్తున్న కథనాలపై కూడా మంత్రితో చర్చించారు. దీనిపై ఆరోగ్య మంత్రితో చర్చించి అందరికీ ఆమోద్యయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రముఖ ఛానల్‌లో సీనియర్ సబ్ ఎడిటర్ భార్య అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం రూ.12 లక్షల ఎల్‌ఓసిని అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

గుజరాత్‌లో పడవ మునక

ఒకరు మృతి, సురక్షితంగా బయపడిన 12 మంది ప్రయాణికులు

ఖేడ : గుజరాత్‌లో శనివారం ఓ పడవ మునిగిపోయింది. ఖేడ జిల్లా డాకోర్ సమీపంలో ఉన్న మహిసాగర్‌లో జరిగిన ఈ ఘటనలో 16 ఏళ్ల యువకుడు మునిగిపోగా, మరో 12 మంది ఈదుకుంటూ సురక్షితంగా బయటపడినట్లు పోలీసులు పేర్కొన్నారు. 13 మంది ప్రయాణికులతో పడవ తస్రా తాలూకాలోని కొంట్లిన్‌దొర నుంచి మహిసాగర్ అవతలివైపు ఉన్న యాత్రా స్థలం పవగాధ్‌కు వెళ్తుండగా మునిగిపోయినట్లు డాకార్ పోలీస్ స్టేషన్ అధికారి చెప్పారు. పడవ పవగాధ్‌కు చేరుకునేందుకు తక్కువ నిడివిగల ఖేడ మార్గం ద్వారా నుంచి ప్రయాణిస్తుందని ఆయన చెప్పారు. ఈ ప్రమాదంలో 16 ఏళ్ల హార్దిక్ చవ్డా మునిగిపోయాడరన్నారు. ఈదుకుంటూ బయటపడిన 12 మందిలో ఇద్దరుకు గాయాలు కాగా, వారిని డాకార్ ఆసుపత్రిలో చేర్చినట్లు ఆయన వెల్లడించారు.

కంటైనర్‌లో మంటలు, కార్లు దగ్ధం



మన తెలంగాణ /హైదరాబాద్ సిటీ బ్యూరో : బోయిన్‌పల్లి సమీపంలోని మిలిటరీ డైరీ పామ్ రోడ్డు వద్ద ఆగిఉన్న ఓ కంటైనర్‌లో శనివారం రాత్రి ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మహారాష్ట్రకు చెందిన ఈ కంటైనర్‌ను బోయిన్‌పల్లి సమీపంలో ఆపి బయటికి వెళ్లారు ఇంతలోనే కంటైనర్ ముం దు భాగంలోని ఇంజన్ నుంచి ఒక్కసారిగా చెలరెగిన మంటలు క్షణాల్లో పూర్తి కంటైనర్ వ్యాపించాయి. దీంతో కంటైనర్ లోపల ఉన్న కార్లు అగ్నికి ఆహుతి అయ్యారు. దీంతో స్థానికులు పోలీసులతో పాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసు కురా వడానికి చాలసేపు శ్రమించాల్సి వచ్చింది. అక్కడ దారిదాపుల్లో ఎవరు లేకుండా పోలీసలు రక్షణ చర్యలు చేపట్టారు. దీంతో ఆరోడ్డు గుండా ప్రయాణించే వాహనాలతో రోడ్డు మీదగా జామ్ అయిపోయింది. గంటల తరబడి శ్రమించిన ఫైర్ సిబ్బంది చివరికి మంటలను అదుపు చేశారు.

పాలస్తీనీయులకు సంఘీభావ సభ

మన తెలంగాణ/హైదరాబాద్: స్వేచ్ఛ, సమానత్వం, శాంతి, సార్వభౌమాధికారం కోసం పాలస్తీన ప్రజలు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా ఈ నెల 27న హైదరాబాద్, హిమాయత్‌నగర్‌లోని మఖ్దుం భవన్‌లో 'పాలస్తీన ప్రజల పోరాటానికి సంఘీభావ సభ'ను నిర్వహించనున్నట్లు ఎఐకెఎంఎస్ జాతీయ అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి పశ్యపద్మ, ఎఐకెఎస్ రాష్ట్ర కార్యదర్శి సాగర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జరగనున్న ఈ సభలో పాలస్తీనియన్ల బాయ్‌కాట్, డివెస్టిమెంటు, శాంక్షన్స్ నేషనల్ కమిటీ కో– ఆర్డినేటర్ మహమూద్ నవాజా, సెక్రటేరియట్ సభ్యులు మారెన్ మన్టోవనితో పాటు రైతు, రైతు కూలీ సంఘాల నాయకులు, మేథావులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొంటారని చెప్పారు.

28న సర్టిఫికెట్ వెరిఫికేషన్

మనతెలంగాణ/హైదరాబాద్ : ఎక్సైజ్ కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈ నెల 28న సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు టిఎస్‌పిఎస్‌సి ఒక ప్రకటనలో తెలిపింది. ఇతర వివరాలకు వెబ్‌సైట్ చూడాలని పేర్కొంది. మరోవైపు ఏప్రిల్ 10 నుంచి 24 వరకు ఎల్‌పిసెట్‌కు ఎల్‌పిసెట్‌కు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎల్‌పిసెట్ కన్వీనర్ సిహెచ్ రమణకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 7 తర్వాత వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపరుస్తామని పేర్కొన్నారు.

మారనున్న వర్సిటీల భౌగోళిక పరిధులు



మనతెలంగాణ/హైదరాబాద్ : యూనివర్సిటీల భౌగోళిక పరిధుల్లో మార్పులు చోటు చేసుకోనున్నాయి. రాష్ట్రంలో జిల్లాల పునర్వ్యభజన జరిగి ఏడాదిన్నర గడుస్తున్నా ఇప్పటికీ పాత జిల్లాల ప్రాతిపదికనే వర్సిటీ పరిధులు కొనసాగుతుండడంతో కొత్త జిల్లాలకు అనుగుణంగా వర్సిటీల పరిధిల్లో మార్పులు తీసుకువచ్చేందుకు వైస్ ఛాన్సలర్లు కసరత్తు చేస్తున్నారు. ఇటీవల వైస్ ఛాన్సలర్లతో ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి నిర్వహించిన సమీక్షా సమావేశంలో వర్సిటీల హద్దులు మార్చాల్సిన అవసరంపై చర్చ జరిగింది. కొత్త జిల్లాలకు అనుగుణంగా పరిధుల్లో మార్పులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి కడియం శ్రీహరి విసిలను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాల భౌగోళిక పరిస్థితులు, స్థానికుల డిమాండ్ల మేరకు విశ్వవిద్యాలయాల పరి

కొత్త జిల్లాలకు అనుగుణంగా మార్పులు

ధుల్లో మార్పులు చోటు చేసుకోనున్నాయి. కొన్ని జిల్లాల ప్రజలకు 20–30 కిలోమీటర్ల దూరంలో యూనివర్సిటీ అందుబాటులో ఉన్నా, ఆ ప్రాంతం మాత్రం 70–100 కిలోమీటర్ల దూరంలో ఉన్న వర్సిటీ పరిధిలో ఉంది. సమీపంలో యూనివర్సిటీ ఉన్నా అక్కడి ప్రజలకు, కళాశాలలకు ఉపయోగపడే పరిస్థితి లేకపోవడంతో స్థానిక ప్రజల డిమాండ్ల మేరకు మార్పులు చేర్పులు చేపట్టాలని భావిస్తున్నారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలోకి హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలు వచ్చే అవకాశం ఉంది. అలాగే కాకతీయ వర్సిటీ పరిధిలోకి వరంగల్ రూరల్, అర్బన్ జిల్లాలతోపాటు జయశంకర్ భూపాలపల్లి, జనగాం, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలు రానున్నాయి. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోకి నిజామాబాద్, కామారెడ్డి, అదిలాబాద్, నిర్మల్ జిల్లాలు, శాతవాహన వర్సిటీ పరిధిలోకి కరీంనగర్, పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల, జిగిత్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలు రానున్నాయి. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పరిధిలోకి నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలు, పాలమూరు వర్సిటీలోకి మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల్ జోగులాంబ జిల్లాలు రానున్నాయి. త్వరలో వర్సిటీ పరిధుల మార్పులకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడనున్నాయి.

ఈ ఏడాది పాత విధానమే

వర్సిటీ పరిధుల్లో మార్పులు చేసేందుకు కొన్ని నెలల సమయం పట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వచ్చే విద్యాసంవత్సరంలో ప్రస్తుత విధానం ప్రకారమే యుజి, పిజి కళాశాలలకు అఫిలియేషన్లు జారీ చేయడంతో పాటు ప్రవేశాలు చేపట్టనున్నారు. ఆ తర్వాత నుంచి మారిన యూనివర్సిటీ పరిధుల ఆధారంగా అఫిలియేషన్ల జారీ, ప్రవేశాలు చేపట్టే అవకాశం ఉంది.

ఆరోగ్యశ్రీలో చేర్చితే ఆందోళనలు

జర్నలిస్టుల హెల్త్ స్కీంపై టియుడబ్ల్యూజె హెచ్చరిక



మన తెలంగాణ / హైదరాబాద్ : జర్నలిస్టులు, విశ్రాంత పాత్రికేయులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఆరోగ్య పథకాన్ని 'ఆరోగ్య శ్రీ'లో చేర్చడం సరి కాదని, ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉప సంహరించుకుని పాత విధానాన్ని యదాతథంగా పునరుద్ధరించాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళన తప్పదని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు), తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ సంఘం (టియుడబ్ల్యూజె)లు హెచ్చరించాయి. బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో టియూడబ్ల్యూజె సలహాదారులు కె. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టల హెల్త్ స్కీమ్ పథకాన్ని ఆరోగ్య శ్రీ పథకంలో చేరుస్తూ మంత్రి వర్గంలో నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వచ్చాయని, ఈ విషయాన్ని టిఆర్ఎస్ ఎంఎల్ఎ శ్రీనివాస్ గౌడ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తే అలాంటి నిర్ణయం ఏమీ తీసుకోలేదని స్పష్టంచేస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం ఒక పత్రికా ప్రకటన విడుదల చేసిందన్నారు. జర్నలిస్టులు, ఉద్యోగుల ఆరోగ్య పథకాల సిఈఓ పద్మను బాధ్యతల నుండి తొలగించడంతో పాటు ఈ పథకాన్ని ఆరోగ్యశ్రీలో చేర్చేందుకు పూనుకోవడం ద్వారా జర్నలిస్టుల ఆరోగ్య పథకం రద్దు అయినట్లు భావించాల్సి వస్తుందన్నారు. జర్నలిస్టులకు ట్రిపుల్ బెడ్ రూం ఇళ్లు, జర్నలిస్ట్ భవన్ నిర్మిస్తామన్న హామీలు అమలుకావడం లేదన్నారు. ఐజెయూ సెక్రటరీ జనరల్ దేవులపల్లి అమర్ మాట్లాడుతూ సిఎం కెసిఆర్ పాత్రికేయుల సంక్షేమానికి అనేక హామీలు ఇచ్చారని, నాలుగేళ్లు కావస్తున్నా అవి ఆచరణకు నోచుకోవడంలేదన్నారు. టియూడబ్ల్యూజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. విరాహత్ అలీ మాట్లాడుతూ పాత్రికేయుల ఆరోగ్య పథకాన్ని ఆరోగ్యశ్రీలో చేర్చడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఈ సమావేశంలో ఐజెయూ జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు కె.సత్యనారాయణలు పాల్గొన్నారు.

అపోహలు వద్దు... ఆరోగ్యశ్రీలో కలపడం లేదు

యధావిధిగానే వెల్‌నెస్ సెంటర్లు: మంత్రి లక్ష్మారెడ్డి



మన తెలంగాణ / హైదరాబాద్ :'వెల్‌నెస్ సెంటర్లు' యధావిధిగా కొనసాగుతాయని, ఉద్యోగులకు, పాత్రికేయులకు ఎలాంటి అపోహలు, ఆందోళన అవసరంలేదని, గతంలో కంటే మరింత మెరుగై న, సమర్థవంతమైన సేవలను అందిస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి తెలిపారు. శాసనసభలో మంత్రి శనివారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ, వెల్‌నెస్ సెంటర్లనుగానీ, ఉద్యోగుల పాత్రికేయుల హెల్త్‌స్కీమ్‌లనుగానీ 'ఆరోగ్య శ్రీ'లో కలపడం లేదని స్పష్టం చేశారు. ఆరోగ్య శ్రీ, వెల్‌నెస్ సెంటర్లు ప్రజారోగ్యంలో రెండు వేర్వేరు సేవా కేంద్రాలని, ఇహెచ్ఎస్, జెహెచ్ఎస్ సేవలకు నిమ్స్ డైరెక్టర్ మనోహర్ కేవలం ఇంఛార్జీ మాత్రమేనన్నారు. త్వరలోనే పూర్తిస్థాయిలో సిఇఒను నియమిస్తామన్నారు. మందుల కొరతను త్వరలోనే తీరుస్తామన్నారు. ఉద్యోగులు, జర్నలిస్టు కుటుంబాలు ఎలాంటి అపొహలకు గురికావద్దన్నారు.

టిజిటి గణితం ఉపాధ్యాయుల ఫలితాలు విడుదల

మనతెలంగాణ/హైదరాబాద్ : గురుకుల విద్యాసంస్థల్లో ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్(టిజిటి)గణితం ఉపాధ్యాయుల ఫలితాలను టిఎస్‌పిఎస్‌సి విడుదల చేసింది. ఈ పోస్టులకు మొత్తం 805 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్లు కమిషన్ కార్యదర్శి ఎ.వాణిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

కాగా, 35 వికలాంగ పోస్టుల ఫలితాలను అభ్యర్థులు వైద్య నివేదికలు అందిన తర్వాత వెల్లడిస్తామని పేర్కొన్నారు. 840 టిజిటి(గణితం) పోస్టులకు 2017, మే 31న ప్రాథమిక పరీక్ష నిర్వహించి, జూలై 20 నుంచి ప్రధాన పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్ చూడాలని పేర్కొన్నారు.

గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు కసరత్తు

రోడ్లు, వంతెనలు, మురుగుకాలువల పనుల ప్రతిపాదనలు

మన తెలంగాణ/హైదరాబాద్ : గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు పంచాయతీరాజ్ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆయా గ్రామ పంచాయతీల నుంచి అవసరమైన పనుల జాబితాను తెప్పించుకుంటున్నారు. పంచాయతీల నుంచి ఆయా జిల్లా పంచాయతి, జిల్లా పరిషత్‌లకు విభాగాల వారీగా ప్రతిపాదనలు అందుతున్నాయి. ఇప్పటి వరకు ఆయా గ్రామాలకు అవసరమైన తారు, మట్టి, సిసి రోడ్లు, కల్వర్టులు,వంతెనలు, మురుగుకాలువలు, కొత్తగా అవసరమైన అంతర్గత మురుగుకాలు వలు, ఉన్న వాటి మరమ్మతులు, రహదారుల మరమ్మతులకు సంబంధించి పనుల జాబితా వచ్చింది. వాటిని అధికారులు పరిశీలిస్తున్నారు. పరిశీలన అనంతరం వాటి కోసం అయ్యే వ్యయ అంచనాలను తయారు చేసి అవసరమైన పనులను మంజూరు చేయనున్నారు. ఇప్పటికీ రాష్ట్రంలోని 8684 గ్రామపంచాయతీల నుంచి మొత్తం 11,14,914 పనుల ప్రతిపాదనలు వచ్చాయి. వీటిలో 6361 కి.మీ. పొడవు మేర 228 కి.మీ. మేర తారు రోడ్లు, 18244 కి.మీ. పొడవుతో 5,63,853 సిసి రోడ్లు, 5949 కి.మీ పొడవు గల 17,048 కంకర రోడ్లు, 5206 కి.మీ పొడవు మేర 15,335 మట్టి రోడ్లు ఉన్నాయి.

19,220 కల్వర్టులు, వంతెనల నిర్మాణాల పను లు ఉన్నాయి. వీటితో పాటు కొత్తగా 33,048 మురుగుకాలువలు, 49,470 అంతర్గత మురుగుకాలువల ప నులతో పాటు ఇప్పటికే ఉన్నవాటిలో 1,76,494 మురుగుకాలువల మరమ్మతు పనుల ప్రతిపాదనలు వచ్చాయి. ఇప్పటికే 11,551 గ్రామీణ రహదారులకు 41,13,769 మీటర్ల మేర మరమ్మతులు చేయాల్సి ఉన్నాయి.

చంద్రబాబుది రాజకీయ యావే

(మొదటిపేజీ తరువాయి)

మోసం చేసిందనే చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలను అమిత్ షా తిప్పికొట్టారు. చంద్రబాబుకు అమిత్ షా తొమ్మిది పేజీల సుదీర్ఘ లేఖ రాశారు. కేంద్రం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపట్టిందని, ఎపి పునర్వ్యస్థీకరణ చట్టం పరిధిలో చేసిన వాగ్దానాలను నిలబెట్టుకుందని అమిత్ షా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పట్ల కేంద్రానికి చిత్తశుద్ధి లేదనే మాట కట్టుకథ అని అమిత్ షా విమర్శించారు. ఎపిలో కేంద్రం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల వివరాలను షా ఈ లేఖలో పొందుపర్చారు. అసలు ఆంధ్రప్రదేశ్ సమగ్ర ప్రగతి దిశలో చంద్రబాబు నాయుడుకు సరైన ఆసక్తి ఉందా? అనే ప్రశ్న వస్తోందని , వారు కావాల్సిన నిధుల వివరాలు తెలియచేయలేదని, నిధుల వాడకం వివరాలను కోరితే ఇవ్వలేదని ఆరోపించారు. కేంద్రం కోరినప్పుడు నిధుల వాడకం వివరాలు ఇవ్వాల్సిన బాధ్యత సదరు ప్రభుత్వానికి లేదా? అని ప్రశ్నించారు. వ్యయ వివరాలపై సరైన ప్రకటన వెలువరించకపోవడం ఎంతవరకు సబబు అని నిలదీశారు. కేంద్రం కోరినప్పటికీ జవాబు ఇవ్వకపోవడం కేవలం ఆ ప్రభుత్వ దాటవేత, లోపభూయిష్ట పాలనకు తార్కాణం అని విమర్శించారు. అభివృద్ధి గురించి పట్టించుకోవడం మానేసి కేవలం రాజకీయ పరిగణనతోనే టిడిపి ఇప్పుడు రాజకీయ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. కేవలం ప్రజలలో సానుభూతిని దక్కించుకోవడానికి , కేంద్రం ఏమీ చేయలేదనే అభిప్రాయాన్ని రెచ్చగొట్టడానికి టిడిపి ఈ విధంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పటిష్ట ప్రజాస్వామ్యంలో ఏ అంశంపై అయినా సమగ్ర, విశ్వసనీయ చర్చ కీలకం అని, అది లేకుండా ఉత్తుత్తి ఆరోపణలకు దిగితే ప్రయోజనం ఏదీ ఉండదని అమిత్ షా స్పష్టం చేశారు. ఐదేళ్లుగా ఆంధ్రప్రదేశ్‌కు ఆదాయ లోటు భర్తీకి కేంద్రం చర్యలు తీసుకుందని, ఎన్‌డిఎ ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి సాయం రెండింతలు అయిందని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రగతిని పక్కకుపెట్టడం ఎంతవరకు సబబు అని, ప్రజల విశ్వాసాలను పక్కదోవ పట్టించడం తగదని చంద్రబాబుకు పరోక్షంగా షా చురకలు పెట్టారు. ఈ విధంగా వ్యవహరించే రాజకీయ పార్టీలు ఇకనైనా ఆత్మపరిశీలన చేసుకోవడం మంచిదని సూచించారు. రాజకీయ అజెండా సాధనకు ప్రజలతో ఆటలాడుకుంటారా? అని నిలదీశారు. తెలుగువారి పట్ల కాంగ్రెస్ వైఖరి పూర్తిగా అనుచితంగా ఉందని, ఆ పార్టీ వైఖరితోనే రాష్ట్ర విభజన అసమగ్రంగా జరిగిందని, ఇప్పటికైనా టిడిపి వారు కాంగ్రెస్ బిజెపిల వైఖరిని బేరీజు వేసుకుని వ్యవహరించడం మంచిదని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నుంచి అందిన అభివృద్ధి నిధులు, మంజూరు అయిన ప్రాజెక్టుల వివరాలను ఈ లేఖలో అమిత్ షా పొందుపర్చారు.

బిజెపి చేసిన పోరాటాలు నాగంకు కనిపించడం లేదా..?: కృష్ణసాగర్

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వంపై బిజెపి చేసిన పోరాటాలు ప్రజలకు కనిపిస్తున్నప్పటికీ నాగం జనార్దన్‌రెడ్డికి కనిపించడం లేదా అని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణసాగర్ ప్రశ్నించారు. తమ పార్టీలో 40 ఏళ్లుగా పనిచేస్తున్న నాయకులకు ఇవ్వని గౌరవం నాగంకు ఇచ్చామన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిఆర్ఎస్‌తో కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్‌లో నాగం జనార్ధన్‌రెడ్డి తన వ్యక్తి గత ప్రయోజనం కోసమే వెళ్తున్నట్లు భావిస్తున్నామన్నారు. గత రెండు రోజులుగా బిజెపి సీనియర్ నేతలపై ఆయన ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. పార్టీ అంగీకారంతోనే ఇప్పటి వరకు టిఆర్ఎస్ ప్రభుత్వంపై నాగం కేసులు వేశారని వివరించారు. నాలుగేళ్ల కాలంలో టిఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిపై కాంగ్రెస్ పోరాటం చేయలేదని, ఆ పార్టీ టిఆర్ఎస్ ప్రభుత్వంపై కేసులు వేయలేదన్నారు. బిజెపి సిద్ధాంత నిబంధనలను పక్కన పెట్టి నాగంకు, ఆయన కుమారునికి రెండు టికెట్లు కేటాయించామని వివరించారు. పార్టీ మారడం నాగం వ్యక్తి గత విషయమైనప్పటికీ పార్టీ అంతర్గత సమావేశాల్లో జరిగిన విషయాలను చెప్పబోరని తాము ఆశించామన్నారు.

రైలు కింద పడి విద్యార్థి మృతి



చీరాల: ప్రకాశం జిల్లా చీరాల రైల్వేస్టేషన్‌లో విషాదం చోటుచేసుకుంది. కదులుతున్న రైలు ఎక్కబోయి శుక్రవారం రాత్రి ఇంజినీరింగ్ విద్యార్థి రైలు కిందపడి మృతిచెందిన సంఘటన సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. గుంటూరు జిల్లా బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న కె. వెంకట శివ(18) అనే యువకుడు చెన్నైలో జరగనున్న ఎడ్యుకేషనల్ ఫెయిర్‌కు వెళ్ళేందుకు బాపట్ల నుంచి శుక్రవారం అర్ధరాత్రి చెన్నై ఎక్స్ ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్నాడు. చీరాల రైల్వేస్టేషన్‌లో ఆగిన రైలు దిగి మంచినీటి సీసా కొనుగోలుచేశాడు. ఆ క్రమంలో రైలు కదిలింది. అప్పటికే వేగం అందుకున్న రైలును ఎక్కే ప్రయత్నం చేయగా ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతిచెందాడు. ప్రమాద దృశ్యాలు సీసీ టీవీలో నమోదయ్యాయి. మృతుడు ప్రకాశంజిల్లా దర్శి మండలం కామాంతపూడి గ్రామానికి చెందిన వెంకట శివగా గుర్తించారు.

సబ్సిడీ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

మన తెలంగాణ / హైదరాబాద్ : రజకులు, నాయీబ్రాహ్మణులకు అధునాతన ఉపకరణాలను కొనుగోలుచేసుకోడానికి వీలుగా ప్రభుత్వం సబ్సిడీ రుణాలను మంజూరు చేయనుంది. ఇందుకోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలని వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం శనివారం రాత్రి విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తెలంగాణ నాయీబ్రాహ్మణ సహకార సంఘాల సమాఖ్య, తెలంగాణ రజక సహకార సంఘాల సమాఖ్యలకు అనుబంధంగా ఉన్న సొసైటీలు, విడిగా వృత్తిదారులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. 201516లో దరఖాస్తు చేసుకుని బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలను అందుకోలేకపోయినవారు తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, అయితే నూతన విధి విధానాలు, నిబంధనల ప్రకారం వారికి అర్హతను బట్టి రుణాలు మంజూరవుతాయని పేర్కొన్నారు. వచ్చే నెల 4వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. లక్ష రూపాయల లోపు రుణం తీసుకునేవారికి ప్రభుత్వం 80% మేర సబ్సిడీ ఇస్తుందని, రెండు లక్షల రూపాయల వరకు రుణం తీసుకునేవారికి 70% సబ్సిడీ, 12 లక్షల రూపాయల వరకు రుణం తీసుకునేవారికి 60% చొప్పున సబ్సిడీ ఇస్తుందని పేర్కొన్నారు. మిగిలిన మొత్తాన్ని లబ్దిదారులు వారి స్వంత డబ్బును సమకూర్చుకోవాలని లేదా బ్యాంకుల నుంచి రుణం రూపంలో సర్దుబాటు చేసుకోవాలని పేర్కొన్నారు.

కరెంట్ చార్జీలు పెంచం

(మొదటిపేజీ తరువాయి)

సమాధానమిస్తూ రాష్ట్రంలో విద్యుత్ కోతల్లేకుండా 24 గంటలూ అన్ని వర్గాలకు విద్యుత్‌ను అందిస్తున్నామని, గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామన్నారు. ఉమ్మడిరాష్ట్రం లోగానీ, తెలంగాణ రాష్ట్రంలోగానీ గరిష్ట విద్యుత్ డిమాండ్ 10,284 మెగావాట్లు అని, ఈ నెల 8వ తేదీన నమోదైందని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 625 సబ్ స్టేషన్ల నిర్మాణమైందని 4,559 సర్క్యూట్ కి.మీ.ల ఇహెచ్‌టి లైన్లు, 35,094 సర్క్యూట్ కి.మీ.ల పంపిణీ లైన్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి గ్రామానికి సబ్‌స్టేషన్ నిర్మించడం సాధ్యం కాదన్నారు.

డిస్కంల పంపిణీ నష్టాలు తెలంగాణాలోనే తక్కువ

దేశంలో అతి తక్కువగా తెలంగాణలో డిస్కంల పంపిణీ నష్టాలు 10.03%గా ఉన్నాయని, సరఫరా నష్టాలు దేశ సగటు 23% ఉంటే రాష్ట్రంలో 10% మాత్రమేనని, దీనిని మరింత తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉత్తరప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర , కర్నాటక రాష్ట్రాల్లో ఈ నష్టాలు 23% నుంచి 30% వరకు ఉన్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి 12.8% ఉన్న నష్టాలు మూడేళ్ళలో రెండు శాతానికి పైగా తగ్గించినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవసరాలను తీర్చడానికి ప్రభుత్వేతర విద్యుత్ ఉత్పత్తి సంస్థలు 'సెంబ్ కార్ప్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్' నుండి రూ. 4.15 లకు యూనిట్, 'సోలార్ డెవలపర్స్' నుండి రూ.4.66 మొదలు రూ. 6.45లకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగానే బహిరంగ టెండర్ల ద్వారా పై రేటుకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. 'ఉదయ్' పథకంలో చేరడం వల్ల ఇప్పటివరకైతే రాష్ట్రానికి ఎలాంటి లాభం కలుగలేదన్నారు. రాష్ట్రంలో ఇప్పటికైతే మిగులు విద్యుత్ స్థాయికి రాలేదని, 2024 వరకు మిగులు విద్యుత్ సాధిస్తామన్నారు. పాతబస్తీలో విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

నార్త్ అండ్ సౌత్ పవర్ గ్రిడ్‌ల అనుసంధానం

నార్త్ అండ్ సౌత్ పవర్ గ్రిడ్‌లను అనుసంధించడానికి ఉద్దేశించిన ట్రాన్స్‌మిషన్ లైన్ల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. వార్దా నుండి నిజామాబాద్, హైదరాబాద్ వరకు 765 కెవి లైన్ పనులను పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పూర్తిచేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రం 2 వేల మెగావాట్ల విద్యుత్‌ను సమీకరించడానికి కారిడార్‌ను బుక్ చేసుకొని, ఛత్తీస్‌ఘడ్ నుండి వెయ్యి మెగావాట్ల వరకు సమకూర్చుకుంటోందన్నారు.



తెలంగాణలో పేదలకు రాజ్యాంగ ఫలాలు : మంత్రి జగదీశ్‌రెడ్డి

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో పేదలకు రాజ్యాంగ ఫలాలు అందుతున్నాయని ఎస్‌సి అభివృద్ధి శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ గురుకులాల మీద ప్రజలకు విశ్వాసం పెరిగిందని, ఇంతకాల విద్యకు దూరంగా నెట్టి వేయబడ్డ మెజారిటీ ప్రజలు నేడు కార్పొరేట్ విద్యను తలదన్నేలా సాగుతున్న ప్రభుత్వ గురుకులాల్లో చదువుకుంటున్నారని అన్నారు. ఎస్‌సి అభివృద్ధి శాఖ, ఎస్‌సి గురుకులాల సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న సమ్మర్ సమురాయ్ శిబిరాన్ని మంత్రి జగదీశ్‌రెడ్డి శనివారం రవీంద్రభారతిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అశాస్త్రీయ బోధనతో కార్పొరేట్ విద్యాలయాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. అటువంటి అశాస్త్రీయ విద్యాబోధన నుండి విద్యార్థులను బయటపడేసేందుకు ముఖ్యమంత్రి కెసిఆర్ తీసుకున్న నిర్ణయాలు తెలంగాణ రాష్ట్రంలో అద్భుత ఫలితాలు సాధిస్తున్నాయన్నారు. కంప్యూటర్ కోడింగ్ వంటి ఆధునిక పరిజ్ఞానంతో కూడిన అంశంతో డ్రోన్ మేకింగ్, జ్యూవలరీ, మల్టీ మీడియా వంటి సరికొత్త అంశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎస్‌సి అభివృద్ధి శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాష్, గురుకుల పాఠశాలల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చిరుత సంచారం : ప్రజల ఆందోళన



మన తెలంగాణ /లింగంపేట (కామారెడ్డి జిల్లా): లింగంపేట మండలంలోని ఎక్కపల్లి తండాలో శనివారం ఉదయం చిరుతపులి ప్రవేశించి హల్‌చల్ చేసింది. శెట్పల్లిసంగారెడ్డి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎక్కపల్లి తండా అటవీ ప్రాంతానికి సమీపంలో ఉంది. శుక్రవారం రాత్రి చిరుతపులి తండాలోకి ప్రవేశించి మోజీరాంకు చెందిన కొట్టంలోకి ప్రవేశించింది. శనివారం తెల్లవారు జామున చిరుతపులిని చూసిన కుక్కలు మొరగడంతో కుటుంబసభ్యులు ఇంటి ఆవరణలోకి వచ్చి చూడగా చిరుతపులి కనిపించింది. చిరుతపులి తండాలోకి వచ్చిన సమాచారాన్ని తండా వాసులు ఎల్లారెడ్డి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఎల్లారెడ్డి రేంజ్ అధికారి రాధాకృష్ణ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అటవీ అధికారులు మెదక్ వన్యప్రాణి విభాగం డిఎఫ్ఓ పద్మజా రాణి, కామారెడ్డి ఎఫ్‌డిఓ రేఖబాను, కామారెడ్డి జిల్లా అటవీ అధికారిణి బాలమణి, నర్సా పూర్ రేంజ్ అధికారి రాఘవేందర్, నాగిరెడ్డిపేట రేంజ్ అధికారి అనురాధ, సెక్షన్ అధికారులు మోజం అలీఖాన్ తండాకు చేరుకుని రెస్క్యూ టీం, హైదరాబాద్‌లోని జూపార్కు సిబ్బందిని పిలిపించారు. చిరుతను పట్టుకునేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేసారు.

పంట ఎండిపోయిందని రైతు ఆత్మహత్య

మన తెలంగాణ / మెదక్ (చిలప్‌చెడ్) : వ్యవసాయ బోరుబావిలో నీరు లేక పంట ఎండిపోవడంతో తాను చేసిన అప్పులు ఎలా తీర్చాలన్న మనోవేదనతో ఓ రైతు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిలప్‌చెడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. చిలప్‌చెడ్ మండల పరిధిలోని రాందాస్‌గుడా గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల నర్సింలు(45) తనకున్న వ్యవసాయ పొలంలో వరి వేశాడు. కాగా కొద్ది రోజులుగా బోరు బావిలో నీరు తగ్గడంతో పంట ఎండిపోయింది. ఓ పక్క అప్పులు, పెళ్లి కావాల్సిన కూతురు ఉండడంతో మనస్థాపం చెందిన నర్సింలు తన పొలం వద్ద ఉన్న వేప చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిపారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లయ్య తెలిపారు.

కనీస వేతనాలు సవరించాలని హైకోర్టులో వ్యాజ్యాలు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కనీస వేతనాలను సవరించకపోవడాన్ని తప్పుపడుతూ హైకోర్టులో రెండు వేర్వేరు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలను సవరించాలని, ఈ విధంగా చేయకపోవడం వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ప్రజాహిత వ్యాజ్యాల్లో పిటిషనర్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కనీస వేతనాల చట్టాన్ని సవరించలేదని తప్పుపడుతూ హైదరాబాద్‌కు చెందిన తెలంగాణ రీజినల్ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ కార్యదర్శి పావువెల్లి జీవన్‌రావు మరో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. 1948లో తెచ్చిన చట్టాన్ని సరిగ్గా అమలు చేయడం లేయకపోవడమే కాకుండా పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతన సవరణ చేయలేదని వ్యాజ్యంలో పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలను అధ్యయనం చేసేందుకు అధికారిక కమిటీ లేదా సబ్ కమిటీ ద్వారా నివేదిక తెప్పించుకుని నిర్ణయం తీసుకోవాలనే చట్ట నిబంధనల్ని సర్కార్ తుంగలోకి తొక్కిందన్నారు. రెండేళ్లకోసారి వేతన సవరణ చేయాలనే నిబంధన అమలు జరిగే హైకోర్టు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 2014లో సలహా కమిటీ చేసిన 34 ప్రతిపాదనలను అమలు చేయకపోగా మరో రెండేళ్లకు ఇంకో కమిటీ వేసిందని, ఈ కమిటీ తొమ్మిది ప్రతిపాదనలు చేసినా ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. కార్మిక శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్లను ప్రతివాదులుగా చేశారు.

2005 తర్వాత సవరణే లేదు : వెంటనే కనీస వేతన సవరణలు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని ఏపీ రాష్ట్ర మల్టీపుల్ కాంట్రాక్టర్స్ లేబర్ యూనియన్ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు దాఖలు చేసిన పిల్‌లో పేర్కొన్నారు. 2005లో కార్మికుల కనీస వేతన సవరణ జరిగిందని, సుప్రీంకోర్టు కూడా కనీస వేతన సవరణ చేయాలని చెప్పినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వ్యాజ్యంలో పేర్కొన్నారు. ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోవడంతో పిల్ దాఖలు చేయాల్సివచ్చిందని వివరించారు. ప్రతివాదులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి, కార్మిక శాఖ కమిషనర్‌లను ప్రతివాదులు చేశారు.

'వెయిటేజీ'పై హైకోర్టులో పిటిషన్

మన తెలంగాణ/హైదరాబాద్ : పిజి మెడికల్ ఎడ్యుకేషన్‌లో ఇన్ సర్వీస్ కోటాకు బదులు వెయిటేజీ ఇవ్వాలన్న తెలంగాణ సర్కార్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో వ్యాజ్యం దాఖలైంది. ఇన్ సర్వీస్ కోటానే కొనసాగించాలని, 2017లో జారీ చేసిన జిఒ 27 అమలు జరిగేలా ఉత్తర్వులు ఇవ్వాలని ప్రజాహిత వ్యాజ్యంలో పిటిషనర్ హైకోర్టును కోరారు. ఇన్ సర్వీస్‌కు బదులు వెయిటేజీ ఇస్తూ జారీ చేసిన జీవోలు 21, 22లను కొట్టేయాలని వెద్యులు డాక్టర్ ఎం.వసుచరణ్‌రెడ్డి, మరో 12 మంది పిల్ దాఖలు చేశారు. పూర్వపు విధానం కొనసాగేలా కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇందులో ప్రతివాదులుగా కుటుంబ సంక్షేమ, మెడికల్ ఎడ్యుకేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి, కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కన్వీనర్‌లను చేర్చారు. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రూల్స్ ప్రకారం పీజీలో నేషనల్ పూల్‌కు 50 శాతం సీట్లు పోగా, మిగిలిన 50 శాతం సీట్లు స్థానికులకే చెందేలా ఇచ్చిన జీవోలు చెల్లవన్నారు. క్లినికల్‌కు 30 శాతం, నాన్ క్లినికల్‌కు 50 శాతం కోటా కేటాయించే ఇన్ సర్వీస్‌ను రద్దు చేయడం చెల్లదన్నారు. తాజాగా ఇచ్చిన జీవోల అమలును నిలిపివేస్తూ స్టే ఇవ్వాలని, పూర్తి విచారణ తర్వాత వాటిని కొట్టేయాలని హైకోర్టును కోరారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రానుంది.

ఉద్యమాలకు ఊపిరి పోద్దాం



మన తెలంగాణ/మంచాల : ఉద్యమాలకు ఊపిరి పోసి ప్రజావ్యతిరేక విధానాలు చేపడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎండగట్టాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. ఏప్రిల్ 18 నుంచి 22 వరకు నగరంలో నిర్వహించే సిపిఎం అఖిల భారత మహాసభల సందర్భంగా రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో చేపట్టిన బస్సు యాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. అనంతరం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగడాల యాదయ్య అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నేటికి రైతులకు గిట్టు బాటుధర కల్పించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మిర్యాలగూడ మాజీ ఎంఎల్ఎ జూలకంటి రంగారెడ్డి, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు అరుణ్‌కుమార్, చుక్కా రాములు, బి వెంకట్, రాష్ట్రకమిటీ సభ్యులు కిల్లే గోపాల్, స్త్రైలాబ్,పి జంగారెడ్డి పాల్గొన్నారు.

బల్దియా భళా !



- బాండ్లకు కేంద్రం పురస్కారం
- రూ.26 కోట్ల నగదు బహుమతి

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : మున్సిపల్ బాండ్ల రూపంలో నిధులను సేకరించినందుకుగాను కేంద్ర ప్రభుత్వం జిహెచ్‌ఎంసిని ప్రశంసిస్తూ రూ.26 కోట్ల ప్రత్యేక ఆర్థిక పురస్కారాన్ని ప్రకటించింది. బాండ్ల రూపంలో రూ.వెయ్యి కోట్లు సేకరించడం ద్వారా జిహెచ్‌ఎంసి దేశంలోనే మున్సిపల్ రంగంలో సరికొత్త చరిత్రకు నాంది పలికింది. మున్సిపాలిటీలను ప్రోత్సహించేందుకు బాండ్ల ద్వారా నిధులను సేకరించే 20 మున్సిపాలిటీలకు కూడా ఇక నుంచి ప్రతి సంవత్సరం ఈ విధమైన పురస్కారాన్ని అందచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. నగర అవసరాలకు కావాల్సిన నిధుల సేకరణకు మున్సిపల్ బాండ్ల మార్కెట్ అత్యంత అనుకూలమని, ఈ విషయంలో జిహెచ్‌ఎంసి మంచి ఆర్థిక క్రమశిక్షణతో బాండ్ల ద్వారా ని ధులను సేకరించడం పట్ల కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అభినందించింది. ఇందుకుగాను జిహెచ్ ఎంసికి రూ.26 కోట్ల నగదు పురస్కారాన్ని అందచేస్తూ లేఖను అందచేసింది. హైదరాబాద్ మెట్రో రైలు ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోడీ హైదరాబాద్ లాంటి మున్సిపల్ కార్పొరేషన్లు నిధులను బాండ్ల రూపంలో సేకరించాలని మున్సిపల్ శాఖమంత్రి కె.టి. రామారావుకు సూచించిన విషయం తెలిసిందే. ప్రధాని సూచనకు అనుగుణంగా గ్రేటర్ హైదరాబాద్‌లో చేపడుతున్న భారీ ప్రాజెక్టలను మరింత వేగవంతంగా పూర్తి చేసేందుకు రూ.వెయ్యి కోట్లను బాండ్ల రూపంలో సేకరించాలని నిర్ణయించారు. జిహెచ్‌ఎంసి ఆర్థిక పరిస్థితులు, పన్నుల వసూళ్లు, ఆర్థిక క్రమ శిక్షణ అధ్యయనం చేసిన కేర్, ఇండియా రేటింగ్ సంస్థలు ఎఎ (స్టేబుల్) రేటింగ్‌ను ఇచ్చాయి. ప్రభుత్వ సంస్థలకు ఎఎ స్టేబుల్ రేటింగ్ రావడం గొప్ప విషయమని అధికారులు అన్నారు. బాండ్లపై ఫిబ్రవరి 14న ముంబాయిలో ఎలక్ట్రానిక్ బిడ్డింగ్ ఆహ్వానించగా అంచనాలకు మించి బిడ్డింగ్‌లో సంస్థలు పాల్గొన్నాయి. ఈ బిడ్డింగ్‌లో 8.90 శాతం రేటు ప్రకారం రూ.200 కోట్లను సేకరించారు. ఈ నిధులను వ్యూహాత్మక రహదారుల పథకం (ఎస్ఆర్‌డిపి) పనులకు వినియోగిస్తున్నారు.

దేశంలో గత యాభై, అరవై సంవత్సరాలుగా మున్సిపాలిటీలు, స్థానిక సంస్థలు బాండ్ల రూపంలో సుమారుగా రూ.2,000 కోట్లు సేకరించాయి. ఇలా సేకరించిన మొత్తంలో పది శాతాన్ని జిహెచ్‌ఎంసి ప్రస్తుతం సేకరిస్తోంది. కాగా, జిహెచ్‌ఎంసికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహంగా అందచేస్తున్న ఆర్థిక పురస్కార స్ఫూర్తితో దేశంలో మరిన్ని మున్సిపాలిటీలు కూడా బాండ్ల మార్కెట్‌లో ప్రవేశించడానికి మార్గంగా ఇది ఉపకరిస్తుందని అధికారులు అభిప్రాయ పడుతున్నారు.

సజావుగా పదవ తరగతి పరీక్షలు

- ఎక్కడా ప్రశ్నాపత్రం లీక్ కాలేదు
- కొన్ని చోట్ల మాల్ ప్రాక్టీస్ ఘటనలు
- మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన వారిపై కేసులు పెట్టాం
- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్



మన తెలంగాణ/హైదరాబాద్ : పదవ తరగతి పరీక్షలు సజావుగా జరుగుతున్నాయని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్ తెలిపారు. మార్చి 15 నుంచి ప్రారంభమైన పదవ తరగతి పరీక్షల్లో ఎక్కడా పేపర్ లీక్ కాలేదని, కొన్ని చోట్ల మాల్ ప్రాక్టీస్ ఘటనలు మాత్రమే వెలుగు చూశాయని పేర్కొన్నారు. 25 మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు చేసి, ఇందుకు సహకరించిన 29 మంది ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు బి.సుధాకర్‌తో కలిసి శనివారం నాడు కమిషనర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జి. కిషన్ మాట్లాడుతూ, ఈ నెల 19న ఇంగ్లీష్ పేపర్–1 పరీక్ష జరుగుతున్న సమయంలో మహబూబ్‌నగర్, అదిలాబాద్ జిల్లాల్లో ప్రశ్నాపత్రం వాట్సాప్‌లో కనిపించిన ఘటనలో సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి విధుల నుంచి సస్పెండ్ చేశామన్నారు. ఇప్పటివరకు మొత్తం 29 మంది ఇన్విజిలేటర్లు, ఆరుగురు ఛీఫ్ సూపరింటెండెంట్లు, ముగ్గురు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్‌ను విధుల నుంచి తొలగించడంతో పాటు 12 మంది ఇన్విజిలేటర్లు, ఇద్దరు చీఫ్ సూపరింటెండెంట్లు, ముగ్గురు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్‌తో పాటు పరీక్షలతో సంబంధం ఉన్న నలుగురు సిబ్బందిని సస్పెండ్ చేశామని పేర్కొన్నారు.

మాల్ ప్రాక్టీస్‌కు సహకరించిన వారిపై పబ్లిక్ ఎగ్జామ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశామని, ఈ ఘటనలు విశ్లేషించిన తర్వాత డిఇఒలు, ఎంఇఒల ప్రమేయం ఉన్నట్లు తేలితే, వారిపై కూడా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన ఉపాధ్యాయులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మాల్ ప్రాక్టీస్ ఘనలను విశ్లేషించేందుకు కమిటీ వేయనున్నట్లు చెప్పారు. అలాగే ప్రైవేట్ పాఠశాలలు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినట్లు రుజువైతే గుర్తింపు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత మధ్యలో ప్రశ్నాపత్రం బయటకు వస్తే అది లీకేజి కాదని, మాల్ ప్రాక్టీస్ కిందకు మాత్రమే వస్తుందని స్పష్టం చేశారు. పదవ తరగతి పరీక్షా కేంద్రాలలో దశలవారీగా సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రహరీ గోడలు లేని పరీక్షా కేంద్రాలు ఆరు ఉండగా, పాక్షికంగా దెబ్బ తిన్న ప్రహరీలు ఉన్న కేంద్రాలు 30 వరకు ఉన్నాయని చెప్పారు.

మియాపూర్‌లో దొంగల బీభత్సం

15 తులాల బంగారం, 18వేల నగదు అపహరణ


మన తెలంగాణ/ మియాపూర్ :మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో నివాసముండే సర్వేశ్వర్‌రెడ్డి ఈ నెల 23న రాత్రి భోజనం చేసి పడుకున్నారు. అర్ధరాత్రి సమయం దాటిన తరువాత దొంగలు వంటగది తలుపులు పగలగొట్టి ఇంట్లోకి వచ్చారని, శబ్దం రాకుండా నీటి నల్లాను ఓపెన్ చేసి సర్వేశ్వర్‌రెడ్డి పడుకున్న బెడ్‌రూంలోకి వచ్చి బీరువాలో ఉన్న 15 తులాల బంగారు ఆభరణాలు, 18వేల నగదును తీసుకొని పరారయ్యారు. సర్వేశ్వర్‌రెడ్డి మియాపూర్ పోలీసులకు సమాచారం అందించగా ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. దొంగతనం జరిగిన ఇంటిని మియాపూర్ ఎసిపి రవికుమార్, సిఐ హరిశ్చంద్రారెడ్డి తదితరులు పరిశీలించారు.


అంతర్జాతీయ గంజాయి స్మగ్లర్ల అరెస్టు

మన తెలంగాణ / గచ్చిబౌలి : పెద్ద ఎత్తున్న గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న అంతర్జాతీయ స్మగ్లర్‌లను ముఠ సభ్యులను అరెస్ట్ చేసినట్టు మాదాపూర్ డిసిపి విశ్వప్రసాద్ తెలిపారు. శనివారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతు ఎన్నో రోజులుగా గుట్టు చప్పుడు కాకుండా పెద్ద ఎత్తున్న గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న అంతర్జాతీయ గంజాయి స్మగ్లర్‌లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 91 కిల్లోల గంజాయిని 27 సంచులను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఈ గంజాయి విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో 16 లక్షల రూపాయల వరకు ఉంటుందని ఆయన తెలిపారు. మాదాపూర్ ఎస్ఒటి, గచ్చిబౌలి పోలీసులు సంయుక్తంగా దాడి చేసి వట్టినాగుల పల్లిలో ఒ ఇంట్లో నిల్వ ఉంచిన గంజాయి ఉందని కచ్చితమైన సమాచారంతో దాడి చేసి గంజాయిని స్వాధీనం చేసుకుని స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్టు తెలిపారు. దోమల శ్రీనివాస్, ఎండి ఫయిమ్, నాగప్పలను అరెస్ట్ చేశామని, మరో ఇద్దరు సంజయ్, జగదీశ్‌లు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఐదుగురు సభ్యులు ముఠాగా ఏర్పడి పలు ప్రాంతాల నుంచి పెద్ద గంజాయిని తరలించి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్టినాగుల పల్లి గ్రామంలోని ఒ ఇంట్లో నిల్వ ఉంచి సప్లయి చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం దాడి చేయగా స్మగ్లింగ్ గుట్టు రట్టయిందన్నారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న పోలీస్ అధికారులు పురుషోత్తం, లాల్‌మాదుర్‌లను ఆయన అభినందించారు.

ఏరా ఫాల్తు..నాకే ఫోన్ చేస్తావా?

- దుర్భాషలాడి చేయి చేసుకున్న సూర్యాపేట రూరల్ ఎస్‌ఐ లవకుమార్ సస్పెన్షన్
- దామోదర్‌రెడ్డి రాసిన సూసైడ్ నోట్ లభ్యం
- 'మన తెలంగాణ'కు గోడు వెల్లబోసుకున్న హెడ్‌కానిస్టేబుల్ దామోదర్‌రెడ్డి భార్య జ్యోతి





మన తెలంగాణ/సూర్యాపేట : తన కోడలు పెట్టిన గృహ హింస కేసులో విచారణకు హాజరై ఎస్‌ఐ చేతిలో చావు దెబ్బలు తిన్న హెడ్ కానిస్టేబుల్ దామోదర్‌రెడ్డి (హెచ్‌సి 431) పరిస్థితి విషమంగా ఉంది. చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. ఈనెల 14న ఎస్సై చేతిలో దెబ్బలు తిన్న దామోదర్‌రెడ్డి 15న పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. వారం గడిచినా ఎస్‌ఐపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈ నెల 23న మనస్తాపానికి గురై క్రిమి సంహారక మందు తాగి హైదరాబాద్‌లోని కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం విదితమే. ఈ ఘటనకు ముందు దామోదర్‌రెడ్డి రెండు సూసైడ్ నోట్‌లను రాసినట్లు తెలిసింది. ఒకటి తనకు సంబంధిత వ్యక్తి వద్ద ఉండగా, మరొకటి పోలీస్ స్టేషన్‌లో ఉన్నట్లు సమాచారం. బయట రాసిన సూసైడ్ నోట్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుండగా పోలీస్ స్టేషన్‌లో ఉన్న సూసైడ్ నోట్ మాత్రం బయటకు పొక్కకపోవడం విశేషం. దీనిపై శాఖాపరమైన ఉన్నతాధికారులు సమగ్ర విచారణ ప్రారంభించినట్లు తెలుస్తుంది. పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ దామోదర్‌రెడ్డిని రూరల్ ఎస్‌ఐ లవకుమార్ విచారణ పేరుతో ఈ నెల 14న నానా బూతులు తిడుతూ, చేయి చేసుకున్నాడని బాధితుడి భార్య జ్యోతి శనివారం పేర్కొంది. అడ్డుపోయిన తనను ఎదపై చేయి వేసి నెట్టివేశాడని పేర్కొంది. అంతకు ముందు సుభద్ర, సుధీర్ అనే కానిస్టేబుళ్లను తన ఇంటికి పంపించాడని చెప్పింది. డ్యూటీ ఉన్నందున తర్వాత స్టేషన్‌కు వస్తానని దామోదర్ చెప్పినా వినలేదని, దీంతో దామోదర్‌రెడ్డి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్‌ఐ సంతోష్‌కుమార్ పర్మిషన్‌తో విచారణకు వెళ్లినట్లు తెలిపింది. అదే రోజు రూరల్ స్టేషన్‌కు ఇరువురం వెళ్లగా ఎస్‌ఐ లవకుమార్ ఏమిరా ఫాల్తు..నాకే ఫోన్ చేస్తావురా అని తిట్టాడని, ఇదేమిటని తాను ప్రశ్నించగా తనను కూడా దుర్భాషలాడి, చేయి చేసుకున్నాడని, తన భర్త దౌడపై బలంగా కొట్టడంతో ఇద్దరం కింద పడిపోయినట్లు చెప్పింది. మరుసటి రోజు పట్టణ సిఐ శివ శంకర్, డిఎస్పీ నాగేశ్వరరావు, ఎస్‌పి ప్రకాశ్‌జాదవ్‌లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం వల్ల తన భర్త ఈ దారుణానికి ఒడిగట్టారని వాపోయింది.

దామోదర్‌రెడ్డి సూసైడ్ నోట్‌లో....

పోలీస్ స్టేషన్‌లో జరిగిన అవమానానికి, అన్యాయానికి మనస్తాపానికి గురైన ఈ నెల 23న మధ్యాహ్నమే తన సమీప బంధువులకు, స్నేహితులతో తాను చనిపోతానని దామోదర్‌రెడ్డి చెప్పినట్లు సమాచారం. రూరల్ ఎస్‌ఐ, ట్రాఫిక్ ఎస్‌ఐలపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. తమ భార్యా పిల్లలకు న్యాయం చేయాలని, తన కోడలు పెట్టిన కేసులో కుటుంబ సభ్యులమంతా నిర్దోషులమని, తన కుటుంబాన్ని పోలీస్ సంఘ అధ్యక్షులు గోపిరెడ్డి, రామచందర్, అమర్‌సింగ్, ఎస్‌పి ప్రకాశ్‌జాదవ్ ఆదుకోవాలని రాశాడు.

ఎస్‌ఐ లవకుమార్ సస్పెన్షన్

దామోదర్‌రెడ్డి కేసులో బాధ్యులపై తప్పక చర్యలు తీసుకుంటామన్న ఎస్‌పి ప్రకాశ్‌జాదవ్ మరుసటి రోజే బాధ్యులపై వేటు వేశారు. ఐజి ఆదేశానుసారం సస్పెండ్ చేస్తున్నట్లు చెప్పారు. గృహ హింస కేసు విచారణలో దామోదర్‌రెడ్డిపై దుర్భాషలాడుతూ చేయి చేసుకున్న రూరల్ ఎస్‌ఐ లవకుమార్‌కు శాఖ ఉన్నత కార్యాలయం నుండి సస్పెండ్ లెటర్ పంపినట్లు జిల్లా ఎస్‌పి పేర్కొన్నారు.

కొడుకును రోకలితో కొట్టి చంపిన తల్లి



నరేష్ (ఫైల్)

మన తెలంగాణ/జమ్మికుంట : కొడుకు వేధింపులు భరించలేక తల్లి రోకలి బండతో కొట్టి చంపిన ఘటన కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని గణేష్‌నగర్ కాలనికి చెందిన జక్కే కొమురయ్య నాలుగేళ్ల క్రితం మృతి చెందగా భార్య లక్ష్మి(45)కుమారుడు జక్కే నరేష్ కలిసి జీవిస్తుంది. గత కొంత కాలంగా నరేష్ నిత్యం మద్యం తాగి తల్లిని వేధిస్తున్నట్లు తెలిపారు. శనివారం రాత్రి మద్యం తాగి వచ్చిన నరేష్ తల్లి లక్ష్మిని వేధిస్తుండంతో భరించలేని తల్లి లక్ష్మి రోకలి బండతో కొట్టి చంపింది. అనంతరం జమ్మికుంట పట్టణ పోలీస్టేషన్‌లో లొంగి పోయింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సిఐ పింగిళి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

మన తెలంగాణ / సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన ఇంటర్ విద్యార్థి కలికోట సాయి ప్రసన్న (17) శనివారం తెల్లవారు ఝామున ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ప్రసన్న ఇటీవల జరిగిన పరీక్షలు సరిగా రాయలేదని మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు సాగిస్తున్నారు.

29న టిటిఎల్ఎఫ్ ఆవిర్భావ సభ

మన తెలంగాణ/హైదరాబాద్ : టీచర్లు, లెక్చరర్ల సమస్యలను నిరంతరం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో తెలంగాణ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫోరం(టిటిఎల్ఎఫ్) ముంటుందని ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు మాసం రత్నాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో టిటిఎల్ఎఫ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 29న హరిహర కళాభవన్‌లో టిటిఎల్ఎఫ్ ఆవిర్భావ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సభకు రాష్ట్ర ఐటిశాఖ మంత్రి కెటిఆర్ ముఖ్యఅతిథిగా హాజరై తమ ఫోరం డైరీని ఆవిష్కరిస్తారని చెప్పారు.

వాటర్ ప్లాంట్‌లపై టాస్క్‌ఫోర్స్ దాడులు



మన తెలంగాణ/మంచిర్యాల ప్రతినిధి : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పలు వాటర్ ప్లాంట్లపై శనివారం రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. రామగుండం కమీషనర్ దుగ్గల్ ఆదేశాల మేరకు ఏసిపి విజయసారథి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నేచర్ వాటర్ ప్లాంట్, జెఎస్ ఇండస్ట్రీస్, గంగోత్రి వాటర్ ప్లాంట్లపై దాడులు చేసి, తనిఖీలు నిర్వహించారు. పలు వాటర్ ప్లాంట్లను అనుమతి లేకుండా నిర్వహిస్తున్నారని, నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని, అందిన ముందస్తు సమాచారం మేరకు ఫుడ్ ఇన్స్‌పెక్టర్ రవీంద్రచారితో కలసి దాడులు నిర్వహించి, వాటర్ ప్లాంట్లలలో తనిఖీలు చేసి, వాటర్ శాంపిల్స్ సేకరించారు. ఈమేరకు సేకరించిన వాటర్ శాంపిల్స్‌ను పరీక్ష నిమిత్తం పంపడం జరిగిందని, నివేదికల ఆధారంగా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఏసిపి విజయసారథి తెలిపారు. జిల్లా కేంద్రంలో మరికొన్ని ప్లాంట్లు కూడా అనుమతి లేకుండా నడుస్తున్నట్లు సమాచారం అందిందని వాటిపై కూడా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సిఐ సారీలాల్, ఎస్‌ఐ సమ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

54 ఉపాధ్యాయ సంఘాలతో జెసిటియు

ఎస్‌ఎస్‌సి స్పాట్ బహిష్కరణకు పిలుపు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఏప్రిల్ 2 నుంచి ప్రారంభమయ్యే ఎస్‌ఎస్‌సి స్పాట్ వాల్యుయేషన్‌ను బహిష్కరించాలని జాయింట్ కమిటీ ఆఫ్ టీచర్స్ యూనియన్స్(జెసిటియు) పిలుపినిచ్చింది. రాష్ట్రంలో మూడు ఐక్యవేదికలుగా ఉన్న 54 ఉపాధ్యాయ సంఘాలు కలిసి జెసిటియుగా ఏర్పడినట్లు నాయకులు ఎం.చెన్నయ్య, చావ రవి, పి.సరోత్తమ్‌రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుల ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడిగా పోరాటం చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిపిఎస్ విధానం రద్దు, నూతన పిఆర్‌సి అమలు తదితర సమస్యలపై తీర్మానాలు చేసినట్లు తెలిపారు.

అవి కూడా ముఖ్యమే

అటు బాలీవుడ్‌తో పాటు ఇటు సౌత్‌లోనూ హీరోయిన్‌గా తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న తార రాధికాఆప్టే. పలువురు స్టార్ హీరోలతో హిట్ సినిమాలు చేసిన ఆమె తన బెస్ట్ పర్‌ఫార్మెన్స్‌కు గాను మంచి ప్రశంసలు అందుకుంది. పెద్ద సినిమాలు, చిన్న సినిమాలు చేసిన రాధికాఆప్టే తనకు మరింత కమర్షియల్ సక్సెస్ అవసరం అని అంటోంది. ''కమర్షియల్ సినిమాలు హీరోహీరోయిన్లకు మంచి పాపులారిటీని తీసుకువస్తాయి. ఎక్కువమంది ప్రేక్షకుల్లో గుర్తింపు తెచ్చుకోవడానికి ఇటువంటి సినిమాలు తోడ్పడుతాయి. ఎన్ని సినిమాలు చేశామన్నది కాదు... కమర్షియల్‌గా ఎంత సక్సెస్ సాధించామన్నదే ముఖ్యం''అని రాధిక పేర్కొంది. ''ప్రస్తుతం గ్లామరస్ తారగా రాణించడం నాకెంతో సంతోషాన్నిస్తోంది. నా కెరీర్ ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నా. కొన్నిసార్లు విమర్శలను కూడా ఎదుర్కొంటున్నా. అవి కూడా ముఖ్యమే. అప్పుడే తప్పుల నుంచి పాఠాలు నేర్చుకొని ముందుకు సాగగల్గుతున్నాను''అని ఆమె చెప్పింది.


రాధికాఆప్టే

మే నెలలో ఫస్ట్‌లుక్


నాగచైతన్య

ప్రస్తుతం తెలుగులో మంచి ఊపు మీదున్న యువ కథానాయకులలో అక్కినేని నాగచైతన్య ఒకరు. అతను హీరోగా ప్రస్తుతం రెండు సినిమాలు సెట్స్ మీద ఉన్నాయి. వీటి తర్వాత చైతూ రెండు, మూడు సినిమాలకు కమిట్‌మెంట్లు ఇచ్చేశాడు. ఇవికాకుండా మరో రెండు, మూడు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. నాగచైతన్య తాజాగా చేస్తున్న 'సవ్యసాచి'పై ప్రేక్షకుల్లో మంచి అంచనాలే ఉన్నాయి. ఇక మారుతి దర్శకత్వంలో నాగచైతన్య 'శైలజా రెడ్డి అల్లుడు' సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. గత నెలలోనే ఈ చిత్రం షూటింగ్ కూడా మొదలైంది. ఒక షెడ్యూల్‌ను పూర్తిచేశారు. కానీ ఆతర్వాత సినిమా గురించి ఏ సమాచారం లేదు. ప్రస్తుతం ఈ సినిమా గురించి మారుతి ట్విట్టర్‌లో స్పందించాడు. ''శైలజా రెడ్డి అల్లుడు చిత్రం ఒక షెడ్యూల్ పూర్తయ్యాక నాగచైతన్య 'సవ్యసాచి' కోసం వెళ్లిపోయాడు. అది పూర్తయిన తర్వాత మా చిత్రం షూటింగ్ తిరిగి మొదలవుతుంది. మే నెలలో సినిమా ఫస్టలుక్‌ను విడుదల చేస్తాము. ప్రేక్షకులు, అభిమానుల అంచనాల మేరకు ఈ సినిమా ఉంటుంది''అని మారుతి చెప్పాడు. ఇక గతంలో మారుతి దర్శకత్వంలో 'బాబు బంగారం'ను రూపొందించిన సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లోనే ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇదే బ్యానర్‌లో చైతూ 'ప్రేమమ్' సినిమా చేశాడు. 'శైలజారెడ్డి అల్లుడు'లో అను ఇమాన్యుయల్ కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమా ఈ ఏడాది ద్వితీయార్థంలో ప్రేక్షకుల ముందుకురానుంది.


శ్రీభరత్-తేజస్విని

బాలయ్య మళ్లీ తాతయ్య



నందమూరి బాలకృష్ణ చిన్న కూతురు తేజస్విని పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. గురువారం తెల్లవారు జామున ఆమెకు మగ శిశువు జన్మించాడు. ఇక శ్రీభరత్‌తో తేజస్విని వివాహం 2013లో జరిగిన సంగతి తెలిసిందే. పెళ్లయిన ఐదేళ్ల తర్వాత వీళ్లకు మొదటి సంతానం కలగడం... అందులోనూ మగబిడ్డ పుట్టడంతో రెండు కుటుంబాలు ఆనందంతో మురిసిపోతున్నాయి. ఇక బాలకృష్ణ పెద్ద కూతురైన బ్రాహ్మణికి దేవాన్ష్ అనే కుమారుడు ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు చిన్న కూతురు తేజస్వినికి మగబిడ్డ పుట్టడంతో బాలయ్య రెండోసారి తాతయ్య అయ్యాడు. ఇక శ్రీభరత్ గీతం యూనివర్సిటీ వ్యవస్థాపకులు ఎం.ఎస్.పి.రామారావు మనవడు.

'2 స్టేట్స్' సినిమా షురూ


'2 స్టేట్స్' సినిమా ప్రారంభ వేడుకలో కె.రాఘవేంద్రరావు, రాజమౌళి, కృష్ణంరాజు దంపతులు, రాజశేఖర్, జీవిత, అడివిశేష్, శివానీ, వెంకట్ కుంచం, ఎం.ఎల్.వి.సత్యనారాయణ

అడివి శేష్, శివానీ రాజశేఖర్ జంటగా నటించనున్న '2 స్టేట్స్' చిత్రం శనివారం అన్నపూర్ణ స్టూడియోలో ప్రారంభమైంది. చేతన్‌భగత్ రచించిన '2 స్టేట్స్' నవల ఆధారంగా హిందీలో '2 స్టేట్స్' తీసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ సినిమాను తెలుగులో రీమేక్ చేస్తున్నారు. లక్ష్య ప్రొడక్షన్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై వెంకట్ కుంచం దర్శకత్వంలో ఎం.ఎల్.వి.సత్యనారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ముహూర్తపు సన్నివేశానికి ఎస్.ఎస్.రాజమౌళి క్లాప్‌నిచ్చారు. కృష్ణంరాజు కెమెరా స్విచ్చాన్ చేయగా... కె.రాఘవేంద్రరావు గౌరవ దర్శకత్వం వహించారు. కోడి రామకృష్ణ, వి.వి.వినాయక్, టి.సుబ్బరామి రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాత ఎం.ఎల్.వి.సత్యనారాయణ మాట్లాడుతూ ''2 స్టేట్స్ సినిమా తెలుగులో వన్ ఆఫ్ ది బెస్ట్ మూవీగా నిలుస్తుందనే నమ్మకముంది. సినిమాను మూడు షెడ్యూళ్లలో పూర్తిచేస్తాం. మొదటి షెడ్యూల్‌ను ఏప్రిల్ 5 నుండి 19 వరకు హైదరాబాద్‌లో నిర్వహిస్తాం. రెండవ షెడ్యూల్‌ను మే నెలలో కోల్‌కతాలో చేసి... మూడో షెడ్యూల్‌ను అమెరికాలో ప్లాన్ చేస్తున్నాం''అని అన్నారు. హీరో అడివి శేష్ మాట్లాడుతూ ''దర్శకుడు వెంకట్ నాకు మంచి మిత్రుడు. హిందీలో '2 స్టేట్స్' చిత్రాన్ని మూడు సార్లు చూశాను. ఎప్పటినుంచో ఇలాంటి కథలో నటించాలనుకుంటున్నాను. ఈ సినిమాతో ఆ కోరిక తీరబోతోంది. శివానీతో కలిసి నటించనుండడం హ్యాపీగా ఉంది''అని తెలిపారు. హీరోయిన్ శివానీ రాజశేఖర్ మాట్లాడుతూ ''ఈ చిత్రంలో సవాల్‌తో కూడిన పాత్రను నేను పోషించగలనని నమ్మి దర్శకుడు నాకు ఈ అవకాశం ఇచ్చారు. అనూప్ సంగీతమంటే నాకు చాలా ఇష్టం. నా మొదటి సినిమాకు ఆయన సంగీత దర్శకత్వం వహించడం ఆనందంగా ఉంది''అని తెలిపారు.

దర్శకుడు వెంకట్ మాట్లాడుతూ ''ఓ హిట్ సినిమాను రీమేక్ చేయడం అంత సులువు కాదు. '2 స్టేట్స్' స్క్రిప్ట్‌పై చాలా వర్క్ చేశాను. రచయితలు మధు శ్రీనివాస్, మిథున్ చక్రవర్తి నాకు చాలా సహకరించారు. అనూప్ ఇప్పటికే మూడు అద్భుతమైన ట్యూన్స్ ఇచ్చారు. మంచి సినిమాగా తీర్చిదిద్దేందుకు అందరం కష్టపడతాము''అని చెప్పారు. మ్యూజిక్ డైరెక్టర్ అనూప్ రూబెన్స్ మాట్లాడుతూ ''నేను హిందీలో వచ్చిన '2 స్టేట్స్' సినిమా చూశాను. సంగీతానికి చాలా స్కోప్ ఉన్న చిత్రమిది. ఎం.ఎల్.వి.సత్యనారాయణ వంటి మంచి నిర్మాతతో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది''అని అన్నారు. రజత్‌కపూర్, భాగ్యశ్రీ, లిజి, ఆదిత్యమీనన్, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ, విద్యుల్లేఖా రామన్, హేమ, ఉత్తేజ్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరాః శానియల్ డియో, స్టంట్స్ః రవివర్మ, కొరియోగ్రఫీః జానీ.

టైమింగ్‌కి ఫిదా అవ్వాల్సిందే


విజయ్ దేవరకొండ

పెళ్లిచూపులు, అర్జున్ రెడ్డి చిత్రాలతో యంగ్ స్టార్‌గా పేరు తెచ్చుకున్న విజయ్ దేవరకొండ నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సీవాలా'. జిఏ2, యువి పిక్చర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. రాహుల్ సంకృత్యాన్ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రానికి ఎస్‌కెఎన్ నిర్మాత. విజయ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచిపోయే విధంగా 'టాక్సీవాలా' చిత్రం రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్‌ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. మే 18న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. అలాగే సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంబంధించిన చిన్న వీడియోను మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ వీడియోకు చాలా మంచి స్పందన వచ్చింది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత ఎస్‌కెఎన్ మాట్లాడుతూ ''విజయ్ దేవరకొండకు ఉన్న క్రేజ్, పాపులారిటీని దృష్టిలో పెట్టుకొని దర్శకుడు ఈ కథను తయారుచేశాడు. అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే విధంగా హీరో క్యారెక్టర్‌ను తీర్చిదిద్దాడు. విజయ్ మ్యానరిజమ్స్, బాడీ లాంగ్వేజ్, క్యారెక్టరైజేషన్ ప్రేక్షకులను మైమరపిస్తాయి. దర్శకుడు రాహుల్ , సుజిత్ విజువల్స్, జేక్స్ మ్యూజిక్, కృష్ణకాంత్ లిరిక్స్, జాషువా స్టంట్స్ సినిమాలో హైలైట్‌గా నిలుస్తాయి. ప్రస్తుతం సినిమా పోస్ట్‌ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. మే 18న టాక్సీవాలా చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఇప్పుడు సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశాం'' అని అన్నారు. దర్శకుడు రాహుల్ సంక్రిత్యాన్ మాట్లాడుతూ ''ఈ చిత్రాన్ని సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్నాము. సినిమాలోని కామెడీ ఆద్యంతం ప్రేక్షకుల్ని నవ్విస్తూ థ్రిల్ చేస్తుంది. అర్జున్‌రెడ్డి చిత్రంలో విజయ్ దేవరకొండను ఓ కోణంలో చూశారు. ఇప్పుడు మా 'టాక్సీవాలా'లో మరో కోణంలో చూస్తారు. విజయ్ టైమింగ్‌కి ప్రేక్షకులు ఫిదా అవ్వాల్సిందే. అంతలా తన నటనతో ఆకట్టుకుంటాడు''అని తెలిపారు. విజయ్ దేవరకొండ, ప్రియాంక జవాల్కర్, మాళవికా నాయర్, కళ్యాణి, మధునందన్, సిజ్జుమీనన్, రవిప్రకాష్, రవివర్మ, ఉత్తేజ్, విష్ణు తదితరులు ప్రధాన తారాగణంగా నటించిన ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ః సుజిత్ సారంగ్, మ్యూజిక్ః జేక్స్ బిజాయ్, ఎడిటర్, కలరిస్ట్ః శ్రీజిత్ సారంగ్, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ః సాయికుమార్ రెడ్డి.


అనుష్క

ఓ కలలా అనిపిస్తోంది

''సినీ ప్రయాణంలో ప్రతి సినిమా నాకు ఓ పాఠంలా ఉపయోగపడింది. జీవితానికి సంబంధించిన ఎన్నో ముఖ్యమైన విషయాల్ని నేర్చుకునే అవకాశం కలిగింది''అని చెప్పింది అనుష్క. కెరీర్ ప్రారంభంలో గ్లామర్ పాత్రలతో ప్రేక్షకుల్ని అలరించిన ఈ సొగసరి గత కొంతకాలంగా తన పంథా మార్చుకుంది. చారిత్రక చిత్రాలు, నటనకు ఆస్కారమున్న ప్రయోగాత్మక చిత్రాలకు ప్రాముఖ్యతనిస్తోంది. కొత్తదనంతో కూడిన కథాంశాల సినిమాలు చేస్తున్న ఈ సుందరి తెలుగు, తమిళ భాషల్లోని అగ్ర కథానాయికల్లో ఒకరిగా చెలామణి అవుతోంది. అదృష్టాన్ని కాకుండా కష్టాన్ని, శ్రమను నమ్ముకునే ఈ స్థాయికి చేరుకున్నానని అంటోంది ఈ సుందరి. అనుష్క మాట్లాడుతూ ''సినిమాలు, నటన పట్ల ఎలాంటి అవగాహన లేకుండానే చిత్ర సీమలోకి ప్రవేశించాను. సినీ రంగంలో అడుగుపెట్టకముందు థియేటర్‌కు వెళ్లి సినిమాలు చూసిన సందర్భాలు చాలా అరుదు. మా ఇంట్లో టివి కూడా ఉండేది కాదు. అలాంటిది నేను సినిమాల్లోకి రావడం... స్టార్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకోవడం ఓ కలలా అనిపిస్తోంది. ఇన్నేళ్ల కెరీర్‌లో నాకు లభించిన ప్రతి అవకాశాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకున్నాను. జయాజయాలకు అతీతంగా ప్రతిభను నమ్ముకొని ముందుకు సాగుతున్నాను. స్టార్ ఇమేజ్ గురించి ఆలోచించడం లేదు. ప్రతి సినిమాకు అంకిత భావంతో కష్టపడుతున్నాను. అదే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చింది''అని తెలిపింది.

విడుదల హక్కులు దిల్‌రాజు సొంతం




ఆకాష్ పూరి

స్టార్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ ప్రస్తుతం తన కుమారుడు ఆకాష్ పూరి హీరోగా 'మెహబూబా' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. షూటింగ్ మొత్తం పూర్తిచేసుకున్న ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. 1971 సంవత్సరంలో ఇండియా, పాకిస్థాన్ యుద్ధ నేపథ్యంలో నడిచే ప్రేమ కథగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమాలో ఆకాష్‌కు జోడీగా నేహా శెట్టి కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రాన్ని మే 11న వేసవి కానుకగా విడుదల చేయనున్నారు. ప్రముఖ నిర్మాత దిల్‌రాజు ఈ చిత్రం ప్రపంచవ్యాప్త విడుదల హక్కుల్ని సొంతం చేసుకున్నారు. తన సొంత బ్యానర్ పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్ బ్యానర్‌పై పూరి స్వయంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సందీప్ చౌత స్వరాలు సమకూరుస్తున్నారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం టీజర్‌కు మంచి స్పందన లభించింది.

దర్శకులు ప్రశంసిస్తున్నారు

కల్యాణ్‌రామ్, కాజల్ అగర్వాల్ హీరోహీరోయిన్లుగా ఉపేంద్ర మాధవ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎంఎల్ఎ'. బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్లపై కిరణ్ రెడ్డి, భరత్ చౌదరి నిర్మించిన ఈ చిత్రం తాజాగా విడుదలై హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు ఉపేంద్ర మాధవ్ మీడియాతో మాట్లాడుతూ చెప్పిన విశేషాలు...



స్క్రిప్ట్ విభాగంలో పనిచేశా... గుంటూరు జిల్లాలోని జొన్నలగడ్డ మా స్వస్థలం. దర్శకుడిని కావాలని చిత్ర పరిశ్రమలోకి వచ్చాను. 'సాక్షి' రామ్ వద్ద రెండు చిత్రాలకు పనిచేశాను. ఆతర్వాత యాడ్ ఫిల్మ్స్ చేశాను. 'దూకుడు' చిత్రానికి స్క్రిప్ట్ విభాగంలో అసోసియేట్‌గా పనిచేశాను. అదేవిధంగా పాండవులు పాండవులు తుమ్మెద, యాక్షన్ త్రీడీ, బాద్‌షా, ఆగడు, బ్రూస్‌లీ చిత్రాలకు స్క్రిప్ట్ విభాగంలో పనిచేయడం జరిగింది.

కథ నచ్చి ఓకే అన్నారు... 'పటాస్' చిత్రం సమయంలో దర్శకుడు అనిల్ రావిపూడి ద్వారా హీరో కల్యాణ్‌రామ్‌తో పరిచయం ఏర్పడింది. ఆయన మంచి కథ ఉంటే చెప్పు సినిమా చేద్దామన్నారు. రెండేళ్ల తర్వాత 'ఎంఎల్ఎ' కథ చెప్పాను. కథ నచ్చి ఈ సినిమా చేయడానికి కల్యాణ్‌రామ్ ఓకే అన్నారు.

శ్రీనువైట్ల మెచ్చుకున్నారు... మంచి కమర్షియల్ సినిమాతోనే దర్శకుడిగా పరిచయం కావాలని ఈ కథను ఎంచుకున్నాను. శ్రీనువైట్ల సినిమా స్క్రిప్ట్ విని మెచ్చుకున్నారు. విడుదలైన అన్ని చోట్ల సినిమాకు మంచి స్పందన వస్తోంది. పలువురు దర్శకులు ఫోన్ చేసి ప్రశంసిస్తున్నారు.

హిట్ టాక్‌తో... ప్రేక్షకులను అలరించే అన్ని అంశాలు 'ఎంఎల్ఎ' చిత్రంలో ఉంటాయి. హిట్ టాక్‌తో థియేటర్లలో ఆడుతున్న ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు దక్కుతుండటం ఆనందంగా ఉంది. సినిమాలో ట్విస్టులు, డైలాగులు అందరినీ అలరిస్తున్నాయి. అలాగే పిల్లల విద్య గురించి చర్చించుకుంటున్నారు.

ఆ చిత్రాలే ఇష్టం... నాకు కుటుంబ కథా చిత్రాలు, భావోద్వేగాలతో కూడిన వినోదాత్మక చిత్రాలు చేయడమంటే ఇష్టం. ఇక నా నెక్స్ట సినిమాను కూడా పీపుల్ మీడియా, బ్లూ ప్లానెట్ బ్యానర్స్‌లోనే చేస్తాను.


రామమోహన్‌రావు, వరప్రసాద్ వరికూటి

కథ, స్క్రీన్‌ప్లే హైలైట్స్‌గా...

నందు, సౌమ్య వేణుగోపాల్, పూజ రామచంద్రన్ హీరోహీరోయిన్లుగా హరహర చలన చిత్ర సమర్పణలో ఎస్.శ్రీకాంత్ రెడ్డి, రామమోహనరావు ఇప్పిలి నిర్మిస్తున్న చిత్రం 'ఇంతలో ఎన్నెన్ని వింతలో'. వరప్రసాద్ వరికూటి దర్శకత్వం వహించిన ఈ చిత్రం అన్ని కార్యకార్యక్రమాలను పూర్తిచేసుకొని ఏప్రిల్ 6న విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో నిర్మాత రామమోహనరావు మాట్లాడుతూ ''ఇటీవల ఈ చిత్రంలోని మూడు పాటలు ఎఫ్ఎం రేడియో ద్వారా విడుదలయ్యాయి. పాటలకు మంచి స్పందన వస్తోంది. నలుగురి మధ్య ఉత్కంఠభరితంగా సాగే కథే ఈ చిత్రం. సినిమా చూసిన ప్రేక్షకులకు ఫ్రెష్ ఫీలింగ్ కలుగుతుంది''అని అన్నారు. దర్శకుడు వరప్రసాద్ వరికూటి మాట్లాడుతూ ''దర్శకుడిగా ఇది నా మొదటి చిత్రం. కథ, స్క్రీన్‌ప్లే ఈ చిత్రానికి హైలైట్స్‌గా ఉంటాయి. ప్రేక్షకునికి కావాల్సిన అన్ని అంశాలు ఈ సినిమాలో ఉంటాయి. తప్పకుండా సినిమా విజయం సాధిస్తుందన్న నమ్మకముంది''అని చెప్పారు. గగన్ విహారి, ఆర్.కె, మీనా ప్రధాన తారాగణంగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరాః ఎస్.మోహన్ రెడ్డి, సంగీతంః యాజమాన్య, ఎడిటింగ్ః ఛోటా కె.ప్రసాద్, మాటలుః కె.వి.రాజమహి, మధు శ్రీనివాస్ గోపాలుని, కొరియోగ్రఫీః విఘ్నేశ్వర, పాటలుః సురేష్ ఉపాధ్యయ.



భారత్ ఎగుమతులు పెంచుకోవాలి: సురేశ్ ప్రభు

న్యూఢిల్లీ: అమెరికా రక్షణాత్మక విధానాలను అనుసరిస్తున్న నేపథ్యంలో అంతర్జాతీయ వాణిజ్యం పెను సవాళ్లను ఎదుర్కొంటోందని, ఈ నేపథ్యంలో భారత్ ఎగుమతులు పెరిగేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి సురేశ్ ప్రభు అన్నారు. చైనా సహా అన్ని ప్రధాన వర్తక భాగస్వాములకు వ్యతిరేకంగా అమెరికా కఠిన చర్యలు తీసుకుంటోందని ఆయన చెప్పారు. చైనా దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 6,000 కోట్ల డాలర్ల దిగుమతి సుంకాలను విధించారు. అంతేకాకుండా ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై సుంకాలను పెంచారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ వాణిజ్యంలో నెలకొన్న సవాళ్లను సురేశ్ ప్రభు ప్రస్తావించారు. 'ఏ దేశమైన ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే మనం దాన్ని గమనిస్తాం. అంతేకాక తగిన చర్యలు చేపడతాం' అని ఆయన అన్నారు. అయితే ఆయన భారత్ ఎలా ప్రతిపందించనున్నదన్నది వివరించలేదు. కానీ రక్షణ విధానాలకు వ్యతిరేకంగా డబ్ల్యుటిఒలో పోరాడతామని మన అధికారులు అన్నారని ఆయన తెలిపారు

రూ. 28.33 లక్షల కోట్లు ఆవిరి



- 500 మంది ప్రపంచ సంపన్నులు విలవిల
- ఏడవ స్థానానికి దిగజారిన జుకర్‌బర్గ్
- అమెరికా స్టాక్ సూచీలు భారీగా పతనం
- కుబేరులను దెబ్బతీసిన ప్రపంచ మార్కెట్ల సుంకాల పెంపు

వాషింగ్టన్: ప్రపంచ సంపన్నులకు 2018 అంతగా కలిసొచ్చినట్లు లేదు. వరుస పరిణామాల నేపథ్యంలో ప్రపంచ మార్కెట్లు కుదేలవడంతో సంపన్నుల లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరైంది. ఈ ఏడాది జనవరి 26 నుంచి ఇప్పటివరకు టాప్ 500 ప్రపంచ కుబేరులు 436 బిలియన్ డాలర్లు నష్టపోయారు. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ. 28.33లక్షల కోట్లకు పైమాటే. ఒక్క ఈ వారంలోనే ఆ 500మంది 181 బిలియన్ డాలర్ల నష్టాలను చవిచూశారు. ఇందులో ఎక్కువగా సోషల్ మీడియా సంస్థ ఫేస్‌బుక్ అధినేత మార్క్ జుకర్‌బర్గ్ నష్టపోయారు.
జనవరి 26 నుంచి జుకర్‌బర్గ్ 10.3 బిలియన్ డాలర్ల సంపద కోల్పోయారు. దీంతో బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ సూచీలో జుకర్‌బర్గ్ 4వ స్థానం నుంచి ఏడో స్థానానికి పడిపోయారు. కుంభకోణం వివాదం ఫేస్‌బుక్‌ను చుట్టుకోవడంతో అతడు ర్యాంకింగ్‌లో మూడు స్థానాలు కిందికి దిగజారాడు. 5 కోట్ల ఫేస్‌బుక్ యూజర్ల డేటాను కేంబ్రిడ్జి అనలిటిక దుర్వినియోగం చేసిందన్న వార్తలు రావడంతో ఫేస్‌బుక్ సంస్థ షేర్లు 14 శాతం పతనమయ్యాయి.
ఇక ఒరాకిల్ కార్పొరేషన్ సహ వ్యవస్థాపకుడు ల్యారీ ఎల్లిసన్ 7 బిలియన్ డాలర్లు నష్టపోయారు. బెర్క్‌షైర్ హాత్‌వే ఛైర్మన్ వారెన్ బఫేట్, అమెజాన్ అధినేత జెఫ్ బెజోస్, ఆల్ఫాబెట్ సిఇఒ ల్యారీ పేజ్ సంయుక్తంగా 17 బిలియన్ డాలర్లు కోల్పోయారు. దీంతో బ్లూమ్‌బర్గ్ సూచీ ప్రకారం 500 ప్రపంచ కుబేరుల మొత్తం సంపద 5.2 ట్రిలియన్ డాలర్లుగా ఉంది.ఫిబ్రవరిలో క్రెడిట్ రేటింగ్ పెంచడంతో అమెరికా మార్కెట్లు భారీగా పతనమయ్యాయి.
అమెరికా స్టాక్ మార్కెట్ సూచీలు– ఎస్ అండ్ పి 500సూచీ, డో జోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ రెండేళ్లకైపైగా కాలంలో ఒకే వారంలో భారీగా పతనమయ్యాయి. ప్రపంచ మార్కెట్లో సుంకాల పెంపకం కారణంగా ఈ వారంలోనే 500 మంది ప్రపంచ సపన్నుల 181 వందల కోట్ల డాలర్లు ఆవిరయిపోయాయి.

నీరవ్ మోడీ ఆస్తులు జప్తు



న్యూఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ. 14,500 కోట్ల మేరకు మోసగించిన కేసులో ప్రధాన నిందితుడు వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ ఇళ్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) అధికారులు మళ్లీ సోదాలు చేపట్టారు. ఇందులో భాగంగా ముంబయిలోని ఆయన సముద్ర మహల్ లగ్జరీ రెసిడెన్షియల్ ఫ్లాట్‌లో మూడు రోజులపాటు ఇడి, సిబిఐ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తాజాగా జరిపిన సోదాలో భారీగా వజ్రాభరణాలు, ఖరీదైన వాచీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు ప్రముఖ చిత్రకారులు అమృత్ షేర్‌గిల్, ఎం.ఎఫ్.హుస్సేన్, కె.కె. హెబ్బర్ గీసిన చిత్రాలను గుర్తించారు. వీటి విలువ మొత్తం సుమారు రూ. 36 కోట్ల మేరకు ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. వీటితో పాటు రూ. 15 కోట్ల విలువైన ఆభరణాలు, రూ. 1.4 కోట్ల విలువచేసే ఖరీదైన వాచీలు ఉన్నాయి. స్వాధీనం చేసుకున్న ఆభరణాల్లో ఒక వజ్రపు ఉంగరం ధరే రూ. 10 కోట్లు ఉంటుంది. ఇప్పటివరకు ఇడి, సిబిఐ అధికారులు రూ. 7638 కోట్ల విలువైన బంగారం, వజ్రాలు, ఇతర ఆస్తులను జప్తు చేశారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఇడి 251 ఆస్తులు సోదా చేసింది.

దిగుమతి సుంకం తగ్గింపు



న్యూఢిల్లీ: ఎల్‌సిడి, ఎల్ఇడి టెలివిజన్ ప్యానెల్ల తయారీలో ఉపయోగించే 'ఓపెన్ సెల్' పై ప్రభుత్వం 5 శాతం దిగుమతి/కస్టమ్స్ సుంకాన్ని తగ్గించింది. దేశీయ తయారీకి ఊతం ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్(సిబిఇసి) తన ప్రకటనలో పేర్కొంది. ఎల్‌సిడి/ఎల్‌ఇడి టివి ప్యానెల్లపై 15 శాతం దిగుమతి సుంకాన్ని బడ్జెట్‌లో ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు దేశీయ తయారీకి ఊతం ఇవ్వడానికి ఈ చర్య తీసుకుందని నిపుణులు చెప్పారు. 'ఎల్‌సిడి ప్యానెల్ల తయారీలో ఉపయోగించే ఓపెన్ సెల్స్‌పై 5శాతం కస్టమ్స్ డ్యూటీ అన్నది ఛాప్టర్ 8529లో పేర్కొన్న ఇతర ఐటమ్స్ కన్నా తక్కువ, అయితే ఈ దిగుమతి సుంకం తగ్గింపు చర్య భారత్‌లో అలాంటి ప్యానెల్స్ తయారీని ప్రోత్సహించడానికే అన్నది స్పష్టం' అని డెల్లాయిట్ ఇండియా సీనియర్ డైరెక్టర్ ఎం.ఎస్. మణి చెప్పారు.

ప్యాకేజింగ్ చట్టానికి సన్నాహాలు

హైదరాబాద్: దేశీయంగా ప్యాకేజింగ్ చట్టం తెచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ (ఐఐపి) డైరెక్టర్ ఎన్‌సి సాహ తెలిపారు. ఆహార ఉత్పత్తుల ప్యాకేజింగ్ భద్రతకు సంబంధించి తాము ప్రత్యేక అధ్యయనాన్ని నిర్వహించామని, ఇందుకు సంబంధించిన వివరాలను భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఎఐ)కు సమర్పించామని చెప్పారు. ప్యాకేజింగ్ చట్టానికి సంబంధించి ముసాయిదాపై అన్ని వర్గాలు అభిప్రాయాలు తెలియజేస్తున్నాయన్నారు. దీనికి ఎఫ్ఎస్ఎస్ఎఐతోపాటు పార్లమెంట్ ఆమోదం లభిస్తే చట్టంగా మారే అవకాశం ఉందని చెప్పారు. ప్యాకేజింగ్ చట్టం ద్వారా ఉత్పత్తుల వినియోగదారులకు మరింత భద్రత లభిస్తుందన్నారు. 'ప్యాకేజింగ్ ఫర్ న్యూ మిలీనియమ్'పై శుక్రవారంనాడిక్కడ రెండు రోజుల సదస్సు ప్రారంభమైన సందర్భంగా సాహ మాట్లాడారు. ఐఐపి విస్తరణలో భాగంగా బెంగళూరు, గువహతి, కాకినాడ, అహ్మదాబాద్‌లో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. . కాకినాడలో సెంటర్ ఏర్పాటుకు ఎపి ప్రభుత్వం 25 ఎకరాల స్థలాన్ని ఇచ్చినట్టు సాహ తెలిపారు. కర్ణాటక ప్రభుత్వ నాలుగు ఎకరాల స్థలం ఇచ్చిందని గుర్తు చేశారు. హైదరాబాద్‌లోని కేంద్రం విస్తరణకుగాను ఐదు ఎకరాల స్థలం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరామన్నారు. ప్రస్తుతం దేశీయ ప్యాకేజింగ్ మార్కెట్ 2,700 కోట్ల డాలర్లుగా ఉందని, 2020నాటికి 3,200 కోట్ల డాలర్లను తాకే అవకాశం ఉందని సాహ చెప్పారు.

రిలయన్స్ డిజిటల్ బహుమతుల ప్రదానం

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ, ఏపి, కర్నాటకలో నవంబర్ 27 నుండి ఈ ఏడాది జనవరి మధ్య నిర్వహించినట్లు లక్కీ డ్రాలో గెలుపొందిన విజేతలకు రిలయన్స్ డిజిటల్ బహుమతులను ప్రదానం చేసింది. మారేడ్‌పల్లి రిలయన్స్ డిజిటల్ స్టోర్‌లో శనివారం గ్రాండ్ ప్రైజ్‌గా మారుతి సియాజ్ కారును నగరానికి చెందిన ప్రణయ్‌కు అందించింది. ఈ లక్కీ డ్రాలో 55 వేలకు పైగా కష్టమర్లు పాల్గొన్నట్లు ప్రకటనలో వెల్లడించింది.

పిఎన్‌బి 'మిషన్ పరివర్తన్'

పది అంచెల వ్యూహం

న్యూఢిల్లీ: వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, ఆయన మామ మెహుల్ చోక్సీ ఆధ్వర్యంలోని వివిధ సంస్థలకు వేలాది కోట్ల రూపాయల రుణాలిచ్చి దారుణంగా మోసపోయిన పంజాబ్ నేషనల్ బ్యాంకు (పిఎన్‌బి) మున్ముందు ఇటువంటి కుంభకోణాలు జరుగకుండా నిరోధించేందుకు 'మిషన్ పరివర్తన్'పేరుతో పది అంచెల వ్యూహానికి శ్రీకారం చుట్టింది. లాభాలను గరిష్ఠ స్థాయికి తీసుకెళ్లడం, ఆస్తుల నాణ్యతను, రుణాల వసూళ్లను, ఉత్పాదకతను పెంపొందించుకోవడం, రిటైల్ వ్యాపారాన్ని పెంపొందించుకునేందుకు కొత్త పద్ధతులను పాటించడం, తప్పులను, ఫిర్యాదులను తగ్గించుకుని సరికొత్త నిఘా పద్ధతులను అవలంబించడం ఈ వ్యూహంలో ముఖ్యాంశాలని పిఎన్‌బి ఒక ప్రకటనలో వివరించింది.

హుందాయ్ మెగా ఎక్స్ఛేంజ్ కార్నివాల్




మన తెలంగాణ / హైదరాబాద్ : హుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ 'మెగా ఎక్స్ఛేంజ్ , యూజ్డ్ కార్ కార్నివాల్'ను ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహిస్తోంది. ఈ ఎక్స్ఛేంజ్‌స్కీమ్ ద్వారా వినియోగదారులు తమ పాత కార్లను ఇచ్చి నూతనంగా విడుదలైన పలు మోడళ్ళ కొత్త కార్లను తీసుకోవచ్చని ఆ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొనింది. వినియోగదారులు ఎంతో ఆసక్తిని కనబరుస్తున్న 'నెక్స్ జెన్ వెర్నా', '2017 న్యూ గ్రాండ్ ఐ 10', 'న్యూ ఎక్సెంట్', 'ద న్యూ ఎలైట్ ఐ 20' వంటి మోడళ్లను వినియోగదారుల సౌలభ్యం కోసం హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో వారికి సమీపంలోనే పాత వాహనాలను ఇచ్చి తీసుకోవచ్చని వెల్లడించింది. నచ్చిన మోడల్స్ కార్ల ప్రదర్శనతో పాటు టెస్ట్ డ్రైవ్‌కు అనువైన స్థలాల్లోనే ఈ మేళాలను నిర్వహిస్తున్నట్లు తెలిపింది. భారీ డిస్కౌంట్లను కూడా కల్పిస్తున్నట్లు స్పష్టం చేసింది. కొత్త కార్లపై రూ. 75 వేల వరకు లాభం పొందవచ్చని, ఎక్స్ఛేంజ్ బోనస్‌గా రూ. 70 వేల వరకు లబ్ధి చేకూరనుందని పేర్కొనింది.

హైదరాబాద్ నగరంలో ఈ మేళా జరిగే ప్రాంతాలు

- కొత్తపేట అష్టలక్ష్మి దేవాలయం(వాసవి కాలని సమీపాన లక్ష్మీ హుందాయ్ షో రూం
- తల్వార్ హుందాయ్ ప్రగతినగర్ గ్రౌండ్స్
- కున్ హుందాయ్ , మ్యాక్స్ అపెరల్స్ దగ్గర, టెలికం నగర్ , గచ్చిబౌలి
- సబూ హుందాయ్, మానస సరోవర్ హైట్స్ ఫేస్–2, మనోవికాస్ నగర్., సికింద్రాబాద్
- ఫ్యూషిన్ హుందయ్ , సిల్వర్ స్ప్రింగ్స్ అపార్ట్‌మెంట్ , సాయి నగర్, నియర్ గవర్నమెంట్ వెటర్నరీ హాస్పిటల్ చింతల్ .

ఆ నాలుగు బ్యాంకులు విలీనం కావు



న్యూఢిల్లీ: మరి నాలుగు ప్రభుత్వ రంగ బ్యాంకులను విలీనం చేయబోతున్నట్లు వస్తున్న వార్తలపై నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ప్రస్తుతానికి అలాంటి ప్రతిపాదనేదీ లేదని కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి శివ్‌ప్రతాప్ శుక్లా లోక్‌సభకు ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో పేర్కొన్నారు. భారతీయ మహిళా బ్యాంకు, మరి ఐదు బ్యాంకులను గతేడాది స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బిఐ)లో విలీనం చేసిన విషయం తెలిసిందే. అయితే ఇదే తరహాలో సిండికేట్ బ్యాంక్, కెనరా బ్యాంక్, విజయ బ్యాంక్, దేనా బ్యాంక్‌లను విలీనం చేస్తారని ఇటీవల వార్తలు వచ్చాయి. దీనిపై నేడు కేంద్రమంత్రి శుక్లా స్పష్టతనిచ్చారు. ప్రస్తుతానికి బ్యాంకుల నుంచి అలాంటి ప్రతిపాదనేదీ లేదని తెలిపారు. ఈ విషయాన్ని ఆ నాలుగు బ్యాంకులే ఆర్థిక శాఖకు చెప్పినట్లు పేర్కొన్నారు.

15 నెలల గరిష్ఠానికి బంగారం ధర

చైనా, అమెరికా వాణిజ్య యుద్ధమే కారణం



న్యూఢిల్లీ: అంతర్జాతీయ వాణిజ్య యుద్ధం అమెరికా, చైనాల మధ్య నెలకొన్న నేపథ్యంలో బంగారం ధర 15 నెలల గరిష్ఠానికి చేరకుంది. ప్రపంచవ్యాప్తంగా బంగారానికి డిమాండ్ పెరిగింది. శనివారం బంగారం ధర రూ. 85 పెరిగడంతో 10 గ్రా. బంగారం ధర నెల గరిష్ఠానికి అంటే రూ. 31,835కు చేరుకుంది. బంగారం బాటలోనే వెండి ధర కూడా పయనించింది. వెండి ధర రూ. 50 పెరగడంతో కిలో వెండి ధర రూ. 39,600గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర పెరిగింది. న్యూయార్క్‌లో ఔన్స్ బంగారం ధర 1.37 శాతం పెరిగి 1,346.80 డాలర్లు పలికింది. వెండి కూడా 1.13 శాతం పెరిగి ఔన్స్ ధర 16.53 డాలర్లు పలికింది. ఇదిలా ఉండగా అమెరికా, చైనా వాణిజ్య యుద్ధ భయాల కారణంగా డాలరు పతనమైంది.
దీంతో మదుపరులు ఆందోళనపడుతున్నారు. దౌత్యవేత్త, అటార్నీ జాన్ బోల్టన్‌ను తన కొత్త జాతీయ భద్రతా సలహాదారుగా నియమించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయించడంతో మార్కెట్‌లో నష్టభయం(రిస్క్) మరింత పెరిగింది. చైనా నుంచి దిగుమతయ్యే సరుకులపై 60 వందల కోట్ల సుంకాన్ని విధించే మెమోరాండంపై గురువారం ట్రంప్ సంతకం కూడా చేశారు. సుంకాలకు 30 రోజుల సంప్రదింపుల వ్యవధి ఉంటుంది. ప్రజలు వ్యాఖ్యలు చేసేందుకు ఈ సమయాన్ని ఇచ్చారు. కానీ ఇది వాణిజ్య యుద్ధంగా మారగలదని మదుపరులు ఆందోళ చెందుతున్నారు. చైనా మేధో సంపత్తి చోరీకి పాల్పడిందన్న ఆరోపణపై ట్రంప్ ఈ సుంకాలను ప్రతిపాదించారు. చైనా వాణిజ్య విధానాలు అమెరికా కంపెనీల మేధోసంపత్తి విధానాలను దోచుకునేలా ఉన్నాయని ట్రంప్ పాలకవర్గం చెబుతోంది. అమెరికా ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యుటిఒ) వద్ద కూడా ఫిర్యాదు చేసింది.

త్వరలో మార్కెట్‌లోకి బజాజ్ పల్సర్ 150



పుణె: బజాజ్ ఆటో త్వరలో మెకానికల్లీ అప్‌డేటెడ్ బజాజ్ పల్సర్ 150ని మార్కెట్‌లోకి ప్రవేశపెట్టనున్నది. ఈ మోడల్ ఇంకా మార్కెట్‌లోకి రాకముందే దాని ధర ఎంతో వెల్లడయింది. బెంగళూరులో అధికారిక షోరూమ్ ధర రూ. 78,234 అని తెలుస్తోంది. ఇప్పుడున్న పల్సర్ కన్నా 2018 మోడల్ రూ. 3584 ఎక్కువ అని సమాచారం. రెండు రంగుల్లో ఇది లభ్యం కానున్నది. బజాజ్ కొత్త పల్సర్ 150 సుజుకీ గిక్సర్, హోండా యునికార్న్, హీరో ఎక్స్‌ట్రీంలలో ఉండే హంగులు కలిగి ఉంటుంది. పల్సర్ 150కి రియర్ డిస్క్ బ్రేక్, స్ప్లిట్ సీటు ఉంటాయి. యాంత్రికంగా పల్సర్ 150 అప్‌డేటెడ్ వర్షన్, దీనికి అదే 149 సిసి సింగిల్ సిలిండర్, డిటిఎస్–ఐ ఇంజిన్ ఉంటాయి.

విదేశీ సౌర ఫలకాలపై విచారణ రద్దు



న్యూఢిల్లీ: చైనా, తైవాన్, మలేసియా నుంచి దిగుమతయ్యే సౌర ఫలకాలపై యాంటీ డంపింగ్ దర్యాప్తును వాణిజ్య మంత్రిత్వ శాఖకు చెందిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ యాంటీ–డంపింగ్ అండ్ అలైడ్ డ్యూటీస్(డిజిఎడి) రద్దు చేసింది. సౌర ఫలకాల భారతీయ తయారీ సంఘం కోరిక మేరకే ప్రస్తుతం ఈ దర్యాప్తును రద్దు చేసినట్లు పేర్కొంది. అదే సంఘం చేసిన ఫిర్యాదు మేరకు జులై 21న డిజిఎడి దర్యాప్తును ఆరంభించింది. ఇదిలా ఉండగా ఈ దేశాల నుంచి సౌర ఫలకాల దిగుమతి ఈ మధ్య కాలంలో బాగా పెరిగింది. యాంటీ డంపింగ్ దర్యాప్తు 2016 ఏప్రిల్ నుంచి 2017 జూన్ వరకు(15 నెలలు) కొనసాగింది. చైనా, ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతున్న రసాయనాలు, స్టీల్ ఉత్పత్తులు వంటి అనేక వస్తువులపై కూడా డిజిఎడి దర్యాప్తును కొనసాగిస్తున్నది. ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యుటిఒ) పాలన కింద యాంటీ–డంపింగ్ విధించడం అనుమతియోగ్యమే.

సావ్న్‌తో జియో మ్యూజిక్ విలీనం

ఒప్పందంపై సంతకం చేసిన రిలయన్స్



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ మ్యూజిక్ యాప్ సావ్న్‌తో జియో మ్యూజిక్ విలీన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ విషయాన్ని ముఖేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ప్రకటించింది. సావ్న్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ 104 మిలియన్ వాటాలు కొనబోతోంది. ఈ జియో–సావ్న్ మ్యూజిక్ విస్తరణకు 100 మిలియన్ డాలర్లను పెట్టుబడిగా పెట్టనుంది. సావ్న్‌లో రిలయన్స్ పాక్షికమైన వాటానే కొనబోతోంది. వాటాదారుల్లో టైగర్ గ్లోబల్ మేనేజ్‌మెంట్, లిబర్టీ మీడియా, బెర్టెల్స్‌మన్ కూడా ఉన్నాయి. సావ్న్ వ్యవస్థాపకులు రుషి మల్హోత్రా, ప్రదీప్ సింగ్, వినోద్ భట్ ఎప్పటిలాగే నాయకత్వం నిర్వహించనున్నారు. భారత్‌లో ఆడియో స్ట్రీమింగ్ మార్కెట్ ఊపందుకుంటున్న దశలో జియో–సావ్న్ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంతో జియో ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో మరింత బలపడనున్నదని తెలుస్తోంది. గత నెల జియో సినీ నిర్మాణ సంస్థ ఎరోస్‌లో 5 శాతం వాటా కూడా కొనుగోలు చేసింది. గత ఎనిమిది నెలల్లో బలాజీ టెలిఫిల్మ్స్, రాయ్ కపూర్ ఫిల్మ్స్ నిర్మాణ సంస్థల్లో కూడా వాటాలు కొన్నది. రిలయన్స్ తన ఎల్‌టిఇ మొబైల్ నెట్‌వర్క్ ఆపరేటర్ రిలయన్స్ జియోను 2016లో ఆరంభించింది. కాలక్రమేణ జియో మార్కెట్‌లోకి మరింత చొచ్చుకుపోనుందని భావిస్తున్నారు.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29570	31625.67	0.61%
ముంబై	29990	32074.87	0.03%
ఢిల్లీ	30200	32299.47	0.83%
కోల్‌కతా	30460	32577.54	0.33%
కేరళ	28550	30534.76	0.88%
బెంగళూరు	28570	30556.15	0.42%
హైదరాబాద్	29570	31625.67	0%
గల్ఫ్	1430.78	1530.25	1.31%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	శుక్రవారం	గురువారం	మార్పు (%)
చెన్నై	41100.00	41300.00	–0.48
ముంబై	41100.00	41300.00	–0.48
ఢిల్లీ	41100.00	41300.00	–0.48
కోల్‌కతా	41100.00	41300.00	–0.48
హైదరాబాద్	41100.00	41300.00	–0.48

కోడిగుడ్లు (100కు) నెక్ రేటు



హైదరాబాద్	300	విశాఖపట్నం	325
వరంగల్	317	చిత్తూరు	363
విజయవాడ	310	చెన్నై	370
గోదావరి	310	బెంగళూరు	350

మానవ అక్రమ రవాణా అతిపెద్ద విషాదం



న్యూఢిల్లీ : మానవ అక్రమ రవాణా అనేది అతిపెద్ద మానవ విషాదమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) దీపక్ మిశ్రా అన్నారు. ఈ రవాణా రోజురోజుకూ పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పనికి పాల్పడుతున్న వారు మనుషులను వస్తువులుగా భావిస్తున్నారని అన్నారు. 'మానవ అక్రమ రవాణాపై అంతర్జాతీయ సెమినార్'లో ఆయన మాట్లాడుతూ ఈ మానవ అక్రమ రవాణాను అడ్డుకునేందుకు యువతరం నడుం బిగించాలని పిలుపునిచ్చారు. 'మానవ అక్రమ రవాణా అతిపెద్ద మానవ విషాదంగా మారింది. ఇది అంతకంతకూ పెరిగిపోతోంది. దీన్ని నివారించాలి. ఇందుకు యువత ముందుకు రావాలి. మానవ అక్రమ రవాణా ప్రస్తుత, భవిష్యత్ తరాలకు పెనుముప్పుగా పరిణమిస్తున్నది' అని మిశ్రా పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణా అనేది గతంలో బానిసత్వంగా ఉండేదని, ఇప్పుడు అది మరో కోణంలో విస్తరిస్తున్నదని చెప్పారు. మనుషులను వస్తువుగా భావించడం అనేది ఓ రంగంగా మారిపోయిందని, అయితే ఇది కంటి కనిపించదని అన్నారు. నేపాల్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి సపన ప్రధాన్ మల్లా మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాకు టెక్నాలజీయే మార్కెట్‌ను సృష్టించిందని, ఇది బాధితులకు మరింత నష్టాన్ని కలిగిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే టెక్నాలజీ ఇదే సమయంలో ప్రజలు, అధికారులకు మరింత శక్తిని సమకూర్చుతోందని కూడా చెప్పారు.

అసోంలో దారుణ ఘటన

అసోం : అసోంలోని నాగవ్ జిల్లాలో శనివారం నాడు దారుణం చోటుచేసుకుంది. 5వ తరగతి చదువుతున్న 12 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం చేసిన ముగ్గురు యువకులు అనంతరం ఆమెకు నిప్పంటించారు. తీవ్రంగా కాలిన గాయాలతో ఉన్న ఆమెను ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు వెల్లడించారు. నిందితులు ముగ్గురూ ఆమె క్లాస్‌మేట్స్. కాగా, మైనర్లయిన ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని, మరో నిందితుడు జకీర్ హుస్సేన్ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. లాలుంగావ్ గ్రామంలోని తన ఇంట్లో బాలిక ఒంటరిగా ఉన్న సమయంలో ఈ ముగ్గురు యువకులు ఇంట్లోకి ప్రవేశించారు. సామూహిక అత్యాచారం చేశారు. అనంతరం ఆమెకు నిప్పటించారని ఎస్‌పి శంకర్ రాయ్‌మేది తెలిపారు. ఈ మేరకు మృతురాలి వాంగ్మూలాన్ని రికార్డు చేశామన్నారు. పరారీలో ఉన్న నిందితుడు కోసం గాలిస్తున్నామని, త్వరలోనే అరెస్టు చేస్తామని అన్నారు.

ఎన్‌డిఎకు జిజెఎం గుడ్‌బై



న్యూఢిల్లీ : గోర్ఖాల విశ్వాసాన్ని దెబ్బతీసి, నమ్మక ద్రోహానికి పాల్పడిందంటూ ఎన్‌డిఎకు గోర్ఖా జనముక్తి మోర్చా (జిజెఎం) గుడ్‌బై చెప్పింది. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎతో తమ పార్టీకి ఇక ఎలాంటి సంబంధాలు ఉండని జిజెఎం ఆర్గనైజింగ్ చీఫ్ ఎల్‌ఎం లామా తెలిపారు. జిజెఎంతో కేవలం ఎన్నికల పొత్తు మాత్రమే పెట్టుకున్నామని బిజెపి బెంగాల్ అధ్యక్షుడు దిలీప్ ఘోష్ చేసిన వ్యాఖ్యలతో తమ మనోభావాలను దెబ్బతీశాయని ఆయన పేర్కొన్నారు. ఘోష్ వ్యాఖ్యలు గోర్ఖాల పట్ల బిజెపి వైఖరిని స్పష్టం చేస్తున్నాయని, వారికి గోర్ఖాల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఆయన విమర్శించారు. డార్జిలింగ్ లోక్‌సభ స్థానాన్ని 2009, 2014లలో రెండుసార్లు బిజెపికి కానుకగా జిజెఎం ఇచ్చిందని, 2009లో బిజెపి అభ్యర్థికి జిజెఎం మద్దతుగా నిలువగా, 2014లోను తమ పార్టీ ఇదే వైఖరిని అవలంభించిదని ఆయన వెల్లడించారు. బిజెపికి డార్జిలింగ్ పొలిటికల్ గేట్‌వే అని, ఇది కేవలం జిజెఎం వల్లనే సాధ్యమైందని ఆయన చెప్పారు.

ఎంఎల్‌ఎను సస్పెండ్ చేసిన బిఎస్‌పి

న్యూఢిల్లీ : రాజ్యసభ ఎన్నికల్లో శుక్రవారం బిజెపి అభ్యర్థికి క్రాస్ ఓటింగ్ చేసిన ఎంఎల్‌ఎ అనిల్ సింగ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) అధినేత్రి మాయావతి తెలిపారు. సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి)తో తమ పార్టీ కొత్తగా ఏర్పర్చుకున్న సంబంధాలను తెంచేసేందుకు రాజ్యసభ ఎన్నికలను ఉపయోగించుకుందని ఆరోపించారు. శనివారం ఆమె ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో బిజెపి అధికార దుర్వినియోగానికి పాల్పడిందని, బిఎస్‌పి, ఎస్‌పి కూటమిలో విభేదాలు తెచ్చేందుకు యత్నించిందని ఆరోపించారు. అయితే, శుక్రవారం జరిగిన ఎన్నికలు బిఎస్‌పి, ఎస్‌పి కూటమి సంబంధాలపై ఏమాత్రం ప్రభావం చూపలేకపోయాయని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో బిజెపి అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగ పర్చిందని, భయాందోళనలు సృష్టించి క్రాస్ ఓటింగ్ జరిగేలా చేసిందని ధ్వజమెత్తారు.

కార్తి చిదంబరానికి మరో ఊరట

న్యూఢిల్లీ : ఇటీవల ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో ఊరట లభించిన కార్తీ చిదంబరానికి, ఎయిర్‌సెల్ మ్యాక్సిస్ కేసులో కూడా మరో ఊరట లభించింది. ఎయిర్‌సెల్ మ్యాక్సిస్ కేసులో ఏప్రిల్ 16 వరకు ఆయనను సిబిఐ, ఇడిలు అరెస్ట్ చేయకుండా ఢిల్లీ కోర్టు రక్షణ కల్పించింది. కార్తి చేసుకున్న యాంటిసిపేటరీ బెయిల్ విజ్ఞప్తిపై మూడు వారాల్లోగా వివరాలు అందజేయాలని సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)లను స్పెషల్ జడ్జి ఒపి సైని ఆదేశించారు. సిబిఐ, ఇడిల అనుమతి లేకుండా కార్తి దేశాన్ని విడిచి వెళ్లరాదని కూడా సూచించారు. ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో కార్తికి శుక్రవారం నాడు హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఎయిర్‌సెల్ మ్యాక్సిస్ కేసులో సిబిఐ, ఇడిలు తనను అరెస్టు చేయకుండా రక్షణ కల్పించాలని కోరుతూ కార్తి ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శనివారం జరిగిన ఈ విచారణలో కార్తి తరుపున వాదించిన కపిల్ సిబాల్, ఎయిర్‌సెల్‌మ్యాక్సిస్ కేసులో కార్తీకి వ్యతిరేకంగా ఎలాంటి ఆరోపణలు నమోదు కాలేదని పేర్కొన్నారు. తదుపరి విచారణను కోర్టు ఏప్రిల్ 16కు వాయిదా వేసింది.

ఎస్‌పి విజయోత్సవాలు రద్దు

లక్నో: తమ పార్టీ తరుపున జయాబచ్చన్ రాజ్యసభకు ఎన్నిక కావడంతో శనివారం లక్నోలో నిర్వహించ తలపెట్టిన విజయోత్సవాలను సమాజ్‌వాదీపార్టీ (ఎస్‌పి) ఉపసంహరించుకుంది. బిఎస్‌పి రాజ్యసభ సీటును కోల్పోవడంతో ఆ పార్టీకి సంఘీభావంగా ఎస్‌పి ఈ నిర్ణయం తీసుకుంది. బిజెపి అధికార దుర్వినియోగానికి పాల్పడి ఉండకపోతే బిఎస్‌పి అభ్యర్థి గెలిచేవారని పేర్కొంది. బిఎస్‌పి అభ్యర్థి భీంరావ్ అంబేడ్కర్ రాజ్యసభ సీటును కోల్పోడవంతో విజయోత్సవాలను పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ రద్దు చేసినట్లు ఎస్‌పి అధికార ప్రతినిధి సునిల్ సింగ్ సజన్ తెలిపారు. దీనిపై బిఎస్‌పి కూడా సానుకూలంగా స్పందించింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సతీష్ మిశ్రా మాట్లాడుతూ ఎస్‌పి తమకు ఓటేసిందని, అయితే తమ అభ్యర్థులను ఓడించేందుకు బిజెపి అధికార దుర్వినియోగానికి పాల్పడిందన్నారు. ఎస్‌పితో పొత్తులపై ఏ నిర్ణయమైన పార్టీ అధ్యక్షురాలు మాయవతి తీసుకుంటారని మిశ్రా తెలిపారు. జైలులో ఉన్న తమ పార్టీ అభ్యర్థి ముఖ్తార్ అన్సారీని ఓటు వేసేందుకు అనుమతివ్వలేదని మిశ్రా పేర్కొన్నారు. ప్రతిష్ఠాత్మకమైన గోరఖ్‌పూర్, ఫుల్పూరు లోక్‌సభ ఉప ఎన్నికల్లో గెలిచిన వెంటనే తాము రాజ్యసభ ఎన్నికల్లో బిఎస్‌పి అభ్యర్థి గెలిచేందుకు కృషి చేస్తామని ఎస్‌పి ప్రకటించింది.

జెడిఎస్ అంటే 'జనతాదళ్ సంఘ్‌పరివార్'

మాలవల్లి: మాజీ ప్రధాని దేవేగౌడకు చెందిన జనతాదళ్ (సెక్యులర్)ను కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. శనివారం నాలుగో విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా మాండ్య జిల్లాలో వక్కలిగుల జనాభా అధికంగా ఉండే ప్రాంతంలో ప్రసంగించారు. పాత మైసూర్‌లో కాంగ్రెస్‌కు గట్టి పోటీనిచ్చే జెడిఎస్‌పై ఆయన ధ్వజమెత్తారు. గతంలో జెడిఎస్ అంటే జనతాదళ్ సెక్యూలర్ అని, ఇప్పుడు కొత్తగా జెడిఎస్ 'జనతాదళ్ సంఘ్ పరివార్'గా మారిందని రాహుల్ అభివర్ణించారు. అసెంబ్లీ ఎన్నికల్లో రెండు సిద్ధాంతాలు మాత్రమే పనిచేస్తాయన్నారు. ఒక వైపు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు మరో వైపు కాంగ్రెస్ పోటీ పడుతుందని ఆయన పేర్కొన్నారు. జనతాదళ్ సెక్యులర్ బిజెపికి చెందిన 'బి టీమ్' అని అది వారికే మద్దతిస్తుందని ఆయన ఎద్దేవా చేశారు. 12 వ శతాబ్దానికి చెందిన సంఘ సంస్కర్త బసవన్న, గాంధీ సిద్ధాంతాలను కాంగ్రెస్ నమ్ముతుందన్నారు. తన 2రోజుల పర్యటనలో రాహుల్ మాండ్య, మైసూరు, చామరాజనగర్ జిల్లాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు.



మరికి నీరే గతి

● ఆదిలాబాద్ జిల్లాలో విషమ స్థాయికి నీటి ఎద్దడి



మనతెలంగాణ/ ఆదిలాబాద్ ఆదిలాబాద్ జిల్లాలో తాగు నీటి ఎద్దడి రోజురోజుకు తీవ్రమవుతోంది. ఏజెన్సీ ప్రాంతాలలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. జిల్లా అధికార యంత్రాంగమే జిల్లాలో 165 గ్రామాలలో నీటి ఎద్దడి తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు గుర్తించి ఆయా గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా ప్రకటించిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదిలా ఉంటే గోండు గూడేల్లోని ప్రజలు గుట్టలు, కొండలను దాటుకుంటూ కిలోమీటర్ల మేర నడుస్తూ వెళ్లి నీళ్లను తెచ్చుకోవాల్సి వస్తుంది. గ్రామాలలో ఇప్పటికే నీటి కోసం బిందెలు పట్టుకొని మహిళలు సుదూర ప్రాంతాలకు వెళ్తున్నారు. కొన్ని గ్రామాలలో బోర్లలో నీళ్ల లేక, మరికొన్ని ప్రాంతాలలో బావులు ఎండిపోయి వేసవి ప్రారంభంలోనే నీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇక కొందరు ఎడ్ల బండ్లలో డ్రమ్ములతో సమీపంలో అందుబాటులో ఉన్న వ్యవసాయ బావుల నుంచి మంచినీరు తెచ్చుకుంటున్నారు. ఎండాకాలం అంతా తాగేందుకు నీటి కోసం అవస్థలు పడక తప్పదని అంటున్నారు. ఇప్పటికే జిల్లాలో భూగర్భ జలాలు 8.52 మీటర్ల లోతుకు పడిపోయాయి. నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని అధికారులు జిల్లాలో 165 గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. వీటితో పాటు మరిన్ని గ్రామాలలో నీటి ఎద్దడి సమస్య తీవ్రంగా ఉండే అవకాశాలున్నాయని అంటున్నప్పటికీ అధికార యంత్రాంగం మాత్రం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని చెప్పుకుంటూ చేతులు దులుపుకుంటోంది. ఇక నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేందుకు సకాలంలో చర్యలు తీసుకోకపోవడంతో కలుషితమైన నీటిని వాడుకోవాల్సి వస్తుంది. జిల్లాలో పలు గ్రామాలలో పరిస్థితి దయనీయంగా మారడంతో ప్రజలంతా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. చెలిమెలు, ఊట బావులలో నీటిని వినియోగించడం ద్వారా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆందోళనకు లోనవుతున్నారు. నార్నూర్, గాదిగూడ మండలాల్లో పరిస్థితి తీవ్రత ఎక్కువగా ఉంది. చోర్‌గావ్, సుంగాపూర్, మాదాపూర్, మల్కుగూడ, ఎంపెల్లి, పిప్రి, ముత్యంబట్టి, కొత్తపల్లి(జి), అర్జున్‌వాడ, మేడిగూడ గ్రామాలలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉండగా, గణేష్‌పూర్, సుంగాపూర్, కొలంగూడ వాసులు చెలిమె నీరు తాగుతున్నారు. ఇక తలమడుగు మండలం పల్లి(బి) గ్రామంలో మార్చి ప్రారంభం నుంచే నీటి ఎద్దడి తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం నీటిని సరఫరా చేయడంపై దృష్టి సారించడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. సిరికొండ మండలం వాయిపేట్ పంచాయతీ పరిధిలోని చెమ్మన్‌గుడి, నేరడిగొండ గ్రామపంచాయతీ పరిధిలోని బుర్సుగుట్ట, రాంపూర్ పంచాయతీ పరిధిలోని లక్కంపూర్ గ్రామాలలో నీటి కోసం ప్రజలు అల్లాడాల్సి వస్తుంది. ఇదిలాఉంటే బజార్ హత్నూర్ మండలం భూతాయి(కే) గ్రామ పంచాయతీ పరిధిలోని గిరిజాయిలో ఉన్న రెండు చేతి పంపులు పని చేయకపోవడంతో గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలోని బావి నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇక ఉట్నూర్ మండలం దంతన్‌పల్లి పంచాయతీ పరిధిలోని సోనాపూర్ గ్రామంలోని బోర్లలో నీరు కలుషితం కావడంతో ట్యాంకు అలంకారప్రాయంగా మారింది. ఆదిలాబాద్ మండలంలోని పలు గ్రామాలు సైతం నీటి ఎద్దడి సమస్యను ఎదుర్కొంటున్నాయి. పిప్పల్‌ధరి గ్రామ పంచాయతీ పరిధిలోని మామిడికొర్రి గ్రామంలో ఉన్న బోరు బావిలో నీళ్ల అడుగంటిపోవడంతో వాగు నీటిని వినియోగించుకుంటూ వచ్చారు. ఈ వాగు సైతం అడుగంటి పోవడంతో వ్యవసాయ బావి నీటిని వినియోగించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాకేంద్రంలోని పలు కాలనీలలో సైతం నీటి సమస్య తీవ్రత పెరిగిపోతుంది. ఇప్పటికే కొన్ని కాలనీలలో ఇళ్లల్లోని బోర్లలో నీళ్లు అడుగంటిపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. శివారు ప్రాంత కాలనీలలో ఇప్పటికే బోరు బావుల వద్ద మహిళలు లైన్లు కట్టాల్సి వస్తుందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మున్సిపల్, మావల గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ట్యాంకర్లు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ ప్రజలకు అవసరం మేరకు నీటిని అందడం లేదని అంటున్నారు. జనాభాతో పాటు నీటి అవసరాలు పెరిగిపోవడం, భూగర్భ జలాలు కనిష్ట స్థాయికి పడిపోతుండడం, ఉష్ణోగ్రతలు రోజురోజుకు తీవ్రం కావడంతో నీటి ఎద్దడి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశాలున్నాయని అంటున్నారు. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంటున్నారు.







బిజెపి 69... కాంగ్రెస్ 50



న్యూఢిల్లీ : రాజ్యసభ తాజా ఎన్నికలతో అధికార బిజెపికి 11 సీట్ల లాభం దక్కింది. ఎగువ సభలో ఆధిక్యత కోసం బిజెపి ఆరాటపడుతోన్న విషయం తెలిసిందే. ఈ దశలో ఒకేసారి 58 ఖాళీల భర్తీకి ఎన్నికలు జరిగాయి. ఇందులో బిజెపికి అదనంగా 11 స్థానాలు వచ్చాయి. ఇదే సమయంలో కాంగ్రెస్ నాలుగు స్థానాలను నష్టపోయింది. ఇప్పుడు రాజ్యసభ బలాబలాలలో బిజెపి 69 సీట్లతో, కాంగ్రెస్ 50 సీట్లతో నిలిచాయి. ప్రత్యేకించి ఉత్తర ప్రదేశ్‌లో బిజెపి ప్రదర్శించిన రాజకీయ చతురత ఎగువ సభలో పార్టీ పటిష్టతకు దారితీసింది. బిజెపికి చెందిన 17 మంది సభ్యులు రిటైర్‌కాగా ఇప్పటి ఎన్నికలలో ఆ పార్టీకి చెందిన 28 మంది విజేతలుగా నిలిచారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ సభ్యులు 14 మంది వచ్చేవారం రిటైర్ కానుండగా ఇప్పటి ఎన్నికలలో పది మంది గెలిచారు. ఈ విధంగా నాలుగు స్థానాలను కాంగ్రెస్ పోగొట్టుకుంది. సభలో మొత్తం సభ్యుల సంఖ్య 245. ఇప్పుడున్న అంచనాల మేరకు సభలో బిజెపి తన బలాన్ని 58 నుంచి 69కి పెంచుకుంటుంది. కాంగ్రెస్ బలం ఇప్పుడున్న 54 నుంచి 50కి పడిపోతుంది. రాష్ట్రాల మండలిగా పేరొందిన రాజ్యసభలో ఇప్పటికీ ఎన్‌డిఎ మెజార్టీ స్థాయికి ఇంకా చేరుకోలేదు.

టిడిపితో లాస్...ఇతరులతో ప్లస్

ఇటీవలే బిజెపి మిత్రపక్షం తెలుగుదేశం ఎన్‌డిఎతో సంబంధాలను తెంచుకోవాలని నిర్ణయించుకోవడం కీలక పరిణామంగా మారింది. రాజ్యసభలో టిడిపికి ఆరుగురు సభ్యులు ఉన్నారు. అయితే కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీలు ఇప్పటి ఎన్నికలలో నష్టపోవడం ఎన్‌డిఎ ప్రముఖుల కేరింతల కారణం అయింది. కాంగ్రెస్ నష్టం సంగతి ఒకటి అయితే సమాజ్‌వాది పార్టీ సభ్యులు ఆరుగురు రిటైర్ కాగా ఇప్పుడు ఆ పార్టీ నుంచి ఒక్కరే గెలుపొందారు. ఇక అనుకూలమైన అన్నాడిఎంకె, వైఎస్‌ఆర్ కాంగ్రెస్, బిజెడి, టిఆర్‌ఎస్‌లు ఎన్‌డిఎ వెలుపల ఉంటున్నాయి. ఆయా పార్టీలకు కూడా ఈసారి ఎన్నికలలో విజయం దక్కడంతో వారినుంచి తమకు వ్యతిరేకత లేకపోవడంతో అధికార పక్షం సంతోషిస్తోంది. ప్రభుత్వ లెజిస్లేటివ్ అజెండాకు, బిల్లులకు ఈ పార్టీల నుంచి మద్దతు లభించడంతో ఇక తమకు తిరుగు ఉండదని అధికార పక్షం భావిస్తోంది. మోడీ ప్రభుత్వ బిల్లులు అనేకం ఎగువ సభలో సరైన మెజార్టీ లేకపోవడంతో నిలిచిపోతున్నాయి. లోక్‌సభలో నెగ్గిన బిల్లులు రాజ్యసభలో పెండింగ్‌లో పడిపోవడం అధికార పక్షానికి కలవరం కల్గించింది. పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి విజయపరంపర కొనసాగడంతో ఎగువ సభలో అందుకు అనుగుణంగా బిజెపి బలం ఇనుమడించడానికి దారితీసింది. అసెంబ్లీ సభ్యుల పరోక్ష ఎన్నిక పద్ధతిన రాజ్యసభ స్థానాల ఖాళీలు భర్తీ అవుతాయి. కాంగ్రెస్ పలు రాష్ట్రాలలో అధికారం కోల్పోవడంతో ఎగువ సభలో మునుపటి సంఖ్యాబలానికి దూరం కావల్సి వచ్చింది.

లాలూకు 14 ఏళ్ల జైలు

దాణా స్కాం నాలుగో కేసులో సిబిఐ కోర్టు తీర్పు



రాంచి : ఆర్‌జెడి అధినేత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌కు రాంచీ సిబిఐ న్యాయస్థానం 14 ఏళ్ల జైలు శిక్షను ఖరారు చేసింది. దీంతో పాటు రూ.60 లక్షలు జరిమానా చెల్లించాలని ఆదేశించింది. రూ.3.13 కోట్ల దాణా స్కామ్‌కు సంబంధించిన నాలుగవ కేసులో ఐపిసి సెక్షన్ల కింద 7 ఏళ్లు, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ల కింద 7 ఏళ్లు.. మొత్తం 14 ఏళ్ల జైలు శిక్షను ఒకదాని వెంటే మరొకటి విధిస్తున్నట్లు సిబిఐ కోర్టు న్యాయమూర్తి శివ్‌పాల్ సింగ్ వెల్లడించారు. 'లాలా ప్రసాద్ యాదవ్‌కు ఐపిసి సెక్షన్లు 420 (మోసం), 409 (ప్రజాప్రతినిధి అయి ఉండి నేరానికి పాల్పడడం), 467, 120 బి వంటి సెక్షన్ల కింద ఏడేళ్ల జైలు శిక్షలు విధించారు, దీంతో పాటు రూ.30 లక్షలు జరిమానా కూడా విధించారు' అని న్యాయవాది విష్ణు శర్మ తెలిపారు. 'అలాగే అవినీతి నిరోధక చట్టం కింద ఏడేళ్ల జైలు శిక్షతో పాటు, రూ.30 లక్షల జరిమానా విధించారు' అని ఆయన వివరించారు. ఒకవేళ జరిమానా చెల్లించకపోతే మరో ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని జడ్జి ఆదేశించారని ఆయన చెప్పారు. ఈ కేసులో లాలూతో పాటు మరో 18 మంది దోషులకు కూడా శిక్షలు విధించారు. మాజీ రీజినల్ డైరెక్టర్ ఓపి దివాకర్‌కు కూడా శిక్ష విధించారు. పశు సంరక్షణ శాఖకు చెందిన మరో 9 మందికి కూడా జైలు శిక్షలను జడ్జి ఖరారు చేశారు. అయితే, లాలూకు సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం విధించిన శిక్షలపై తాము ఉన్నత న్యాయస్థానంలో అప్పీలు చేయనున్నట్టు లాలూ తరపు న్యాయవాది ప్రభాత్ కుమార్ విలేకరులకు తెలిపారు. కాగా, బీహార్ మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రాతో పాటు 12 మందిని కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది.

బిడియం.. తెలియనితనం

రొమ్ము క్యాన్సర్‌కు బలవుతున్న అమ్మ

లండన్ : ఏమనుకుంటారో అనే బిడియం అంతకు మించి సరైన శ్రద్ధ తీసుకోకపోవడం భారతీయ గ్రామీణ మహిళకు శాపంగా మారింది. రొమ్ము క్యాన్సర్ భారతీయ మహిళకు ప్రాణాంతకం అవుతోంది. బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా చూసుకునేందుకు అయ్యే వ్యయాన్ని తట్టుకోలేని దుస్థితి వారికి భారంగా మారుతోంది. స్వీడన్‌లోని ఉమీయా విశ్వవిద్యాలయం బృందం రొమ్ము క్యాన్సర్‌పై సమగ్ర అధ్యయనం నిర్వహించింది. నితిన్ గంగానే ఆధ్వర్యంలోని వైద్య విద్యార్థుల బృందం జరిపిన సర్వేలో పలు కీలక అంశాలు వెల్లడయ్యాయి. ప్రత్యేకించి రొమ్ము క్యాన్సర్ ఉందా? లేదా అనేది స్వయంగా తెలుసుకునే పద్ధతి గురించి భారతీయ మహిళకు తెలియదు. ఇక గ్రామీణ ప్రాంతాలలోని మహిళలకు అసలు రొమ్ము క్యాన్సర్ అనే ప్రాణాంతక వ్యాధి ఉందని కూడా తెలియదు. పేదరికం, నిరక్ష్యరాస్యత, మూఢనమ్మకాల వలయంలో కొట్టుమిట్టాడే భారతీయ సగటు మహిళ ఈ వ్యాధికి గురి అవుతోంది. జీవచ్ఛవంగా మారుతోంది. సమాజం కట్టుబాట్లు, అంతకు మించి పేదరికపు సుడిగుండాలే సగటు భారతీయ గ్రామీణ మహిళను బ్రెస్ట్ క్యాన్సర్‌కు గురిచేస్తున్నాయి. సాధారణంగా ఇలాంటి తీవ్రస్థాయి క్యాన్సర్ రాకుండా నివారణ చర్యలు తీసుకోవడం కీలకమైన విషయం సకాలంలో బ్రెస్ట్ క్యాన్సర్ గురించి తెలిస్తే దాని చికిత్సకు వీలేర్పడుతుంది. రొమ్ము క్యాన్సర్ లక్షణాలు, ఈ వ్యాధిపై అవగావహన బాగా పెరగాల్సి ఉంది. అంతేకాకుండా చికిత్స పట్ల వారికి ఉన్న అపోహలను తొలిగించాల్సి ఉంది. కొన్ని అంశాలు గుప్తంగానే ఉండాలనే ఆలోచన, దేవుడు దయ్యం అనే భీతి వంటివి చివరికి వారు తమ శారీరక అవలక్షణాలను తెలుసుకోలేకుండా బందీఖానాలోకి నెడుతున్నాయి.

తల్లడిల్లుతున్న వార్ధా తల్లులు : మహారాష్ట్రలోని వార్ధా జిల్లాలో గ్రామీణ ప్రాంతాలలోని మహిళలపై ఈ వైద్య బృందం పరిశోధనలు నిర్వహించింది. వారికి ఆర్థిక సామాజిక స్థితిగతులను ఆరాతీసింది. ఈ చట్రంలోనే బ్రెస్ట్ క్యాన్సర్ పట్ల వారి నిర్లిప్తత అంతకు మించి అజ్ఞానం వెల్లడైందని బృందం తెలిపింది. అసలు రొమ్ములకు వ్యాధి సోకుతుందనే నిజం కానీ, ఈ వ్యాధి రాకుండా స్వయంగా జాగ్రత్తలు తీసుకోవచ్చుననే అంశం కానీ ఎక్కువ మందికి తెలియదని వెల్లడైంది. దాదాపు వేయి మంది మహిళలను రెండు దశలలో వైద్య బృందం కలుసుకుంది. వారి నుంచి వివరాలను రాబట్టింది. వారిలో అత్యధికులకు బ్రెస్ట్ క్యాన్సర్ వస్తుందనే విషయం తెలియదు. ఈ అవలక్షణాలను సకాలంలో తెలుసుకోవచ్చుననే విషయం తెలియదు. ఇక ఈ ప్రాంతంలోనే రొమ్ము క్యాన్సర్ సోకిన 219 మంది మహిళ స్థితిగతులపై అధ్యయనం జరిపింది. రొమ్ములను సరైన రీతిలో పరిశీలన చేసుకోవాలనే ఆలోచన వారిలో లేదని, ఇదే వారిని ఈ వ్యాధికి గురి చేసిందని అధ్యయనంలో వెల్లడైంది. అంతేకాకుండా ప్రతి ముగ్గురిలో ఒక మహిళకు అసలు రొమ్ములకు వ్యాధి వస్తుందనే విషయం తెలియదు. సకాలంలో దీని గురించి తెలుసుకునే పద్ధతులు వివరిస్తే మంచిదని పలువురు మహిళలు అభిప్రాయపడ్డారు. ఇక రొమ్ము క్యాన్సర్ వచ్చిన తరువాత మూడు నాలుగు నెలల వరకూ చికిత్స గురించి ఆలోచించకపోవడం, వైద్యుల వద్దకు వెళ్లకపోవడం కూడా ప్రాణాంతకం అయింది. రొమ్ముల ప్రాంతంలో తమకు నొప్పి వంటిది ఏమీ అన్పించలేదని, దీనితో అంతా బాగానే ఉందని అనుకుంటున్నామని పలువురు మహిళలు తెలిపారు. ఇక గ్రామీణ వైద్యులు సరైన వ్యాధి నిర్ధారణ చేయకపోవడం, చికిత్స వికటించడం వంటివి మహిళలకు ఇబ్బందిగా మారాయి. ఈ దశలో తక్షణమే భారతదేశంలో జాతీయ బ్రెస్ట్ క్యాన్సర్ నివారణ కార్యక్రమం చేపట్టాల్సి ఉంది. ప్రత్యేకించి గ్రామీణ స్థాయిలో స్థానిక దశలలో ఈ క్యాన్సర్ పట్ల మహిళలకు తెలియచేసేందుకు ఇంటింటి ప్రచారం ఉధృతం కావల్సి ఉందని వైద్య విద్యార్థుల బృందం అభిప్రాయపడింది.

అంతిమ దశలో నక్సలిజం




గురుగాం: దేశానికి పెద్ద సవాల్‌గా మారిన నక్సలిజం చివరి దశకు చేరుకుందని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. భద్రతా బలగాలను ఎదుర్కొలేక మావోయిస్టులు ప్రస్తుతం మందు పాతరలు పేల్చడం వంటి పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. శనివారం ఆయన గురుగాంలో సిఆర్‌పిఎఫ్ నక్సలైట్ వ్యతిరేక దళాల 79వ రైజింగ్ డేలో సిబ్బంది, అధికారులనుద్దేశించి ప్రసంగించారు. భద్రతా బలగాల పోరాట పటిమతో గత కొద్ది రోజులుగా వామ పక్ష తీవ్రవాద ఘటనలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. గతంలో సిఆర్‌పిఎఫ్ సిబ్బంది, ప్రజల మరణాల సంఖ్య ఎక్కువగా ఉండేవని, ఇప్పుడు అందుకు విరుద్ధమైన పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం తీవ్రవాదుల మరణాల సంఖ్య పెరిగిందన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో ఇటీవల నక్సలైట్లు పేల్చిన మందుపాతరలో మరణించిన తొమ్మిది మంది సిబ్బందికి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. వామ పక్ష ప్రభావిత ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణ పనుల్లో పాల్గొన్న సిబ్బందిని చంపుతున్న నక్సలైట్లు పేదలు, గిరిజనులు, అభివృద్ధికి వ్యతిరేకులని ప్రజలు అర్థం చేసుకుంటారన్నారు. దేశంలో అనేక ప్రాంతాలలో తీవ్రవాదులను అణిచివేసేందుకు భద్రతా బలగాల కృషిని ఆయన అభినందించారు.



జూన్‌లో జిన్‌పింగ్‌తో మోడీ భేటీ

బీజింగ్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జూన్‌లో చైనా పర్యటించనున్నారు. షాంఘై కో–ఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సిఒ) సమ్మిట్‌లో పాల్గొనేందుకు రానున్న ఆయన ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపే అవకాశముందని భారత రాయబారి గౌతం తెలిపారు. చైనాకు చెందిన సెక్యూరిటీ గ్రూపింగ్ అయిన ఎస్‌సిఒ నాటోకు వ్యతిరేకంగా ఉంది. ఈ ఎస్‌సిఒ సమ్మిట్ జూన్ 9, 10 తేదీల్లో కింగ్‌దావోలో జరుగనుంది. 'ఈ సమ్మిట్‌లో భారత ప్రధాని నరేంద్ర మోడీ ఖచ్చితంగా చైనా అధ్యక్షుడితో ద్వైపాక్షిక చర్చలు జరపుతారు. దీనికి ముందుకు మరిన్ని సమావేశాలు జరుగుతాయి' అని గౌతం సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. వచ్చే కొద్ది మాసాల్లో ఇక్కడ కొన్ని సమావేశాలు జరుగుతాయని, రెండు దేశాలకు చెందిన ఉన్నతాధికారులు ఇందులో పాల్గొంటారని ఆయన తెలిపారు. వచ్చే నెలలో తాను చైనాలో పర్యటించనున్నట్లు విదేశాంగ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపిన విషయం విదితమే.

అనాలిటికా సంస్థలలో సోదాలు



లండన్ : ఫేస్‌బుక్ డాటా స్కాండల్ కేసులో బ్రిటన్‌కు చెందిన కేంబ్రిడ్జి అనాలిటికా సంస్థపై దర్యాప్తు ముమ్మరం అయింది. ఫేస్‌బుక్ ఖాతాదారుల సమాచారాల తస్కరణ జరిగిందని, వివిధ దేశాలలో ఎన్నికల ప్రక్రి య ప్రభావితానికి ఈ డాటాను వాడుకున్నారని ఆరోపణలు వచ్చాయి. దీనితో బ్రిటన్‌కు చెందిన చట్టపరమైన సంస్థలు దర్యాప్తు చేపట్టాయి. అనాలిటికా కార్యాలయాలలో శనివారం విస్తృత స్థాయి సోదాలు నిర్వహించారు. సాయంత్రం వరకూ సోదాలు నిర్వహించినట్లు తమకు లభ్యమైన సాక్ష్యాలను, ఆధారాలను ప్రాతిపదికగా తీసుకుని సంస్థపై తదుపరి చర్యలకు దిగుతామని దర్యాప్తు సంస్థలు తెలిపాయి. డాటా స్కామ్‌కు సంబంధించి స్థానిక న్యాయమూర్తి నుంచి తగు సెర్చ్ వారంటును పొందిన తరువాత ఇన్‌ఫర్మేషన్ కమిషనర్ కార్యాలయం నుంచి 18 మందితో కూడిన అధికారుల బృందం రంగంలోకి దిగింది. తమ దర్యాప్తు అధికారులు సోదాలు నిర్వహించారని కమిషనర్ కార్యాలయం ప్రకటన వెలువరించింది. తమకు దొరికిన సమాచారాన్ని పూర్తి స్థాయిలో సమీక్షించుకుంటామని తెలిపింది. ఫేస్‌బుక్ డాటాను వివిధ దేశాల రాజకీయ పార్టీల ప్రయోజనాలకు వాడటం, ఎన్నికల్లో దుర్వినియోగపర్చడం, సోషల్‌మీడియా సంస్థలు, ఇతర వాణిజ్య శక్తులకు విక్రయించడం జరిగిందనే ఆరోపణలపై ఇప్పుడు దర్యాప్తు సాగుతోంది. అనాలిటికా సంస్థ అమెరికా అధ్యక్ష ఎన్నికల సందర్భంగా ట్రంప్ అధికార స్థాపనకు అనుకూలంగా ఏజెంట్‌గా పనిచేసిందని ఆరోపణలు వచ్చాయి. దీనితో ప్రపంచ స్థాయిలో ప్రఖ్యాతిగాంచిన ఫేస్‌బుక్ వివాదంలో చిక్కుకుంది. ఈ దశలో సంస్థ అధినేత మార్క్ జుకెర్‌బర్గ్ బహిరంగ క్షమాపణ ప్రకటించారు. భారీ స్థాయిలో విశ్వాస ఘాతం జరిగిందని, ఈ డాటా చౌర్యాన్ని నివారించుకుంటామని తెలిపారు.

ఇద్దరు ట్రక్ డ్రైవర్లకు జైలు శిక్ష

లండన్ : గతేడాది బ్రిటన్‌లోని జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది భారతీయుల మరణానికి కారణమయ్యారన్న కేసులో నిందితులైన ఇద్దరు ట్రక్ డ్రైవర్లకు యుకె కోర్టు జైలు శిక్ష విధించింది. రైస్‌జాద్ మాసీరాక్ (31)కు 14 ఏళ్లు, మరో ట్రక్ డ్రైవర్ డేవిడ్ వాగ్‌స్టాఫ్ (54)కు 40 నెలల పాటు శిక్షలు విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. మినీబస్‌ను ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌తో పాటు మరో ఏడుగురు మృత్యువాత పడ్డారు. వీరంతా భారతీయులే. ఈ ఘటనలో మాసీరాక్, డేవిడ్‌లను దోషులుగా నిర్ధారిస్తూ కోర్టు ఈ మేరకు శిక్షలు విధించింది. నిర్లక్ష్యంగా ట్రక్‌ను నడిపిన డ్రైవర్లు చేసిన ఈ రోడ్డు ప్రమాదం యుకెలో అత్యంత తీవ్రమైనదని ఈ సందర్భంగా జడ్జి ఫ్రాన్సిస్ షెరిడాన్ పేర్కొన్నారు. వాహనాన్ని నడుపుతూ మొబైల్‌లో మాట్లాడడం అనేది చాలా తప్పు అని,ఇదే ప్రమాదానికి కారణమైందని ఆయన వ్యాఖ్యానించారు.

ఆధార్ లీక్ వార్తలు నిరాధారం

ఉడాయ్ వివరణ.. భద్రతకు భరోసా



న్యూఢిల్లీ : ఆధార్ కార్డులలోని వ్యక్తిగత సమాచారం వెల్లడి అవుతున్న దనే వార్తలను విశిష్ట గుర్తింపు సంఖ్య ల ప్రాధికారిక సంస్థ (ఉడాయ్) ఖండించింది. ఆధార్ సమాచారం భద్రంగా ఉందని, ఆధార్ హోల్డర్ల సమాచారం లీక్ అవుతున్నదనే వార్తలు నిరాధారం అని సంస్థ శనివారం ఒక ప్రకటన వెలువరించింది. ప్రభుత్వ ఆధీనంలోని ఆధార్ సంస్థ అనుబంధ విభాగం నుంచి ఆధార్ కార్డుల వారి సమాచారం లీక్ అవుతోందని జడ్‌డి నెట్ అనే టెక్నాలజీ పోర్టల్ తెలిపింది. టెక్ భద్రతా పరిశోధకుల పరిశీలనలో ఈ విషయం స్పష్టం అయిందని పోర్టల్ వెల్లడించింది. అయితే ఈ కథనంలో నిజం లేదని , ఆధార్ ఎప్పటికీ విశ్వసనీయంగా, సమాచార భద్రతాయుతంగా ఉంటుందని సంస్థ తెలిపింది. డాటా బహిర్గతం అవుతున్నదనే కథనం పూర్తిగా బాధ్యతారహితం, నిరాధారం అని , ఈ పోర్టల్‌తో పాటు కొన్ని పత్రికలలో దీనిపై వచ్చిన వార్తలను ఖండిస్తున్నామని ప్రకటనలో వివరించారు. ఆధార్ కార్డులు పొందిన వారి బ్యాంకుల ఖాతాల వివరాలతో పాటు పూర్తి సమాచారం వెల్లడి అయ్యే రీతిలో ఆధార్ వ్యవస్థ లోపభూయిష్టంగా ఉందని జడ్‌డి నెట్ తమ వార్తలో పేర్కొనడం సంచలనానికి దారితీసింది. ఆధార్ గోప్యతపై పలు ప్రశ్నలకు దారితీసింది. లీక్‌కు సంబంధించి పలు అసమగ్ర వాదనలు ఉన్నాయని , కేవలం ఆధార్ సంఖ్య వేరే వ్యక్తికి తెలిసినంత మాత్రాన ఆధార్ హోల్డర్ల వ్యక్తిగత సమాచారం అంతా వెలుగులోకి వస్తుందనే వాదన సరికాదని, గోప్యతకు ఇది భంగకరం అనడం అనుచితం అని సంస్థ తెలిపింది. ఆధార్ డాటా లీక్ అవుతుందనడం, ఆర్థిక ఇతరత్రా మోసాలకు దారితీస్తుందనడం అసంబద్ధమని స్పష్టం చేశారు. ఆధార్ సంఖ్య జారీ కావడం, కార్డుల తయారీ అంతా కూడా సమగ్ర విశ్వసనీయ ప్రక్రియతో జరుగుతుంది. లావాదేవీలన్నీ కూడా వ్యక్తుల చేతివేళ్ల ముద్రలను ఐరిస్ లేదా ఐటిపి ప్రక్రియలో సరైన విధంగా తీసుకుని నిర్ధారించుకుంటారని, ఈ సమాచారం లీక్‌కు అవకాశం లేనేలేదని సంస్థ స్పష్టం చేసింది.

ఎయిర్‌బేస్‌లో ఎన్‌ఆర్‌ఐ దుర్మరణం

న్యూయార్క్ : అమెరికాలో భారతీయ సంతతికి చెందిన ఒక వ్యక్తి తన వాహనంతో వైమానిక స్థావరంలోకి దూసుకువెళ్లి దుర్మరణం చెందాడు. ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నట్లు అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బిఐ తెలిపింది. కాలిఫోర్నియాలోని ఫెయిర్‌ఫీల్డ్ ట్రావిస్ ఎయిర్‌బేస్‌లోకి 51 ఏళ్ల హఫీజ్ కాజీ తన మినివ్యాన్‌తో వేగంగా దూసుకువెళ్లాడు. ఈ క్రమంలో అది అదుపు తప్పి మంటలు చెలరేగడంతో ఆ వ్యక్తి చనిపోయినట్లు అధికారులు తెలిపారు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన అమెరికాలో భద్రతాపరమైన ఆందోళనకు దారితీసింది. ఎయిర్‌ఫోర్స్ స్థావరంలోకి ఈ వ్యక్తి వాహనం అనుమతి లేకుండా దూసుకువెళ్లడం తరువాత అది మంటలో కాలిపోవడం వంటి అంశాలపై దర్యాప్తు చేపట్టినట్లు ఎఫ్‌బిఐ అధికారి సియాన్ రెగాన్ తెలిపారు. వాహనంలో ఐదు చిన్నపాటి సిలిండర్లు, జిమ్ బ్యాగ్, వ్యక్తిగత వస్తువులు, మూడు ఫోన్లు, పలు లైటర్లు ఉన్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు. కాజీ అనే ఈ వ్యక్తి భారతీయుడని 1993 నుంచి అమెరికాలో నివసిస్తున్నాడని , చట్టబద్ధంగా శాశ్వత అమెరికా నివాసిగా మారాడని తెలిపారు. అయితే ఈ వ్యక్తి ఎప్పుడే చనిపోయినట్లు ఇండియాలోని బంధువులు చెపుతున్నారని సంస్థ వారు వెల్లడించారు. అమెరికాలో కాజీ కుటుంబ సభ్యులు ఎవరిని తాము గుర్తించలేదని, కాజీ గతంలో క్యాబ్ డ్రైవర్‌గా పనిచేసినట్లుగా తెలిసిందని, అయితే ఇప్పుడు ఏం చేస్తున్నాడనేది తెలియదని, ఈ వ్యాన్ ఆయన సొంతమా? కాదా అనేది కూడా స్పష్టం కాలేదని అధికారులు తెలిపారు. పది వేల మంది సైనిక సిబ్బందితో ఉండే ట్రావిస్ ఎయిర్‌ఫోర్స్ బేస్ పసిఫిక్ ప్రాంతంలో అత్యంత కీలకమైన సైనిక కేంద్రంగా ఉంది. ఈ స్థావరంలోకి కారు చొరబాటు, వ్యక్తి అనుమానాస్పద మృతి వంటివి అమెరికా భద్రతా సంస్థలకు చిక్కుముడిగా మారాయి.

సైన్యంలో హిజ్రాలపై నిషేధం

కీలక ఉత్తర్వులపై ట్రంప్ సంతకం





వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షులు ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ఇప్పుడు హిజ్రాలపై విరుచుకుపడ్డారు. ట్రాన్స్ జెండర్లు సైన్యంలో ఉండరాదనే నిర్ణయంపై ట్రంప్ శనివారం సంతకాలు చేశారు.గత ఏడాదే ప్రెసిడెంట్ ట్రంప్ ట్రాన్స్‌జెండర్ల సైనిక సేవల నిషేధం తీర్మానం చేశారు. అయితే ఎల్‌జిబిటి హక్కుల సంస్థల నుంచి దీనిపై తీవ్రస్థాయి విమర్శలు తలెత్తాయి. అయినప్పటికీ వీటిని లెక్కచేయకుండా ట్రంప్ ఇప్పుడు దీనికి సంబంధించిన ఉత్తర్వులను అమలులోకి తెచ్చారు. దీనితో అమెరికా సేనలలో ఇక పై పరిమిత అనివార్య పరిస్థితులలో తప్ప ట్రాన్స్‌జెండర్ల సేవలు ఉండవు. సైన్యంలో పనిచేయడానికి ట్రాన్స్‌జెండర్లు అర్హత కోల్పోతారు. ట్రాన్స్‌జెండర్లుగా నిర్ధారణ అయిన వారు, ఈ విధమైన లైంగిక అవలక్షణానికి చికిత్స పొందుతున్న వారూ, సుదీర్ఘ జెండర్ చికిత్స అవసరం అయిన వారూ సైనిక దళాలలో పనిచేయడానికి అనర్హులుగా పేర్కొంటున్నామని దేశాధ్యక్షుడి పేరిట వెలువడ్డ ఉత్తర్వులలో ప్రకటించారు. అయితే మినహాయింపుల గురించి ఈ ఉత్తర్వులలో స్పష్టం చేయలేదు. రక్షణ మంత్రి, దేశ అంతర్గత భద్రతల ఉన్నతాధికారుల స్థాయిలలో వారి అధికార వినియోగంతో దీనిపై తగు విధమైన పాలసీ రూపకల్పన జరుగుతుందని ఉత్తర్వులలో వెల్లడించారు.సైనిక బలగాలలో ట్రాన్స్‌జెండర్ల సేవల మినహాయింపుల నిర్ణయాన్నిఆయా ప్రత్యేక నిర్ధిష్ట అంశాల ప్రాతిపదికన తీసుకుంటారని వివరించారు. అయితే సైన్యంలో ఇప్పుడున్న ట్రాన్స్‌జెండర్ల కొనసాగింపు ఉంటుందని తెలిపారు.గత ఆగస్టులోనే ట్రంప్ దీనికి సంబంధించి అధికార ప్రకటన వెలువరించారు. అయితే న్యాయస్థానాలలో వీటికి చుక్కెదురు అయింది. ట్రంప్ పాలసీని ట్రాన్స్‌జెండర్ బలగాలు కోర్టులలో సవాలు చేయడంతో వీటి అమలు ఇప్పటివరకూ సాధ్యం కాలేదు. దీనితో అప్పటి విధానంలోని లోపాలను సవరించి ఇప్పుడు ట్రంప్ తాజాగా అధికారిక ఉత్తర్వులు వెలువరించారని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ సరాహ్ సాండెర్స్ వివరణ ఇచ్చారు. దేశ సైనిక బలగాలలోకి మానసికంగా శారీరకంగా దీటైన వ్యక్తులే రావాలనేదే ఈ ఉత్తర్వుల ఉద్దేశం అని తెలిపారు. సైనిక దళాల సీనియర్ అధికారులు, పౌర ప్రతినిధులు ఇతరులతో సమగ్ర సంప్రదింపుల తరువాతనే ఈ ఉత్తర్వులను డిఫెన్స్ సెక్రెటరీ జేమ్స్ మట్టిస్ ఆధ్వర్యంలో రూపొందించారని అధికారికంగా వెల్లడించారు.

ప్రమాదంలో 11 మంది మృతి

మరి ఐదుగురికి గాయాలు
ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్‌లో ఘటన

ప్రతాప్‌గఢ్ : ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమా దం చోటు చేసుకుంది. ప్రతాప్‌గఢ్‌లోని వారణాసి – లక్నో జాతీయ రహదారిపై ఓ టెంపో, ట్రక్కు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 11 మంది దుర్మరణం పాలయ్యారు. మరో ఐదుగురు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. బాధుతులు రాణిగంజ్‌లోని చౌరాజన్ ధామ్‌కు వెళ్తుండగా ఫతేన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదం సంభవించినట్లు అదనపు ఎస్‌పి (తూర్పు) రాఖేష్ సింగ్ వెల్లడించారు. ఘటనాస్థలిలోనే ఇద్దరు మహిళలు మృతి చెందగా, మరో 9 మందిని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మరణించారన్నారు. మృతులంతా 35 నుంచి 45 ఏళ్ల వయసుగల వారేనని ఆయన చెప్పారు. నలుగురు మహిళలు సహా క్షతగాత్రులైన వారు అలహాబాద్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రమాదం పట్ల తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరి చొప్పున రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియాను, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50 వేలను ప్రకటించారు.

తెలంగాణ ఆహార కమిషన్ ఏర్పాటు

కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి ఈటల



మన తెలంగాణ/హైదరాబాద్ : పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం రేషన్ బియ్యం, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, గర్భిణీలు, శిశువులకు పోషకాహారం అందజేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో ఎక్కడైనా అవకతవకలు, అక్రమాలు జరిగితే తెలంగాణ ఆహార కమిషన్ చర్యలు చేపడుతుందని చెప్పారు. ఆదర్శ్‌నగర్‌లోని హెరిటేజ్ భవనంలో కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దేశంలోనే మొట్ట మొదటిసారి రాష్ట్రంలో సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతున్నామన్నారు. 9,10 తరగతుల విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి కేంద్రం నిధులు కేటాయించకపోయినా, రాష్ట్ర ప్రభుత్వం ఆ తరగతుల పిల్లలకు మధ్యాహ్న భోజనం అమలు చేస్తుందన్నారు. అలాగే గర్భిణీలకు, పాలిచ్చే తల్లులకు పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో నెలకు 30 గుడ్లు సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. ఆహార భద్రత పథకం కింద కేంద్రం ఒక వ్యక్తికి 5 కిలోల చొప్పున రేషన్ బియ్యం ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం కుటుంబంలో ఎంత మంది ఉన్నా ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున రేషన్ బియ్యం పంపిణీ చేస్తుందని చెప్పారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ సి.వి.ఆనంద్ మాట్లాడుతూ, ఈ కమిషన్, ఆహార భద్రతకు సంబంధించిన అన్ని అంశాలను చూస్తుందన్నారు. ప్రజలు సంక్షేమ ఫలాలు అందజేయడంలో కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేస్తాం : కమిషన్ ఛైర్మన్ తిర్మల్‌రెడ్డి

రాష్ట్ర ఆహార కమిషన్ పట్ల ప్రజలలో అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం చేస్తామని కమిషన్ నూతన ఛైర్మన్ తిర్మల్‌రెడ్డి తెలిపారు. త్వరలోనే కమిషన్ సభ్యులతో జిల్లాల్లో పర్యటించి, సంబంధిత అధికారులతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఫిర్యాదులు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.


పర్యావరణహిత పర్యాటకాభివృద్ధి

జార్ఖండ్ టూరిజం ఫ్రెండ్లీ పాలసీ

(రాంచీ నుంచి 'మన తెలంగాణ' ప్రతినిధి అరుణ్)

ప్రకృతి అందాలు పుష్కలంగా ఉన్న జార్ఖండ్‌లో సుస్థిరమైన పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం తమ ముందున్న ప్రధాన లక్ష్యమని ఆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధీర్ త్రిపాఠి తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకుంటూనే పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని, త్వరలోనే 'టూరిజం ఫ్రెండ్లీ' విధానాన్ని అమలుచేయనున్నామని తెలిపారు. రాంచీలో శుక్రవారం ప్రారంభమైన 'జార్ఖండ్ ట్రావెల్ మార్ట్' ఎగ్జిబిషన్‌లో రెండవరోజైన శనివారం కార్యక్రమానికి ఆ రాష్ట్ర పర్యాటక మంత్రితో పాటు ప్రధాన కార్యదర్శి, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, దేశంలో ఎక్కడాలేని విధంగా జార్ఖండ్‌లో 32 గిరిజన తెగలు ఉన్నాయని, ఒక్కో జాతికి ఒక్కో రకమైన ప్రత్యేక నైపుణ్యం, ప్రావీణ్యం ఉందని, వీటిని యావత్తు ప్రపంచానికి చాటి చెప్పడానికి ఈ ప్రదర్శన దోహదపడుతుందన్నారు. ఆయా గిరిజన తెగల ప్రజలు తయారుచేసే కళాఖండాలను, ఉపకరణాలను విస్తృతంగా ప్రచారంలోకి తీసుకెళ్ళడానికీ, వాటికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించి ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని, అందులో భాగంగా పర్యాటక హోటళ్ళు, ప్రదేశాల్లో విక్రయించేలా తగిన స్థలాన్ని వారికి కేటాయిస్తామని ప్రధాన కార్యదర్శి తెలిపారు. పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేయడానికి గతంలో అనేక పరిమితులు, ప్రతిబంధకాలు, సమస్యలు ఉండేవని, వాటిని ఇప్పుడు అధిగమించామని తెలిపారు. ప్రస్తుతం ఎలాంటి ఆటంకాలు లేనందున పర్యావరణానికి తగిన ప్రాధాన్యతను ఇస్తూనే పర్యాటకరంగాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. జార్ఖండ్ అందాలను ప్రపంచానికి చాటిచెప్పడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వ కార్యాచరణ ఉంటుందని అన్నారు. ఈ రంగం అభివృద్ధి చెందడం ద్వారా ఒకవైపు నిరుద్యోగ యువతకు ఉపాధి లభించడంతో పాటు గిరిజనులు సైతం ఆర్థికంగా నిలదొక్కుకోడానికి వీలవుతుందన్నారు. పర్యాటక మంత్రి అమర్‌కుమార్ భూరి మాట్లాడుతూ ఈ రంగానికి ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకునే త్వరలో 'టూరిజం ఫ్రెండ్లీ' విధానాన్ని రూపొందించనున్నట్లు తెలిపారు. ప్రకృతి అందాలు, ఎత్తయిన కొండలు, జలపాతాలు జార్ఖండ్‌కు సహజ వరాలు అని ఆయన వ్యాఖ్యానించారు. అన్ని వనరులను వినియోగించుకుని ఉత్తమ పర్యాటక ఆకర్షణీయ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని అన్నారు. జార్ఖండ్‌లోని పర్యాటక అంశాలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించడంతో పాటు గిరిజన సంప్రదాయ కళారూపాలైన మహిషాసుర మర్ధిని నృత్యం, గిరిజన వస్త్రాలతో జరిగిన ఫ్యాషన్ షో సందర్శకులను ఆకట్టుకుంది.

అమిత్‌షా లేఖ తప్పుల తడక : చంద్రబాబు



అమరావతి: బిజెపి జాతీయ అధ్యక్షుడు రాసిన తొమ్మిది పేజీల లేఖపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒక జాతీయ పార్టీ అధ్యక్షుడు రాయాల్సిన విధంగా లేఖ లేదని, అసత్యాలు, అర్ధసత్యాలతో అదో తప్పుల తడకగా ఉందని అభివర్ణించారు. ఏ రాష్ట్రానికీ చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సాయం చేశామని అమిత్‌షా లేఖలో పేర్కొనడంపై సీఎం ఘాటుగా స్పందించారు. ప్రాధాన్యతా క్రమంలో అనేక అంశాలను పక్కదారి పట్టించేందుకే తెలివిగా ఈ లేఖ రాశారన్నారు. ప్రజల్ని మభ్యపెట్టేందుకే బిజెపి ఈ విధంగా వ్యవహరిస్తోందన్నారు. శాసనసభలో శనివారం అమిత్‌షా రాసిన లేఖలో ప్రతి అంశాన్ని సిఎం చదువుతూ గతంలో తాను రాసిన లేఖలో పేర్కొన్న విషయాలతో పోలుస్తూ కేంద్రాన్ని గట్టిగానిలదీశారు.

మాపైనే ఎదురుదాడా? : హేతుబద్ధత లేకుండా చేసిన విభజనతో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు చట్టబద్ధంగా రావాల్సినవి అడిగితే ఎదురుదాడి చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తంచేశారు. తామేమీ కొత్త వి అడగడంలేదని, చట్టంలో ఇస్తామని పేర్కొన్నవే అడుగుతున్నామన్నారు. విభజన తర్వాత రెండు రాష్ట్రాలకూ న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై లేదా అని ప్రశ్నించారు. ఆర్థిక సం ఘం ఇచ్చినవి కూడా కేంద్రమే ఇచ్చినట్టు గొప్పలు చెప్పుకుంటోందని దుయ్యబట్టారు. ప్రత్యేక హోదాకు సమానంగా సాయం అందిస్తామని చెప్పడం వల్లే ప్రత్యేక సాయానికి ఒప్పుకున్నామన్నారు. ఆర్థికంగా బలోపేతంగా ఉంటే కేంద్రాన్ని నిధులు అడగాల్సిన అవసరం తమకేంటి? అని అన్నారు.

హోదా విషయం తేల్చాల్సిందే! : కంటే బిజెపినే తమకు ఎక్కువ అన్యాయం చేసిందనే అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉందని ఈ సందర్భంగా చంద్రబాబు గుర్తుచేశారు. హోదా విషయాన్ని తేల్చాల్సిందేన్నారు. దక్షిణాది రాష్ట్రాలతో సమానంగా ఎదగాలంటే తమకు మరో పదేళ్లు పడుతుందని అన్నారు. చట్టంలో ఇచ్చిన హామీల నెరవేర్చే విషయంలో వాస్తవాలను ప్రజలకు చెప్పే ధైర్యం బిజెపికి ఉందా? అని సవాల్ చేశారు.

ఆ లేఖను ప్రజలంతా చదవాలి

అమిత్‌షా రాసిన తప్పులతడక లేఖను ప్రజలంతా చదవాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కాపాడేందుకు తాను చేస్తోన్న ఉద్యమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. న్యా యం జరిగే వరకు ఎట్టి పరిస్థితుల్లో పోరాటం చేస్తామన్నారు.హోదా కల్గిన రాష్ట్రాలకు ఇచ్చిన పారిశ్రామిక రాయితీలు, ప్రభుత్వ పథకాలకు ఇచ్చిన విధంగా ఆంధ్రప్రదేశ్‌కు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. చట్టంలో పేర్కొన్న అంశాలను అడుగుతుంటే తమపైనే ఎదురుదాడికి దిగుతున్నారని చంద్రబాబు అన్నారు. 2016 –17సంవత్సరానికి రూ.6600 కోట్లు ఆర్థిక లోటు ఉన్నట్టు ఆర్థిక సంఘం చెప్పిందని తెలిపారు. నిధులు విడుదల చేయాలని నీతిఆయోగ్ సిఫారసు చేశాక కూడా మళ్లీ ఆ డబ్బులు తీసుకోవడం బాధాకరమన్నారు.

ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు తీవ్రవాదులు హతం

శ్రీనగర్ : దక్షిణ కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్ జరిగింది. అనంతనాగ్ జిల్లాలో తీవ్రవాదులకు, భద్రతా దళాలకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు (జెఇఎం) చెందిన ఇద్దరు పాకిస్థాన్ తీవ్రవాదులు హతమైనట్లు పోలీసు అధికారులు తెలిపారు. అనంతనాగ్ దూరులోని శిస్త్రాగమ్‌లో తీవ్రవాదులు సంచరిస్తున్నారన్న సమాచారంతో శుక్రవారం రాత్రి నుంచి భద్రతా దళాలు కూంబింగ్ నిర్వహించినట్లు వారు చెప్పారు. భద్రతా దళాలకు తారసపడిన తీవ్రవాదులు బలగాలపై కాల్పులు దిగగా ఇరుపక్షాల మధ్య ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయన్నారు. తీవ్రవాదులు తప్పించుకోకుండా పెద్ద ఎత్తున బలగాలను ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయని వారు స్పష్టం చేశారు. అయితే శుక్రవారం రాత్రి కొద్ది సేపు ఇరువర్గాల మధ్య ఎదురు కాల్పులు జరగగా, మళ్లీ శనివారం ఉదయం మొదలయ్యాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు తీవ్రవాదులను బలగాలు మట్టుబెట్టాయని వారు పేర్కొన్నారు. అనంతరం ఘటనాస్థలి నుంచి కొన్ని అభ్యంతరకర వస్తువులను స్వాధీనం చేసుకోగా, మృతి చెందిన తీవ్రవాదులు జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు చెందిన వారుగా ధ్రువీకరించినట్లు వారు చెప్పారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం వీరద్దరూ పాకిస్థానంకు చెందినవారుగా తేలిందన్నారు. కాగా, ఎలాంటి నష్టం వాటిల్లంగా ఈ ఆపరేషన్ ముగిసిందన్నారు.

రాశి ఫలాలు




సన్నిహితులు, స్నేహితులతో విభేదాలు. ఆరోగ్య, కుటుంబసమస్యలు వేధిస్తాయి. ముఖ్య కార్యక్రమాలలో ఆటంకాలు. ఖర్చులు పెరుగుతాయి. వ్యాపారులకు నిరాశాజనకం. ఉద్యోగులకు పనిఒత్తిడులు. కళాకారులకు తొందరపాటు నిర్ణయాలు తగదు.



పలుకుబడి మరింత పెరుగుతుంది. కీలక సమాచారం రాగలదు. సోదరులు, స్నేహితులతో ఉల్లాసంగా గడుపుతారు. దేవాలయ దర్శనాలు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులు అనుకున్న హోదాలు సంపాదిస్తారు. రాజకీయవేత్తల కృషి ఫలిస్తుంది.




కార్యక్రమాలలో వెనుకబాటు. ఆదాయం అంతగా కనిపించదు. దూరప్రయాణాలు. బంఎధువుల నుంచి ఒత్తిళ్లు. వ్యాపారులు నిరాశ చెందుతారు. ఉద్యోగులకు బాధ్యతలు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. పారిశ్రామికవేత్తలకు గందరగోళం.



నూతన ఉద్యోగాలు సంపాదిస్తారు. ప్రముఖ వ్యక్తుల పరిచయం. శుభవార్తలు వింటారు. వాహన సౌఖ్యం. వ్యాపారులకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులకు ఉపశమనం లభిస్తుంది. కళాకారులకు అవకాశాలు పెరుగుతాయి.



వ్యయప్రయాసలు. బంఎధువులు, స్నేహితులతో అకారణంగా విభేదాలు. ఆరోగ్య సమస్యలు. కుటుంబంలో ఒత్తిళ్లు. వ్యాపారులు కొంత నిదానం పాటించాలి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు. రాజకీయవేత్తలకు చిక్కులు.



రుణవిముక్తి లభిస్తుంది. ప్రముఖవ్యక్తులు పరిచయం. శుభకార్యాలకు హాజరవుతారు. స్నేహితులతో ఆనందంగా గడుపుతారు. వ్యాపారులకు ప్రోత్సాహం. ఉద్యోగులకు హోదాలు. కళాకారులకు సన్మానాలు.



ఉద్యోగ ప్రయత్నాలు కలసివస్తాయి. సమాజంలో గౌరవం పెరుగుతుంది. అందరిలోనూ గుర్తింపు రాగలదు. వాహనయోగం. వ్యాపారులకు ఊహించని లాభాలు. ఉద్యోగులకు పదోన్నతులు. పారిశ్రామికవేత్తలకు పర్యటనలు.




అప్పులు చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు. శారీరక రుగ్మతలు. కుటుంబబాఎధ్యతలు పెరుగుతాయి. మానసిక అశాంతి. వ్యాపారులకు లాభాలు అనుమానమే. ఉద్యోగులకు పనిఒత్తిడులు. రాజకీయవేత్తలకు నిరాశ.



ఆదాయం కంటే ఖర్చులు పెరుగుతాయి. ఆలోచనలు నిలకడగా ఉండవు. కుటుంబంలో సమస్యలు. ఆరోగ్యం మందగిస్తుంది. వ్యాపారులకు పెట్టుబడుల్లో చిక్కులు. ఉద్యోగులు అదనపు విధులు చేపట్టాల్సి వస్తుంది. కళాకారులకు నిరుత్సాహం.



సన్నిహితులతో ఉత్సాహంగా గడుపుతాలు. బంధువుల నుంచి శుభవర్తమానాలు. అదనపు ఆదాయం సమకూరుతుంది. వస్తులాభాలు.వ్యాపారులకు లాభాలు తథ్యం. ఉద్యోగులకు విధుల్లో చిక్కులు తొలగుతాయి. పారిశ్రామికవేత్తలకు శ్రమ ఫలిస్తుంది.



స్నేహితులతో తగాదాలు. ఆలోచనలు నిలకడగా ఉండవు. కుటుంబసభ్యుల నుంచి మాటపడతారు. కార్యక్రమాలలో ఆటంకాలు. వ్యాపారులకు చికాకులు. ఉద్యోగులకు మార్పులు . రాజకీయవేత్తలకు పర్యటనలు వాయిదా.



కుటుంబ, ఆరోగ్య సమస్యలు. అప్పులు చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు. కార్యక్రమాలు ముందుకు సాగవు. దేవాలయదర్శనాలు. వ్యాపారులకు నిరుత్సాహం. ఉద్యోగులకు బాధ్యతలు మీదపడతాయి. పారిశ్రామికవేత్తలకు విదేశీ పర్యటనలు.

శ్రీలంకపై పాక్ మహిళల క్లీన్ స్వీప్



దంబుల్లా: శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌ను పాకిస్థాన్ మహిళా క్రికెట్ జట్టు 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. శనివారం జరిగిన మూడో వన్డేలో పాకిస్థాన్ 108 పరుగుల భారీ తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది. పాక్‌కు సిరీస్‌లో ఇది వరుసగా మూడో విజయం కాగా, లంక హ్యాట్రిక్ ఓటమి కావడం విశేషం. ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసింది. ఓపెనర్ నాహిదా ఖాన్ ఐదు ఫోర్లతో 46 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. మరో ఓపెనర్ మునీబా అలీ 19 పరుగులు చేసింది. తర్వాత వచ్చిన జవేరియా ఖాన్ 4ఫోర్లతో 30 పరుగులు చేసి పెవిలియన్ చేరింది. కెప్టెన్ బిస్మా మారూఫ్ 26 పరుగులు సాధించింది. సిద్రా అమీన్ 20 పరుగులు, సనా మీర్ 16 పరుగులు చేసి వెనుదిరిగారు. లంక బౌలర్లు వరుసగా వికెట్లు తీయడంతో పాక్ స్కోరు 215కే పరిమితమైంది. తర్వాత స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 107 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ హన్సికా 35 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. రబికా (0), కెప్టెన్ ఆటపట్టి (0) ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరారు. మరోవైపు పాకిస్థాన్ జట్టులో సనా మీర్ అద్భుతంగా రాణించింది. ప్రత్యర్థి బ్యాటర్లను హడలెత్తించిన మీర్ 27 పరుగులు మాత్రమే ఇచ్చి నాలుగు వికెట్లు పడగొట్టింది. నశ్రసంధుకు మూడు, నిదాదర్‌కు రెండు వికెట్లు దక్కాయి.

ఐపిఎల్ ఆరంభ వేడుకలకు బాలీవుడ్ స్టార్లు..



ముంబయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్) ట్వంటీ–20 టోర్నమెంట్ పదకొండో ప్రారంభోత్సవ వేడుకలకు బాలీవుడ్ స్టార్లు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నారు. ఏప్రిల్ 7న ముంబయిలోని వాంఖడే స్టేడియంలో ఈ ప్రారంభ వేడుకలు జరుగనున్నాయి. ఈ వేడుకలను భారీ ఎత్తున నిర్వహించేందుకు ఐపిఎల్ నిర్వాహకులు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో బాలీవుడ్ యువ స్టార్లు అలరించనున్నారు. రణ్‌వీర్ సింగ్, పరిణితి చోప్రా, వరుణ్ ధావన్, జాక్వలిన్ ఫెర్నాండెజ్‌లు తమ ప్రదర్శనతో అభిమానులను కనువిందు చేయనున్నారు. ఈ విషయాన్ని శనివారం ఓ జాతీయ మీడియా వెల్లడించింది. డిఫెండింగ్ చాంపియన్ ముంబయి ఇండియన్స్, మాజీ చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్ జట్ల మధ్య వాంఖడే స్టేడియంలో తొలి మ్యాచ్ జరుగనుంది. ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు ప్రారంభ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. బాలీవుడ్ స్టార్లు తమ ప్రదర్శనతో కనువిందు చేసేందుకు సిద్ధమయ్యారు. వీరితో పాటు చాలా మంది బాలీవుడ్ స్టార్లు, మాజీ, ప్రస్తుత భారత క్రికెటర్లు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నారు. కాగా, ఈసారి వేడుకలకు రెండు జట్ల కెప్టెన్లు మాత్రమే హాజరుకానున్న విషయం తెలిసిందే. ముంబయి కెప్టెన్ రోహిత్ శర్మ, చెన్నై సారథి మహేంద్ర సింగ్ ధోనిలు మాత్రమే ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతున్నారు. ఇదిలావుండగా గతంలో కంటే ఈసారి ఐపిఎల్ ఆరంభోత్సవ వేడుకలు కాస్త భిన్నంగా జరుగనున్నాయి.





దీనికి కారణం సుప్రీం కోర్టు పర్యవేక్షణలోని పాలక మండలి విధించిన ఆంక్షలే కారణం. ప్రారంభోత్సవానికి ఈసారి చాలా తక్కువ మొత్తంలోనే నిధులను కేటాయించారు. గతంలో ఆరంభ వేడుకలకు 30 కోట్ల రూపాయలను కేటాయిస్తే ఈసారి ఈ మొత్తాన్ని రూ.20 కోట్లకు కుదించారు. దీంతో ప్రారంభ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని భావించిన ఐపిఎల్ యాజమాన్యానికి ఇది కొంత కలవర పరిచే అంశమే. మరోవైపు ముంబయి వేదికగా జరిగే ఆరంభోత్సవ కార్యక్రమానికి బాలీవుడ్, క్రికెట్ రంగాలకు చెందిన ప్రముఖులతో పాటు రాజకీయ ప్రముఖులు హాజరు కానున్నారు. దీని కోసం భారీ భద్రత ఏర్పాట్లను చేస్తున్నారు. మరోవైపు ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన టిక్కెట్ల ధరలను కూడా ఈసారి భారీగా పెంచినట్టు సమాచారం. కాంప్లిమెంటరీ పాస్‌లను ఈసారి రద్దు చేసినట్టు తెలిసింది.





బెంగళూరుకు అండర్సన్

బెంగళూరు: న్యూజిలాండ్ స్టార్ ఆల్‌రౌండర్ కోరె అండర్సన్ ఐపిఎల్ పదకొండో సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుకు ప్రాతినిథ్యం వహించనున్నాడు. గాయపడిన ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ నాథన్ కౌల్టర్ నీల్ స్థానంలో అండర్సన్‌ను బెంగళూరు కొనుగోలు చేసింది. వేలం పాటలో అండర్సన్‌కు కేటాయించిన రెండు కోట్ల రూపాయల కనీస ధరకు బెంగళూరు సొంతం చేసుకుంది. బ్యాటింగ్, బౌలింగ్‌లో అసాధారణంగా రాణించే అండర్సన్ ప్రపంచంలోని అత్యుత్తమ ఆల్‌రౌండర్లలో ఒకడిగా పేరు తెచ్చుకున్న విషయం తెలిసిందే. కాగా, కౌల్టర్ నీల్‌ను బెంగళూరు రూ.2.20 కోట్లకు సొంతం చేసుకుంది. కాగా ఐపిఎల్ ప్రారంభానికి ముందు నీల్ గాయపడ్డాడు. దీంతో అతనికి కనీసం రెండు నెలల విశ్రాంతి అవసరమని వైద్యులు తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఐపిఎల్ టోర్నమెంట్‌కు అతను అందుబాటులో లేకుండా పోయాడు. తప్పనిసరి పరిస్థితుల్లో బెంగళూరు అతన్ని వదులుకోలేక తప్పలేదు. కాగా, నీల్‌కు బదులు కివీస్ ఆల్‌రౌండర్ అండర్సన్‌ను దక్కించుకుంది. మరోవైపు ఈ విషయాన్ని జట్టు కోచ్ డానియల్ వెటోరి శనివారం ప్రకటించారు.

మూడో రోజు ఆట వర్షార్పణం

అక్లాండ్: ఇంగ్లాండ్–న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న డే–నైట్ టెస్టు మ్యాచ్‌కు వర్షం వెంటాడుతూనే ఉంది. భారీ వర్షం వల్ల శనివారం మూడో రోజు ఆట ఒక్క బంతి పడకుండానే రద్దయ్యింది. రెండో రోజు ప్రారంభమైన వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది. దీంతో మూడో రోజు పూర్తి ఆటను రద్దు చేయక తప్పలేదు. దాదాపు రోజున్న ఆట వర్షం వల్ల రద్దు కావడంతో అభిమానులు నిరాశకు గురయ్యారు. ఈ డే–నైట్ టెస్టులో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 58 పరుగులకే కుప్పకూలిన విషయం తెలిసిందే. టీమ్ సౌథి ఆరు, బౌల్ట్ నాలుగు వికెట్లు తీసి ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు. కాగా, తర్వాత బ్యాటింగ్ చేపట్టిన న్యూజిలాండ్ 4 వికెట్ల నష్టానికి 233 పరుగులు చేసింది. కివీస్ కెప్టెన్ కానె విలియమ్సన్ 102 రికార్డు సెంచరీ నెలకొల్పాడు. హెన్రి నికోలస్ 52, వాట్లింగ్ 18 పరుగులతో క్రీజులో ఉన్నారు. మరోవైపు కివీస్‌కు ఇప్పటికే 175 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.



20 బంతుల్లోనే శతకం

- చరిత్ర సృష్టించిన సాహా



కోల్‌కతా: భారత టెస్టు వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా పెను ప్రకంపనమే సృష్టించాడు. శనివారం కోల్‌కతాలో జరిగిన జెసి ముఖర్జి లోకల్ ట్వంటీ–20 టోర్నమెంట్‌లో సాహా 20 బంతుల్లోనే సెంచరీ సాధించి కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. మోహన్ బగాన్ జట్టుకు ప్రాతినిథ్యం వహించిన సాహా 20 బంతుల్లోనే సెంచరీ సాధించి రికార్డు సృష్టించాడు. ఆకాశమే హద్దుగా చెలరేగిన సాహా 20 బంతుల్లోనే 14 భారీ సిక్సర్లు, మరో నాలుగు బౌండరీలతో 102 పరుగులు చేశాడు. ఐపిఎల్ చరిత్రలో ఇదే అత్యంత వేగవంతమైన సెంచరీ కావడం విశేషం. ప్రత్యర్థి బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా ఆడిన సాహా వరుస సిక్సర్లతో హోరెత్తించాడు. అతన్ని ఎలా కట్టడి చేయాలో తెలియక ప్రత్యర్థి బౌలర్లు కొట్టుమిట్టాడారు. సాహా దూకుడైన బ్యాటింగ్‌తో బగాన్ జట్టు 152 పరుగుల లక్ష్యాన్ని ఏడు ఓవర్లలోనే ఛేదించి మరో రికార్డును నెలకొల్పింది. ముందుగా బ్యాటింగ్ చేసిన బిఎస్‌ఆర్ రిక్రియేషన్ క్లబ్ 151 పరుగులు చేసింది. వీరు ఉంచిన లక్ష్యాన్ని బగాన్ జట్టు ఏడు ఓవర్లలోనే అందుకుంది. కాగా, మ్యాచ్ అనంతరం సాహా మాట్లాడుతూ తన బ్యాటింగ్ ఇప్పటికి నమ్మశక్యంగా లేదన్నాడు. రానున్న ఐపిఎల్‌ను దృష్టిలో ఉంచుకొని ధాటిగా ఆడాలని భావించానన్నాడు. అయితే ప్రత్యర్థి బౌలర్లు మరి చెత్త బంతులు వేయడంతో దాన్ని సిక్స్‌లుగా మలచడం తనకు కష్టమేమి కాలేదన్నాడు. కాగా, ఈ ఇన్నింగ్స్ ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యిందన్నాడు. ఐపిఎల్‌లో సన్‌రైజర్స్‌కు అండగా నిలువడమే తన లక్ష్యమన్నాడు. ఇందుకోసం ప్రత్యేక వ్యూహంతో బరిలోకి దిగుతున్నట్టు వివరించాడు.

ఇంగ్లాండ్‌లో రాణిస్తాం

- శిఖర్ ధావన్

న్యూఢిల్లీ: రానున్న ఇంగ్లాండ్ సిరీస్‌లో టీమిండియా మెరుగైన ప్రదర్శన కనబరచడం ఖాయమని భారత స్టార్ ఓపెనర్ శిఖర్ ధావన్ జోస్యం చెప్పాడు. దక్షిణాఫ్రికా సిరీస్‌లో చిరస్మరణీయ ప్రదర్శన కనబరిచిన భారత్ ఈ సిరీస్‌కు సమరోత్సాహంతో సిద్ధమవుతుందన్నాడు. సఫారీలపై అసాధారణ ఆటను కనబరచడంతో జట్టు ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యిందన్నాడు. ఇంగ్లాండ్ సిరీస్‌లో భారత్‌కు మంచి అవకాశాలు ఉంటాయన్నాడు. ఇటీవల కాలంలో భారత్ చాలా బలంగా మారిందన్నాడు. స్వదేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా నిలకడైన విజయాలతో ప్రకంపనలు సృష్టిస్తున్న విషయాన్ని ధావన్ గుర్తు చేశాడు. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో భారత్ చాలా బలంగా తయారైందన్నాడు. కోహ్లి సారథ్యంలో భారత్ ప్రపంచంలోనే అత్యుత్తమ జట్టుగా ఎదిగిందన్నాడు. మరి కొన్నేళ్లపాటు ప్రపంచ క్రికెట్‌లో భారత్ హవా కొనసాగడం ఖాయమన్నాడు. కాగా, తన బ్యాటింగ్‌పై సైతం ధావన్ సంతృప్తి వ్యక్తం చేశాడు. కొంతకాలంగా నిలకడైన బ్యాటింగ్‌తో జట్టుకు అండగా నిలువడాన్ని గర్వంగా భావిస్తున్నట్టు తెలిపాడు. జట్టు విజయాల్లో తనవంతు పాత్ర పోషించడం చాలా ఆనందంగా ఉందన్నాడు. సౌతాఫ్రికా సిరీస్‌లో రాణించడం ఎంతో ఊరటనిచ్చిందన్నాడు. గతంలో విదేశి సిరీస్‌లలో తన ప్రదర్శన చాలా పేలవంగా ఉండేదన్నాడు. కానీ, కఠోర సాధనతో ఆటను మెరుగు పరుచుకున్నానని వివరించాడు. దక్షిణాఫ్రికా సిరీస్ తర్వాత తన ఆత్మవిశ్వాసం ఎంతో పెరిగిందన్నాడు. భవిష్యత్తులో జరిగే విదేశి సిరీస్‌లలో నిలకడగా రాణించడమే తమ ముందున్న ఏకైక లక్ష్యమన్నాడు. జట్టు యాజమాన్యం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టేందుకు శాయశక్తుల ప్రయత్నిస్తానని ధావన్ అన్నాడు. కాగా, తనకు ఏడు కోట్ల పారితోషికాన్ని ప్రకటించడంపై ధావన్ ఆనందం వ్యక్తం చేశాడు. తనకు ఇంత పెద్ద మొత్తంలో వేతనం లభిస్తుందని కలలో కూడా ఊహించలేదన్నాడు. కాగా, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టి జట్టుకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చాడు. మూడు ఫార్మాట్‌లలో కూడా నిలకడగా ఆడడమే తన లక్ష్యమన్నాడు. దీని కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతానని తెలిపాడు. మరోవైపు రానున్న ఐపిఎల్ టోర్నమెంట్ కోసం ఎంతో ఆతృతతో ఎదురు చూస్తున్నానని పేర్కొన్నాడు. ఐపిఎల్‌లో రాణించడం ద్వారా ఫాంను మరింత మెరుగు పరుచుకోవాలని భావిస్తున్నట్టు భారత డాషింగ్ ఓపెనర్ ధావన్ వివరించాడు. ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ ధావన్ ఈ విషయాలు వెల్లడించాడు.



కౌంటీ క్రికెట్‌కు విరాట్ కోహ్లి



- అఫ్గాన్‌తో టెస్టుకు దూరం!


ముంబయి: అఫ్గానిస్థాన్‌తో స్వదేశంలో జరిగే చారిత్రక టెస్టుకు భారత కెప్టెన్ విరాట్ కోహ్లి దూరం కానున్నాడు. రానున్న ఇంగ్లాండ్ పర్యటనను దృష్టిలో పెట్టుకొని భారత కెప్టెన్ కోహ్లి కౌంటీ క్రికెట్ ఆడేందుకు ఆసక్తి కనబరుస్తున్నాడు. దీంతో ఐపిఎల్ సీజన్ ముగిసిన వెంటనే అతను కౌంటీ క్రికెట్ కోసం ఇంగ్లాండ్ బయలు దేరి వెళ్లాలని నిర్ణయించాడు. ఆగస్టు నెలలో భారత క్రికెట్ జట్టు ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ సుదీర్ఘ పర్యటనలో భారత్ టెస్టులు, వన్డే, టి–20లలో ఇంగ్లాండ్‌తో తలపడనుంది. కాగా, ఈ సిరీస్‌కు సన్నద్ధం కావాలనే ఉద్దేశంతో కోహ్లి కౌంటీ క్రికెట్ ఆడాలని భావిస్తున్నాడు. సర్రే జట్టు తరపున అతను ఆడే అవకాశాలున్నాయి.

ఈ మేరకు సర్రేతో ఒప్పందం కూడా కుదుర్చుకున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెల్లువెత్తాయి. అయితే దీనిపై కోహ్లి అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. ప్రస్తుతం కోహ్లి విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఐపిఎల్ సీజన్‌లో బెంగళూరును విజయ పథంలో నడిపించేందుకు కోచ్ వెటోరితో కలిసి ప్రణాళికలు రూపొందిస్తున్నాడు. కాగా, బెంగళూరు తన తొలి మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో తలపడుతుంది. మరోవైపు గ తంలో ఇంగ్లాండ్‌లో పర్యటించిన సందర్భాల్లో కోహ్లి ఘోరంగా విఫలమైన విషయం తెలిసిందే. పేలవమైన ఆటతో విమర్శలు ఎదుర్కొన్నాడు. కాగా, ఈసారి పర్యటనలో ఎటువంటి పొరపాట్లకు తావు ఇవ్వకూడదనే లక్ష్యంతో ఉన్నాడు. దీని కోసం కౌంటీల్లో ఆడడం ద్వారా ఇంగ్లాండ్ పరిస్థితులకు అలవాటు పడాలని భావిస్తున్నాడు. అందుకే అఫ్గాన్‌తో జరిగే చారిత్రాత్మక టెస్టుకు సైతం దూరం కావాలని నిర్ణయించాడు. కాగా, ఐపిఎల్ ముగిసిన వెంటనే అఫ్గానిస్థాన్‌తో భారత్ టెస్టు మ్యాచ్ ఆడనుంది. అఫ్గాన్ తన టెస్టు ప్రస్థానాన్ని భారత్‌తో ప్రారంభించనున్న విషయం తెలిసిందే.

పట్టుబిగించిన సౌతాఫ్రికా

- ఆస్ట్రేలియాతో మూడో టెస్టు

కేప్‌టౌన్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్టులో ఆతిథ్య దక్షిణాఫ్రికా పట్టుబిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో కీలక ఆధిక్యం సాధించిన సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లోనూ మెరుగైన బ్యాటింగ్‌తో ఆకట్టుకుంది. శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 238 పరుగులు చేసింది. దీంతో ఇప్పటి వరకు సౌతాఫ్రికా ఆధిక్యం 294 పరుగులకు చేరింది. బౌలింగ్ సహకరించే న్యూలాండ్స్ పిచ్‌పై నాలుగో ఇన్నింగ్స్‌లో ఇంత భారీ లక్ష్యాన్ని ఛేదించడం ఏ జట్టుకైన అంత సులువుకాదు. దీంతో ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా మెరుగైన స్థితికి చేరిందనే చెప్పాలి. అంతకుముందు ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 255 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ హాజిల్‌వుడ్ 10 పరుగులు చేసి రబడా బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు. దీంతో దక్షిణాఫ్రికాకు 56 పరుగుల ఆధిక్యం లభించింది. తర్వాత రెండో ఇన్నింగ్స్ చేపట్టిన సౌతాఫ్రికాకు ప్రారంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ డీన్ ఎల్గర్ 14 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరాడు. ఈ దశలో హాషిం ఆమ్లాతో కలిసి మరో ఓపెనర్ మార్‌క్రామ్ ఇన్నింగ్స్‌ను కుదుట పరిచాడు. ఇద్దరు ఆస్ట్రేలియా బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. మార్‌క్రామ్ దూకుడుగా ఆడగా ఆమ్లా సమన్వయంతో పాటించాడు. ఇద్దరు కుదురుగా ఆడడంతో సౌతాఫ్రికా స్కోరును వంద దాటింది. కాగా సమన్వయంతో ఆడుతున్న ఆమ్లా (31)ను కమిన్స్ వెనక్కి పంపాడు. తర్వాత వచ్చిన డివిలియర్స్‌తో కలిసి మార్‌క్రామ్ స్కోరును ముందుకు తీసుకెళ్లాడు. ధాటిగా ఆడిన మార్‌క్రామ్ పది ఫోర్లు, రెండు సిక్సర్లతో 84 పరుగులు చేసి ఔటయ్యాడు. మరోవైపు కెప్టెన్ డుప్లెసిస్ 20 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన డివిలియర్స్ ఆరు ఫోర్లు, ఒక సిక్స్‌తో 51 పరుగులు చేసి క్రీజులో నిలిచాడు. అతనికి వికెట్ కీపర్ డికాక్ 29 (నాటౌట్) అండగా నిలిచాడు.





Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.